www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 2-6-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 64 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి రా.8.36 తదుపరి అష్టమి; నక్షత్రం: మఖ రా.10.56 తదుపరి పుబ్బ; వర్జ్యం: ఉ.10.16-11.57; దుర్ముహూర్తం: మ.12.39-1.31, మ.3.15-4.06; అమృతఘడియలు: రా.8.24-10.05; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 5.43; సూర్యాస్తమయం: 6.42 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
వరంగల్ ● సోమవారం 2 జూన్ 2025




8న రింకూ నిశ్చితార్థం

జాన్‌పూర్ (యూపీ): సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ప్రియా సరోజ్‌తో క్రికెటర్ రింకూ సింగ్ నిశ్చితార్థం ఈ నెల 8న లఖ్‌నవూలో జరగనుంది. ప్రియ తండ్రి తుఫానీ సరోజ్ ఆదివారం ఈ విషయాన్ని వెల్లడించారు. నవంబరు 18న వారణాసిలోని తాజ్ హోటల్‌లో వీరి వివాహం జరుగుతుందన్నారు. ఈ వేడుకకు సన్నిహితులను మాత్రమే ఆహ్వానించినట్టు చెప్పారు. ప్రియ, రింకూలకు కొంతకాలంగా పరిచయం ఉందని.. ఇరు కుటుంబాల అంగీకారంతో పెళ్లిని ఫిక్స్ చేసినట్టు సరోజ్ తెలిపారు. 26ఏళ్ల ప్రియ ఉత్తరప్రదేశ్‌లోని మచిలీషహర్ నియోజవర్గం నుంచి తొలిసారి పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. రింకూ అదే రాష్ట్రంలోని అలీగఢ్‌కు చెందినవాడు.

రెండో రోజు టాపర్..మోహన్

- రూ. 78 లక్షలకు ముంబా వశం
- ముగిసిన ప్రొ కబడ్డీ వేలం

ముంబై: ప్రొ కబడ్డీ లీగ్ వేలం రెండో రోజు అనిల్ మోహన్ అత్యధిక ధర పలికిన ఆటగాడిగా నిలిచాడు. ఆదివారం జరిగిన సి, డి కేటగిరీ ఆటగాళ్ల బిడ్డింగ్‌లో ఆల్‌రౌండర్ మోహన్‌ను యు ముంబా రూ. 78 లక్షలకు కొనుగోలు చేసింది. ఆకాశ్ షిండే (బెంగళూరు), ఉదయ్, నితిన్ రావల్ (జైపూర్) రూ. 50 లక్షల మార్క్ అందుకున్నారు. మొత్తంగా 12వ సీజన్ కోసం రెండు రోజులపాటు జరిగిన వేలంలో నమోదు చేసుకొన్న 529 మంది ఆటగాళ్లలో 121 మంది అమ్ముడయ్యారు. వేలంలో ఇద్దరు ప్లేయర్లే రూ. 2 కోట్ల మార్క్ దాటారు. అత్యధికంగా మహమద్ రెజా రూ. 2.23 కోట్లు పలకగా.. దేవాంక్ దలాల్ రూ. 2.20 కోట్లతో రెండో స్థానంలో నిలిచాడు. కాగా, స్టార్ రైడర్లు పర్‌దీప్ నర్వాల్, సిద్దార్థ్ దేశాయ్ అన్‌సోల్డ్‌గా మిగిలారు.

చాంపియన్.. విహాన్



హైదరాబాద్: టెన్నిస్ ఆటగాడు విహాన్ ములుకుట్ల.. ఫ్రాన్స్‌లో జరిగిన టెన్ ప్రో గ్లోబల్ జూనియర్ టూర్ ఈవెంట్‌లో అండర్-12 సింగిల్స్ టైటిల్ విజేతగా అవతరించాడు. ఈ హైదరాబాద్ చిన్నారి ఫైనల్లో 6-3, 6-3తో మార్టినెజ్‌పై నెగ్గాడు. అండర్-13 విభాగంలో విహాన్ రన్నరప్‌గా నిలిచాడు.

అయ్యారే.. పంజాబ్

- ముంబైపై అద్భుత విజయం
- ఐపీఎల్ ఫైనల్లో ప్రవేశం
- శ్రేయాస్ కెప్టెన్ ఇన్నింగ్స్


శ్రేయాస్ అయ్యర్ (87 నాటౌట్)

అహ్మదాబాద్: ఉత్కంఠభరితంగా సాగిన క్వాలిఫయర్-2లో పంజాబ్ కింగ్స్ అదరగొట్టింది. తమ చివరి మ్యాచ్‌లో కేవలం 101 పరుగులకే కుప్పకూలిన ఈ జట్టు అత్యంత కీలకమైన ఈ మ్యాచ్‌లో మాత్రం విజృంభించింది. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (41 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్సర్లతో 87 నాటౌట్) చిరస్మరణీయ ఇన్నింగ్స్ కారణంగా.. ఆదివారం ముంబై ఇండియన్స్‌పై పంజాబ్ 5 వికెట్ల తేడాతో నెగ్గింది. తద్వారా ఈనెల 3న జరిగే ఫైనల్లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో తలపడనుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 6 వికెట్లకు 203 పరుగుల భారీ స్కోరు సాధించింది. సూర్యకుమార్ (44), తిలక్ వర్మ (44), బెయిర్‌స్టో (38), నమన్ (37) రాణించారు. ఒమర్జాయ్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత భారీ ఛేదనలో పంజాబ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 207 పరుగులు చేసి నెగ్గింది. నేహల్ (48), ఇన్‌గ్లిస్ (38) ఆకట్టుకున్నారు. అశ్వనికి రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా శ్రేయాస్ అయ్యర్ నిలిచాడు.

శ్రేయాస్ ధనాధన్: కెప్టెన్ శ్రేయాస్ సూపర్ ఇన్నింగ్స్‌తో భారీ ఛేదనలో పంజాబ్ దూసుకెళ్లింది. మిడిలార్డర్ అద్భుతంగా రాణించడంతో లక్ష్యం వైపు వేగంగా సాగింది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ (6) నిరాశపర్చగా.. ఇన్‌గ్లిస్ ఆరంభంలో చెలరేగాడు. బుమ్రా వేసిన ఇన్నింగ్స్ ఐదో ఓవర్‌లో తను 4,6,4,6తో 20 పరుగులు రాబట్టాడు. ఆరో ఓవర్‌లో ప్రియాన్ష్ (20) వెనుదిరిగినా పవర్‌ప్లేలో 64/2 స్కోరుతో నిలిచింది. ఆ తర్వాత మూడు ఓవర్లలో వీరి ఆట నెమ్మదించగా ఇన్‌గ్లిస్ వికెట్ కూడా కోల్పోయింది. అయితే నేహల్-శ్రేయాస్ జోడీ ముంబై బౌలర్లపై జోరు చూపింది. 13వ ఓవర్‌లో శ్రేయాస్ హ్యాట్రిక్ సిక్సర్లతో విజృంభించాడు. అటు బౌల్ట్ ఓవర్‌లో నేహల్ రెండు ఫోర్లు సాధించడంతో ముంబైలో ఉత్కంఠ పెరిగింది. అయితే 16వ ఓవర్‌లో నేహల్‌ను స్పిన్నర్ అశ్వని అవుట్ చేయడంతో నాలుగో వికెట్‌కు 84 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అటు శ్రేయాస్ మాత్రం 27 బంతుల్లోనే ఫిఫ్టీని పూర్తి చేశాడు. శశాంక్ (2) రనౌట్ కాగా 18వ ఓవర్‌లో బుమ్రా 8 పరుగులే ఇచ్చాడు. కానీ 19వ ఓవర్‌లో శ్రేయాస్ నాలుగు సిక్సర్లతో 26 పరుగులు రాబట్టి మ్యాచ్‌ను ముగించాడు.

కలిసికట్టుగా..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబై ఇన్నింగ్స్ మెరుపు వేగంతో సాగింది. ఓపెనర్ రోహిత్ (8) మూడో ఓవర్‌లోనే వెనుదిరిగినా.. బెయిర్‌స్టో-తిలక్ జోడీ ఎదురుదాడికి దిగింది. అటు సూర్యకుమార్.. చివర్లో నమన్ ధిర్ తుఫాన్ ఇన్నింగ్స్‌తో జట్టు భారీ స్కోరు అందుకుంది. వన్‌డౌన్‌లో బరిలోకి దిగిన తిలక్ వచ్చీ రావడంతోనే రెండు సిక్సర్లతో చెలరేగాడు. ఆరో ఓవర్‌లో బెయిర్‌స్టో 4,6తో పవర్‌ప్లేలో జట్టు 65/1 స్కోరుతో నిలిచింది. కానీ తర్వాతి ఓవర్‌లోనే వైశాక్ నకుల్ బాల్‌కు బెయిర్‌స్టో వెనుదిరిగాడు. దీంతో రెండో వికెట్‌కు 51 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత తిలక్‌కు సూర్యకుమార్ జత కట్టడంతో రన్‌రేట్ పది రన్స్‌కు తగ్గకుండా సాగింది. స్పిన్నర్ చాహల్ లక్ష్యంగా సూర్య పదో ఓవర్‌లో 6,4.. 12వ ఓవర్‌లో మరో సిక్సర్‌తో ధాటిని కనబర్చాడు. అయితే ఎడాపెడా షాట్లతో ప్రమాదకరంగా మారిన ఈ జోడీకి చాహల్ చెక్ పెట్టాడు. 14వ ఓవర్‌లో సూర్య 4,6 బాదినా ఐదో బంతికి వెనుదిరిగాడు. అప్పటికే మూడో వికెట్‌కు 72 పరుగులు జత చేరాయి. తర్వాతి ఓవర్‌లోనే తిలక్‌కు పేసర్ జేమిసన్ షాకిచ్చాడు. కాసేపటికే కెప్టెన్ హార్దిక్ (15)ను ఓ బౌన్సర్‌తో పేసర్ ఒమర్జాయ్ అవుట్ చేశాడు. కానీ నమన్ ధిర్ మాత్రం చివర్లో బౌండరీలతో జోరు చూపాడు. ఆఖరి ఓవర్‌లో తను అవుటైనా ముంబై 200 స్కోరు దాటగలిగింది.

రెండున్నర గంటలు ఆలస్యంగా..

వర్షం కారణంగా ఈ మ్యాచ్ నిర్ణీత సమయంకన్నా రెండున్నర గంటలు ఆలస్యంగా ఆరంభమైంది. టాస్ వేసేటప్పుడు వాతావరణం మెరుగ్గానే ఉన్నా సరిగ్గా మ్యాచ్ సమయానికి వర్షం ఆరంభమైంది. దీంతో ఎలాంటి ఓవర్ల కోత లేకుండా రాత్రి 9.45కి మ్యాచ్ ఆరంభమైంది.

1

ఐపీఎల్ సీజన్‌లో ఓపెనర్‌గా ఆడకుండానే ఎక్కువ పరుగులు (717) సాధించిన బ్యాటర్‌గా సూర్యకుమార్.

ఐపీఎల్ ప్లేఆఫ్స్‌లో ఒక్క ఆటగాడి హాఫ్ సెంచరీ లేకుండానే ఓ జట్టు (ముంబై) 200+ స్కోరు సాధించడం ఇదే తొలిసారి.

స్కోరుబోర్డు

ముంబై: రోహిత్ (సి) వైశాఖ్ (బి) స్టొయినిస్ 8, బెయిర్‌స్టో (సి) ఇంగ్లిస్ (బి) వైశాఖ్ 38, తిలక్ (సి) ప్రియాన్ష్ (బి) జేమీసన్ 44, సూర్యకుమార్ (సి) వధేరా (బి) చాహల్ 44, హార్దిక్ (సి) ఇంగ్లిస్ (బి) ఒమర్జాయ్ 15, నమన్ (సి) స్టొయినిస్ (బి) ఒమర్జాయ్ 37, రాజ్ బవ (నాటౌట్) 8, శాంట్నర్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 20 ఓవర్లలో 203/6; వికెట్ల పతనం:** 1-19, 2-70, 3-142, 4-142, 5-180, 6-197; **బౌలింగ్:** అర్షదీప్ 4-0-44-0, జేమీసన్ 4-0-30-1, స్టొయినిస్ 1-0-14-1, ఒమర్జాయ్ 4-0-43-2, విజయ్‌కుమార్ వైశాఖ్ 3-0-30-1, చాహల్ 4-0-39-1.

పంజాబ్: ప్రియాన్ష్ (సి) హార్దిక్ (బి) అశ్వని కుమార్ 20, ప్రభ్‌సిమ్రన్ (సి) టోప్లే (బి) బౌల్ట్ 6, ఇంగ్లిస్ (సి) బెయిర్‌స్టో (బి) హార్దిక్ 38, శ్రేయాస్ (నాటౌట్) 87, నేహల్ (సి)శాంట్నర్ (బి) అశ్వని కుమార్ 48, శశాంక్ (రనౌట్) 2, స్టొయినిస్ (నాటౌట్) 2, **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 19 ఓవర్లలో 207/5; వికెట్ల పతనం:** 1-13, 2-55, 3-72, 4-156, 5-169; **బౌలింగ్:** బౌల్ట్ 4-0-38-1, టోప్లే 3-0-40-0, బుమ్రా 4-0-40-0, అశ్వని కుమార్ 4-0-55-2, శాంట్నర్ 2-0-15-0, హార్దిక్ 2-0-19-1.


ఫ్రెంచ్ ఓపెన్



పౌలినీకి స్వితోలినా షాక్

క్వార్టర్స్‌కు స్వియటెక్, సబలెంక, అల్కారజ్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో డిఫెండింగ్ చాంపియన్ స్వియటెక్, టాప్ సీడ్ సబలెంక క్వార్టర్స్‌కు చేరుకున్నారు. అయితే, గతేడాది రన్నరప్ జాస్మిన్ పౌలినీకి 13వ సీడ్ స్విటోలినా షాకిచ్చింది. మ్యాచ్ పాయింట్ నుంచి మలుపు తిప్పిన ఉక్రెయిన్ భామ స్విటోలినా 4-6, 7-6(6), 6-1తో నాలుగో సీడ్ పౌలినీపై అద్భుత విజయంతో ముందంజ వేసి క్వార్టర్స్ చేరింది. మరో ప్రీక్వార్టర్స్‌లో స్వియటెక్ 1-6, 6-3, 7-5తో 13వ సీడ్ రిబకినాపై నెగ్గింది. సబలెంక 7-5, 6-3తో 16వ సీడ్ అనిసిమోవాపై, 8వ సీడ్ క్విన్‌వెన్ జాంగ్ 7-6(5), 1-6, 6-3తో సమ్‌సనోవాపై గెలిచారు. పురుషుల సింగిల్స్‌లో రెండో సీడ్ కార్లోస్ అల్కారజ్ 7-6(8), 6-3, 4-6, 6-4తో 13వ సీడ్ బెన్ షెల్టన్‌పై, 12వ సీడ్ టామీ పాల్ 6-3, 6-3, 6-3తో అలెక్సీ పాపిరన్‌పై గెలిచి క్వార్టర్స్‌లో ప్రవేశించారు.

కబడ్డీ సంఘంలో నిధుల అవకతవకలపై కమిటీ

వారంలో నివేదిక ఇవ్వాలని అధ్యక్షుడి ఆదేశం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ కబడ్డీ సంఘం (టీకేఏ) నిధులు దుర్వినియోగమయ్యాయన్న ఆరోపణలపై నిజానిజాలను నిగ్గు తేల్చేందుకు ఐదుగురు సభ్యులతో కమిటీ వేసినట్టు ఆ సంఘం అధ్యక్షుడు కాసాని వీరేష్ వెల్లడించారు. ఆదివారం మాదాపూర్‌లోని ఒక హోటల్‌లో టీకేఏ వార్షిక సర్వ సభ్య సమావేశం జరిగింది. తెలంగాణ కబడ్డీ సంఘం నిధుల అవకతవకలపై అబిడ్స్ పోలీసు స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ పైన ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చ జరిగినట్టు తెలుస్తోంది. రాష్ట్ర కబడ్డీ సంఘంలో సీనియర్ సభ్యుడైన అజీజ్ నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో కమిటీ వేశామని, వారం రోజుల్లో ఈ విషయంపై ప్రాథమిక నివేదిక అందుతుందని వీరేష్ చెప్పారు. నివేదిక వచ్చిన తర్వాత ఈ విషయంపై స్పందిస్తామని తెలిపారు. టీకేఏ మాజీ సంయుక్త కార్యదర్శి తోట గోపీ ఫిర్యాదు మేరకు అబిడ్స్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఈ కేసు దర్యాప్తు చేస్తుండడం తెలిసిందే. ఇక, ఈ ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, కొందరు తనపై కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర ఒలింపిక్ సంఘం, కబడ్డీ అసోసియేషన్ మాజీ కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్ వివరణ ఇచ్చారు.

బిజినెస్

25,150 పైన బుల్లిష్

(జూన్ 2-6 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం 24,650-25,067 పాయింట్ల మధ్యన కదలాడి 103 పాయింట్ల నష్టంతో 24,751 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,150 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24,770, 24,791, 24,809, 24,555 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 25,150 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 24,350
నిరోధ స్థాయిలు: 24,950, 25,050, 25,150 (24,850 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24,550, 24,450, 24,350 (24,650 దిగువన బేరిష్)

రెండేళ్లలో ఐపీఓకి మలబార్ గోల్డ్

న్యూఢిల్లీ: ఆభరణాల రిటైలింగ్‌లోని మలబార్ గోల్డ్ 2027-28 ఆర్థిక సంవత్సరంలో పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి రావాలని భావిస్తోంది. బంగారం ధరలు రికార్డు గరిష్ఠ స్థాయిలకు చేరినప్పటికీ ఈ ఏడాది ఆదాయాల్లో 20 శాతం వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నట్టు కంపెనీ వ్యవస్థాపకుడు, చైర్మన్ ఎంపీ అహ్మద్ చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆదాయం రూ.62,000 కోట్లుంది. విస్తరణ వ్యూహంలో భాగంగా దేశంలో 60, విదేశాల్లో 30 స్టోర్లు ప్రారంభించాలని యోచిస్తున్నట్టు ఆయన తెలిపారు. కాగా స్టాక్ మార్కెట్లో లిస్టింగ్‌కు ఇప్పటికే సన్నాహాలు ప్రారంభమయ్యాయన్నారు. దేశవిదేశాల్లో ప్రస్తుతం మలబార్ గోల్డ్ 391 స్టోర్లను నిర్వహిస్తోంది.

విస్తరణ బాటలో విమానయాన సంస్థలు

- 30 ఏ350 విమానాలకు ఇండిగో ఆర్డర్
- అదేబాటలో ఎయిర్ ఇండియా!



న్యూఢిల్లీ: విమానాల తయారీ సంస్థలైన ఎయిర్‌బస్, బోయింగ్‌లకు భారత్ అతిపెద్ద మార్కెట్‌గా మారుతోంది. ఇండిగో ఎయిర్‌లైన్స్.. ఎయిర్‌బస్ నుంచి మరో 30 ఏ350 రకం విమానాలు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఢిల్లీలో జరుగుతున్న ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) సదస్సుకు హాజరైన సందర్భంగా ఇండిగో సీఈఓ పీటర్ ఎల్బర్స్ ఈ విషయం వెల్లడించారు. గత ఏడాది ఏప్రిల్‌లోనూ ఇండిగో.. ఎయిర్‌బస్ నుంచి 30 ఏ350 రకం విమానాలు కొనేందుకు ఆర్డర్ పెట్టింది. తాజా ఆర్డర్‌తో ఎయిర్‌బస్ నుంచి ఇండిగో కొనే ఏ350 విమానాల సంఖ్య 60కి చేరింది. ఇండిగో ఈ విమానాలను విదేశాల్లోని సుదూర ప్రాంతాలకు నడుపుతుంది. వ్యాపార విస్తరణలో భాగంగా ఇండిగో రానున్న సంవత్సరాల్లో 900కు పైగా కొత్త విమానాలను సమకూర్చుకోనుంది.

ఎయిర్ ఇండియా 200 విమానాలకు!

టాటాల నిర్వహణలోని ఎయిర్ ఇండియా (ఏఐ) కూడా పెద్దఎత్తున విస్తరణ చేపడుతోంది. ఇందుకోసం పెద్ద మొత్తంలో కొత్త విమానాల కొనుగోలుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం ఇప్పటికే ఎయిర్‌బస్, బోయింగ్ కంపెనీలతో కంపెనీ చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. ఈ ఆర్డర్ కూడా దాదాపు 200 విమానాల వరకు ఉంటుందని భావిస్తున్నారు. ఎయిర్‌బస్, బోయింగ్ నుంచి 470 విమానాల కొనుగోలుకు ఏఐ ఇప్పటికే ఒప్పందాలు కుదుర్చుకుంది. పెరుగుతున్న గిరాకీని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులతో పాటు సరుకు రవాణా కోసం కొత్త విమాన సర్వీసులు ప్రారంభిస్తామని కంపెనీ సీఈఓ, ఎండీ క్యాంప్‌బెల్ విల్సన్ ఐఏటీఏ సదస్సులో ప్రకటించడం ఇందుకు మరింత బలం చేకూరుస్తోంది. 2028కల్లా దేశీయ విమానయాన మార్కెట్లో కనీసం 30 శాతం వాటా సాధించడమే తమ లక్ష్యమన్నారు.

పెరుగుతున్న భాగస్వామ్యాలు

మరోవైపు మన దేశానికి చెందిన విమానయాన సంస్థలు విదేశీ విమానయాన సంస్థలతో భాగస్వామ్య ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి. తాజాగా ఇండిగో.. డెల్టా ఎయిర్‌లైన్స్, ఎయిర్ ఫ్రాన్స్-కేఎల్ఎం, వర్జిన్ అట్లాంటిక్ సంస్థలతో భాగస్వామ్యం ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో యూరప్, ఉత్తర అమెరికా ఖండాల్లో దేశాలతో ఇండిగోకు మరింత కనెక్టివిటీ ఏర్పడుతుంది. దీంతో టిక్కెట్ల బుకింగ్‌లో ఈ సంస్థలన్నీ పరస్పరం సహకరించుకుంటాయి. ఇండిగో ఎయిర్‌లైన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రపంచంలోని 10 ప్రముఖ నగరాలకు విమాన సర్వీసులు ప్రారంభించబోతున్నట్టు ప్రకటించింది. కాగా ఎయిర్ ఇండియా.. టాటా గ్రూప్ చేతికి వచ్చిన తర్వాత 20 అంతర్జాతీయ విమానయాన సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది.

వరుసగా మూడోసారి వడ్డీ రేట్ల కోత!

- 4 నుంచి ఆర్‌బీఐ ఎంపీసీ భేటీ

ముంబై: దేశంలో ద్రవ్యోల్బణం అదుపులో ఉన్న నేపథ్యంలో వృద్ధికి ఊతం ఇచ్చేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఈ వారంలో మరోసారి రేట్ల కోత ప్రకటించే ఆస్కారం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే వరుసగా మూడోసారి ఆర్‌బీఐ కీలక రెపో రేటును తగ్గించినట్టవుతుంది. ప్రపంచంలో నెలకొన్న అస్థిరతల నేపథ్యంలో ఈసారి కూడా వృద్ధికి ఊతం ఇచ్చేందుకే ఆర్‌బీఐ మొగ్గు చూపవచ్చని వారి అభిప్రాయం. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా సారథ్యంలోని ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) ద్వైమాసిక సమావేశం వచ్చే బుధవారం (4వ తేదీ) నుంచి శుక్రవారం (6వ తేదీ) వరకు జరగనుంది. శుక్రవారం ఉదయం ఎంపీసీ నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా ప్రకటిస్తారు. ఆర్‌బీఐ ఇప్పటికే ఫిబ్రవరి, ఏప్రిల్ నెలల్లో జరిగిన సమావేశాల్లో 2 విడతలుగా 0.50% మేరకు రెపో రేటును తగ్గించడంతో ప్రస్తుతం అది 6% వద్ద ఉంది.

సీఐఐ అధ్యక్షుడిగా రాజీవ్ మేమానీ

న్యూఢిల్లీ: భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) అధ్యక్షుడిగా ఎర్నెస్ట్ అండ్ యంగ్ (ఈవై) ఇండియా చైర్మన్, సీఈఓ రాజీవ్ మేమానీ నియమితులయ్యారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఈయన ఈ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. కాగా సీఐఐ ప్రెసిడెంట్ డెజిగ్నేట్‌గా టాటా కెమికల్స్ ఎండీ, సీఈఓ ఆర్ ముకుందన్, వైస్ ప్రెసిడెంట్‌గా భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ ఎండీ సుచిత్రా ఎల్లా నియమితులయ్యారు.

మే నెల జీఎస్‌టీ వసూళ్లు రూ.2.01 లక్షల కోట్లు

ఏపీలో రూ.3,803 కోట్లు, తెలంగాణలో రూ.5,310 కోట్లు

న్యూఢిల్లీ: జీఎస్‌టీ వసూళ్ల జోరు కొనసాగుతోంది. గత నెల (మే)లో జీఎస్‌టీ వసూళ్లు రూ.2.01 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గత ఏడాది ఇదే కాలంలో వసూలైన రూ.1,72,739 కోట్లతో పోలిస్తే ఇది 16.4 శాతం ఎక్కువ. అయితే ఈ ఏడాది ఏప్రిల్‌లో రికార్డు స్థాయిలో వసూలైన రూ.2.37 లక్షల కోట్లతో పోలిస్తే మాత్రం ఇది రూ.36,000 కోట్లు తక్కువ. మే నెలలో వసూలైన రూ.2.01 లక్షల కోట్ల జీఎస్‌టీలో రూ.35,434 కోట్లు సీజీఎస్‌టీ రూపంలో, రూ.43,902 కోట్లు ఎస్‌జీఎస్‌టీ రూపంలో, రూ.1.09 లక్షల కోట్లు ఐజీఎస్‌టీ రూపంలో వసూలయ్యాయి. సెస్సు కింద మరో రూ.12,879 కోట్లు వసూలయ్యాయి.

తెలుగు రాష్ట్రాల్లో: గత నెల రెండు తెలుగు రాష్ట్రాల నుంచి జీఎస్‌టీ కింద రూ.9,113 కోట్లు వసూలయ్యాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్ నుంచి రూ.3,803 కోట్లు వసూలు కాగా, తెలంగాణ నుంచి రూ.5,310 కోట్లు వసూలయ్యాయి. గత ఏడాది మే నెలతో పోలిస్తే తెలంగాణలో జీఎస్‌టీ వసూళ్లు ఆరు శాతం పెరగ్గా, ఏపీలో రెండు శాతం తగ్గాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

2వ తేదీ



హైదరాబాద్	525	విజయవాడ	525
వరంగల్	527	గోదావరి	510
చిత్తూరు	613	విశాఖపట్నం	535
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	114
వరంగల్	110	గుంటూరు	117
కరీంనగర్	110	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	100
కర్నూలు	110	నెల్లూరు	105
విశాఖపట్నం	106	అనంతపురం	105
గోదావరి	114		

ఆచితూచి అడుగేయండి!

ఈ వారం దేశీయ స్టాక్ మార్కెట్ల గమనం అంతర్జాతీయ పరిణామాలపై ఆధారపడి ఉంది. దేశీయ జీడీపీ వృద్ధి రేటు అంచనాలకు తగ్గట్టుగా ఉండటం సానుకూల అంశం. అల్యూమినియం, స్టీల్ దిగుమతులపై ట్రంప్ సుంకాలు మరింత పెంచుతామని ప్రకటించటం, ఆయా దేశాల మధ్య ఉద్రిక్తతలతో అనిశ్చితికి అవకాశం ఉంది. ప్రస్తుతం కన్సాలిడేట్ అవుతున్న నిఫ్టీ 25,000 ఎగువన నిలదొక్కుకోవటం అత్యంత కీలకం. ఈవారం బ్యాంకింగ్, ఫైనాన్స్, రైల్వే వ్యాగన్స్, షిప్ బిల్డింగ్, ఫిన్‌టెక్ షేర్లు బుల్లిష్‌గా కనిపిస్తున్నాయి.

స్టాక్ రికమండేషన్స్

జైడస్ లైఫ్‌సైన్సెస్: ఏడాది కాలంగా డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ కౌంటర్‌లో ఫిబ్రవరి నుంచి మంచి బేస్ ఏర్పడింది. అక్యుములేషన్ కొనసాగుతోంది. ప్రైస్ యాక్షన్ టైట్‌గా కనిపిస్తోంది. మూమెంటమ్ టర్న్ అరౌండ్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. గత శుక్రవారం రూ.930 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.910 పై స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,050 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.880 స్థాయిని కచ్చితమైన స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

ఎటర్నల్: ఆరు నెలలుగా ఈ షేరు అక్యుములేషన్ జోన్‌లో చలిస్తోంది. ప్రస్తుతం మూమెంటమ్, డెలివరీ క్రమంగా పెరుగుతోంది. సంస్థాగత ఇన్వెస్టర్లు ఈ షేరుపై ఆసక్తి చూపిస్తున్నారు. గత శుక్రవారం రూ.238 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.230 వద్ద ఎంటరై రూ.285 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.210 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్‌బీఐ: ఈ కౌంటర్‌లో ప్రైస్ యాక్షన్ ఆసక్తికరంగా కనిపిస్తోంది. మూమెంటమ్, డెలివరీ క్రమంగా పెరుగుతున్నాయి. గత వారం గరిష్టాన్ని బ్రేక్ చేసింది. గత శుక్రవారం రూ.812 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.800 స్థాయిలో ఎంటరై రూ.880 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు.అయితే రూ.775 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

అనంత్‌రాజ్: ఈ రియల్టీ కంపెనీ షేరు ప్రస్తుతం 10,20,50 ఈఎంఏ పై స్థాయిల్లో చలిస్తోంది. షార్ట్‌టర్మ్, మీడియం టర్మ్ మూమెంటమ్ చాలా బాగుంది. గత శుక్రవారం రూ.561 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.550 ఎగువన పొజిషన్ తీసుకుని రూ.660 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.525 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

పేటీఎం: ప్రస్తుతం ఈ కౌంటర్‌లో కన్సాలిడేషన్ కొనసాగుతోంది. కొన్ని రోజులుగా రూ.850-900 శ్రేణిలో చలిస్తోంది. రూ.900, రూ.1,000 వద్ద బలమైన నిరోధం ఉంది. వీటిని అధిగమిస్తే మరింత పుంజుకోవటం ఖాయం. 55 రోజుల రిలేటివ్ స్ట్రెంత్ మెరుగ్గా ఉంది. గత శుక్రవారం రూ.890 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.880 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.960 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.850 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

మార్కెట్లో కన్సాలిడేషన్ ధోరణి

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం మానసిక అవధి 25,000 స్థాయిలో మరోసారి విఫలమై అప్రమత్త ట్రెండ్ సంకేతం ఇచ్చింది. 100 పాయింట్ల నష్టంతో వారం కనిష్ఠ స్థాయికి చేరువలో 24,750 వద్ద ముగిసింది. గత మూడు వారాలుగా కూడా 25,000 వద్ద పరీక్ష ఎదుర్కొంటూనే ఉంది. మే నెల చార్టుల ప్రకారం సైతం మార్కెట్లో అప్రమత్త ట్రెండ్ నెలకొని ఉంది. మిడ్‌క్యాప్-100 సూచీకి 58,000, స్మాల్‌క్యాప్-100 సూచీకి 18,000 వద్ద నిరోధం ఎదురవుతోంది. మార్కెట్ ప్రస్తుతం కీలక దశలో ఉంది. సానుకూలత కోసం నిఫ్టీ తప్పనిసరిగా బౌన్స్‌బ్యాక్ అయి 25,000 వద్ద బ్రేకౌట్ సాధించాలి. లేదంటే స్వల్పకాలిక కరెక్షన్ ముప్పు ఎదుర్కొంటుంది.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీ ప్రస్తుతం 25,000-24,500 మధ్యన కదలాడుతోంది. మరింత అప్‌ట్రెండ్ కోసం మైనర్ నిరోధం 24,900 తప్పనిసరిగా నిలదొక్కుకోవాలి. ఆ పైన నిరోధం 25,100. ఇదే మే 15న నమోదైన గరిష్ఠ స్థాయి.

బేరిష్ స్థాయిలు: మైనర్ మద్దతు స్థాయి 24,600 వద్ద విఫలమైతే మరింత బలహీనతను ప్రదర్శిస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 24,450. భద్రత కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో పడుతుంది.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం నిలకడగా పాజిటివ్ ట్రెండ్ ప్రదర్శిస్తూ వచ్చిన ఈ సూచీ ప్రస్తుతం జీవితకాల గరిష్ఠ స్థాయి 56,100 చేరువలో ఉంది. ఇక్కడ కన్సాలిడేషన్ ఉండవచ్చు. ఆ పైన నిలదొక్కుకున్నప్పుడు మాత్రమే మరింత కొత్త శిఖరాలకు పురోగమిస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 55,000. ఇక్కడ విఫలమైతే స్వల్పకాలిక బలహీనత ముప్పు ఏర్పడుతుంది.

పాటర్న్: గత రెండు వారాల్లో 25,100 వద్ద డబుల్ టాప్ పాటర్న్ ఏర్పడింది. సానుకూలత కోసం దీన్ని ఛేదించాలి. అలాగే 24,450 వద్ద డబుల్ బాటమ్ పాటర్న్ కూడా ఏర్పడింది. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత తప్పదు.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,840, 24,900
మద్దతు	24,660, 24,600

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 2-6-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 64 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి రా.8.36 తదుపరి అష్టమి; నక్షత్రం: మఖ రా.10.56 తదుపరి పుబ్బ; వర్జ్యం: ఉ.10.16-11.57; దుర్ముహూర్తం: మ.12.39-1.31, మ.3.15-4.06; అమృతఘడియలు: రా.8.24-10.05; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 5.43; సూర్యాస్తమయం: 6.42 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

5న సిట్ ముందుకు వస్తా

లేఖ రాసిన ప్రభాకర్‌రావు!.. ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

ప్రభాకర్‌రావు వాంగ్మూలమే కీలకం.. ఆయన కనుసన్నల్లోనే ట్యాపింగ్!



హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంటోంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్(ఓఎస్డీ) ప్రభాకర్‌రావు ఇన్నాళ్లు అమెరికాలో ఉండగా.. తాను సిట్ ముందుకు వస్తానని, విచారణకు సహకరిస్తానని పేర్కొంటూ లేఖ రాసినట్లు తెలిసింది. ఈ నెల 5న సిట్‌ను కలుస్తానని ఆ లేఖలో చెప్పినట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. సుప్రీంకోర్టు కూడా ముందు భారత్‌కు రావాలని, విచారణకు

మిగతా 9వ పేజీలో...

ఉద్యోగులకు

ఏం చేద్దాం!

రాష్ట్ర ప్రజలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు: సీఎం రేవంత్

మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి సమాలోచన

- ఉద్యోగుల సమస్యలు, డీఏలపై కీలక చర్చ
- రిటైర్మెంట్ వయసు ఏడాది పెంపుపై పరిశీలన
- మరింత పకడ్బందీగా రైతుభరోసా అమలు
- సంక్షేమం క్షేత్రస్థాయికి వెళ్లేలా విస్తృత ప్రచారం
- యువవికాసం, భూభారతి, ఇందిరమ్మ ఇళ్లపై చర్చ
- 5న క్యాబినెట్ భేటీ.. అన్నింటిపైనా నిర్ణయం
- ఎన్‌డీఎస్‌ఏ నివేదికకు ఓకే.. నిర్మాణ సంస్థపై చర్యలకు సిఫారసు చేయనున్న మంత్రివర్గం
- ఫోన్ ట్యాపింగ్.. కవిత అంశంపై భేటీలో చర్చ



సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మందకృష్ణ మాదిగ

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు లేవనెత్తిన పలు డిమాండ్లను పరిష్కరించే దిశగా రేవంత్ సర్కారు యోచిస్తోంది. వారి డిమాండ్లపై ఈ నెల 5న జరిగే మంత్రి వర్గ సమావేశంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. ఉద్యోగులకు ఇవ్వాల్సిన డీఏలు, పదవీ విరమణ వయసు పెంపు, సాధారణ బదిలీల అంశాల్లో క్యాబినెట్ భేటీలో కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ఆదివారం హైదరాబాద్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి.. మంత్రులతో సమావేశమై ఈ మేరకు చర్చించారు. దీంతోపాటు రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు, ఇందిరమ్మ ఇండ్లు, రెవెన్యూ సదస్సులు, వానాకాలం

మిగతా 11వ పేజీలో...

రాజీవ్ యువ వికాసానికి తాత్కాలిక బ్రేక్

11

- నేటి రుణ మంజూరు పత్రాల అందజేత వాయిదా
- కొనసాగుతున్న దరఖాస్తుల పరిశీలన
- పూర్తి స్థాయి పరిశీలన తర్వాతే అర్హుల జాబితా

నేటి నుంచి..

స్లాట్ బుకింగ్‌తోనే రిజిస్ట్రేషన్లు

- రాష్ట్రంలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుల్లో..
- రోజుకు 48 స్లాట్లు
- అత్యవసర సందర్భాల్లో ఐదు వాకిన్ రిజిస్ట్రేషన్లకు అనుమతి
- రిజిస్ట్రేషన్ సేవల్లో వాట్సాప్ చాట్‌బాట్
- 82476 23578కు వాట్సాప్ చేస్తే.. ఏఐతో సందేహాల నివృత్తి
- రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతానికి ఆధార్ ఈ-సంతకం
- అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష

11



రష్యా ఎయిర్‌బేస్‌లో కాలిపోతున్న విమానం



ఉక్రెయిన్ వినియోగించిన చిన్న డ్రోన్లు

రష్యా గడ్డ మీది నుంచే రష్యాపై

భీకర దాడులు

- ఎయిర్‌బేస్‌లే లక్ష్యంగా ఉక్రెయిన్ డ్రోన్ల బీభత్సం
- 41 రష్యన్ యుద్ధ విమానాల ధ్వంసం
- 4 వేల కిలోమీటర్ల దూరంలోని సైబీరియాలోనూ లక్ష్యాలను ఛేదించిన డ్రోన్లు
- ధ్వంసమైన విమానాల్లో టీయూ-22ఎం3, టీయూ-95 బాంబర్లు
- ఏ-50 అవాక్స్‌పైనా విధ్వంసక దాడి
- 18 నెలలుగా వ్యూహాత్మక ఆపరేషన్
- ట్రక్కుల్లో ఎఫ్‌పీవీ డ్రోన్లను పంపిన ఉక్రెయిన్
- పార్క్ చేసిన ట్రక్కులు, ఇళ్లపైన మోహరింపు
- రిమోట్ కంట్రోల్‌తో ఆపరేట్ చేసిన ఎస్‌బీయూ
- ఉక్రెయిన్‌పై రష్యా ప్రతీకార దాడులు
- 12 మంది ఉక్రెయిన్ సైనికుల మృతి

కీవ్, జూన్ 1: ఉక్రెయిన్‌ను వారంరోజుల్లో చుట్టేస్తామంటూ మూడేళ్ల క్రితం యుద్ధానికి దిగిన రష్యాకు ఆదివారం పెద్ద దెబ్బ తగిలింది. ఈ యుద్ధం 1,192వ రోజుకు చేరుకోగా.. 'ఆపరేషన్ వెబ్' పేరుతో రష్యా గడ్డ మీది నుంచే ఉక్రెయిన్ జరిపిన డ్రోన్ దాడుల్లో రష్యాలోని నాలుగు ఎయిర్‌బేస్‌లు టార్గెట్ అయ్యాయి. 18 నెలలుగా ఆ ఆపరేషన్‌ను వ్యూహాత్మకంగా కొనసాగించి, ట్రక్కుల్లో రష్యాకు డ్రోన్లను పంపిన ఉక్రెయిన్.. ఆధునిక యుద్ధతంత్రంలో తనదైన ముద్రవేస్తూ రిమోట్ కంట్రోళ్లతో ఆకస్మిక దాడులు జరిపింది. ఈ దాడుల్లో 41 రష్యా యుద్ధ విమానాలను బుల్లి డ్రోన్లు(ఎఫ్‌పీవీ కామికాజి) తుత్తునియలు చేశాయి. ఉక్రెయిన్ సరిహద్దుల నుంచి 700 కిలోమీటర్లు మొదలు.. 4వేలకు పైగా కిలోమీటర్ల దూరంలో ఉండే నాలుగు ఎయిర్‌బేస్‌లు బెలాయా, డియాగిలెవ్, ఒలేన్యా, ఇవానోవోపై ఆదివారం ఉదయం ఉక్రెయిన్ ముప్పేట

మిగతా 10వ పేజీలో...

రష్యాలో కూలిన 2 రైలు వంతెనలు

- గూడ్స్, ప్రయాణికుల రైళ్లకు ప్రమాదం
- ఉక్రెయిన్ పనేనని అనుమానం

10



తెలంగాణ తరఫున పర్యాటకాన్ని

థాయ్‌లాండ్‌లో ప్రచారం చేస్తా

- టైటిల్ గెలిచా.. ఇక దేశమే ప్రాధాన్యం
- థాయ్‌లాండ్‌లో బలవంతపు వ్యభిచారం జరగడం బాధాకరం
- పోలీసు, సైన్యంలో మగువల నియామకం కోసం ఉద్యమిస్తా
- గెలుస్తానన్న నమ్మకంతోనే 'మిస్ యూనివర్స్' పోటీ వదిలేశా
- మిస్ వరల్డ్ పోటీల్లోకి రాకుండా ఉంటే రాజకీయాల్లో ఉండేదాన్ని
- 'ఆంధ్రజ్యోతి'తో మిస్ వరల్డ్-2025 విజేత ఓపల్ సుచాత షుంగ్‌సిరి

9



కీర్తి కాదు.. స్ఫూర్తి

- మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంచడమే లక్ష్యం
- మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొన్నది అందుకే!
- టాప్-4లో నిలవడం గర్వకారణం
- 'ఆంధ్రజ్యోతి'తో మిస్ వరల్డ్ రన్నరప్‌లు

9

కుటుంబ డ్రామాల్లో.. బీజేపీ

పాత్రధారి, సూత్రధారి కాదు

- ఆస్తులు, అధికారం, అవినీతి డబ్బు కోసం బీఆర్ఎస్ పార్టీలో గొడవలు
- కాంగ్రెస్ హయాంలో అవినీతి వికేంద్రీకృతం.. రేవంత్ హామీలేమయ్యాయి?: కిషన్‌రెడ్డి
- బీజేపీలో బీఆర్ఎస్ విలీనంపై ఎప్పుడూ చర్చ జరగలేదు: లక్ష్మణ్



హైదరాబాద్/సుభాష్‌నగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాజకీయ, కుటుంబ డ్రామాలు నడుస్తున్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. కుటుంబ డ్రామాల్లో బీజేపీ పాత్రధారి, సూత్రధారి కాదని స్పష్టం చేశారు. ఆస్తులు, అధికారం, అవినీతి డబ్బుల కోసం బీఆర్ఎస్‌లో గొడవలు జరుగుతున్నాయని, వాటితో బీజేపీకి సంబంధం లేదని అన్నారు. ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలనా విజయాలకు సంబంధించి ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో అవినీతి కేంద్రీకృతం కాగా, కాంగ్రెస్ హయాంలో వికేంద్రీకృతం అయిందని విమర్శించారు. వందలాది మంది బలిదానంతో తెలంగాణను సాధించుకున్నది కేసీఆర్ కుటుంబం, కాంగ్రెస్ నాయకులు దోచుకోవడానికా..? అని

మిగతా 11వ పేజీలో...

అమ్మకు సాయం అందేనా?

- 2021 మే నుంచి నిలిచిన కేసీఆర్ కిట్ పథకం
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎంసీహెచ్ కిట్‌గా పేరు మార్పు
- ఆ తర్వాతా అమలు కాని వైనం
- నాలుగేళ్లలో రూ.862 కోట్లకు చేరిన పథకం బకాయిలు
- పేరు మార్చాల్సి వస్తుందని కేంద్ర పథకంలో చేరని గత ప్రభుత్వం
- 'మాతృ వందనం'లో చేరే యోచనలో కాంగ్రెస్ సర్కారు



హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవానంతరం బాలింతలకు అందజేసే మాతా శిశు సంరక్షణ కిట్ (గతంలో కేసీఆర్ కిట్) పంపిణీ నిలిచిపోయి సరిగ్గా నాలుగేళ్లు అవుతోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచడం, ప్రసూతి మరణాలను తగ్గించడమే లక్ష్యంగా గత ప్రభుత్వం 'కేసీఆర్ కిట్' పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం కింద ప్రసవానంతరం బాలింతలకు కేసీఆర్ కిట్, నగదు బదిలీ చేసేవారు. ఇవి ఆ తల్లులకు ఎంతగానో ఉపయోగపడేవి. కానీ, 2021 మే నెల నుంచి కేసీఆర్ హయాంలోనే ఈ పథకం

మిగతా 9వ పేజీలో...

మరో నాలుగు రాజన్న

కోడెలు మృతి

- ఇప్పటి వరకు గోశాలలో 17 జీవాల మృత్యువాత
- 500 పశువులకు ఎల్ఎస్‌డీ టీకాలు
- 64 కోడెలను రైతులకు అందజేసిన కలెక్టర్ ఝా

12

మావోయిస్టులపై మారణహోమం ఆపాలి

- మోదీ, అమిత్ షాకు మానవత్వం లేదు
- కార్పొరేట్లకు ఖనిజ సంపద దోచిపెట్టేందుకే 'కగార్'
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్
- ఆపరేషన్ కగార్ నిలిపివేతకు 14న లెఫ్ట్ పార్టీల ధర్నా
- మద్దతు ప్రకటించిన కాంగ్రెస్, బీఆర్ఎస్

12

బీఎండబ్ల్యూ కారు కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య

12



జానీ (ఫైల్)

- అంత స్థోమత లేదని తల్లిదండ్రులు చెప్పినా వీడని మంకుపట్టు
- మరో కారు కొనిస్తానని తండ్రి చెప్పినా.. ఒప్పుకోని వైనం
- వ్యవసాయ బావి వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి
- సిద్దిపేట జిల్లా చాట్లపల్లిలో ఘటన

బొమ్మలు: అక్బర్



ఆదిమ జాతుల అస్తిత్వ పెనుకేక

కెన్యాలో బ్రిటిష్ వలస పాలనకు, వలస పాలన అనంతరం పాలించిన స్వదేశీ పాలకుల దాష్టీకానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు, చింతనాపరుడు, సామాజిక శాస్త్రవేత్త, విప్లవ రచయిత గూగీ వా థియాంగో మే 28న అమెరికా లోని జార్జియాలో కన్ను మూసాడు. ఐరోపా కేంద్రీకృత చర్చల ఆధిపత్య ధోరణులను తమ రచనలతో, మేధా సంపత్తితో తుత్తునియలు చేసిన వారిలో ఎడ్వర్డ్ సయీద్, గూగీ వా థియాంగో ముందు వరసలో ఉంటారు. సయీద్ 1935లో పాలస్తీనాలో, గూగీ 1938లో కెన్యాలో పుట్టారు. విషాదం ఏమిటంటే, ఇద్దరూ పుట్టిన నేల మీద రక్షణ లేక, దశాబ్దాల పాటు ప్రవాసులు గానే బతికారు. 'ఓరియంటలిజం' రచనతో ఎడ్వర్డ్ సయీద్; 'డీకాలనైజింగ్ ద మైండ్', 'మూవింగ్ ద సెంటర్' రచనలతో గూగీ తమవైన మేధా తాత్త్విక మార్గాల్ని రహదారులుగా వేసారు. ఈ ఇద్దరి ప్రస్తావనా లేకుండా ఆధునిక సామాజిక శాస్త్రాలు అసంపూర్ణం.

మూల వాసుల మౌఖిక గాథలను పారవశ్యంతో ప్రపంచ యవనిక మీద నిలబెట్టిన సాహసి గూగీ. తండ్రి థియాంగో 'గికుయు' తెగకు చెందిన ఒక విస్థాపితుడు, ఇద్దరు అన్నలు 1950ల్లో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన మౌ మౌ సాయుధ పోరాటంలో అమరులు. గూగీ బాల్యం ఈ సాయుధ పోరాటం నేపథ్యంగా గడిస్తే, యవ్వనం స్వీయపాలన వచ్చాక కొనసాగిన నియంతల పాలన నేపథ్యంగా గడిచింది. ఆంగ్ల సాహిత్యం చదువుకుని నైరోబి విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడిగా వృత్తి జీవితం మొదలుపెట్టాడు. అధ్యాపకుడిగా ఉన్న కాలంలోనే ఆయనపై రాజ్యం కన్నెర్ర చేసింది. దీనికి కారణం వలస పాలన అనంతరం కెన్యా పాలకుల దాష్టీకాలపై ఆయన చేసిన రచనలు. మొదట 'జేమ్స్ గూగీ' పేరుతో ఇంగ్లీషులో రచనలు చేసిన గూగీ తదనంతరం కాలంలో వలసవాద చిహ్నమైన 'జేమ్స్'ను తన పేరు నుండి తొలగించుకున్నాడు. ఇంగ్లీషును వదిలి మాతృభాషలైన 'గికుయు', 'స్వాహిలి' భాషలలో రాయటం మొదలుపెట్టాడు. ఈ నిర్ణయం తోనే ఆయన సాహిత్య రాజకీయ కార్యాచరణ మొదలైంది. ఆ క్రమంలో స్థానిక భాషలకు మౌఖిక సాహిత్యం ఎంత ముఖ్యమో బలంగా వాదించాడు. ఒక దశలో ఇంగ్లీష్ డిపార్టుమెంటులను రద్దు చేయాలి అనేదాకా పోయాడు.

పంతొమ్మిది వందల యాభైలలో సాయుధ రాజకీయాల తర్వాత, కెన్యా వలస పాలన నుంచి విముక్తం అయ్యాక, డెబ్బయ్యవ దశకంలో తన సహచర నాయకులు పాలకులుగా మారడం మూలంగా, గూగీ బలవంతపు ప్రవాసిగా మారాల్సి వచ్చింది. మాతృదేశాన్ని వదిలిన తర్వాత దశాబ్దాలపాటు ప్రవాసిగానే బతికాడు. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో తులనాత్మక సాహిత్యం – అనువాద విభాగానికి అధిపతిగా పనిచేశాడు.

పూర్వీకులు వారసత్వంగా కాపాడుకున్న అపారమైన జానపద కథలు, ఇతిహాసాలతోపాటు, కెన్యా సాయుధ పోరాటం భూమికగా పనిచేసిన గెరిల్లా వీరుల సాహస గాథలే గూగీ రచనల సారం. కెన్యా దేశంపై వలస పాలన తెచ్చిమోపిన ఆంగ్ల విద్య ఎలా స్థానిక భాషలను, సంస్కృతులను ధ్వంసం చేసిందో ఆయన ప్రతి రచన లోనూ చూడగలం. వలసవాద అణచివేతను ఆయనతోపాటు ఆయన సృష్టించిన పాత్రలూ ఎదుర్కోవటం ఒక విశేషం. 'మాటిగిరి' అనే నవలలో మాటిగిరి పాత్ర మీద పోలీసులు లుక్ అవుట్ నోటీసు కూడా ఇచ్చారు! ఆయన రచనల్లోని పాత్రలు కూడా పాలకులను వణికించాయంటే వాటి బలాన్ని, ప్రాసంగికతను అర్థం చేసుకోవచ్చు.

'వీప్ నాట్, చైల్డ్', 'ద రివర్ బిట్వీన్', 'అ గ్రైన్ ఆఫ్ వీట్', 'పెటల్స్ ఆఫ్ ద బ్లడ్', 'డెవిల్ ఆన్ ద క్రాస్', 'మాటిగిరి', 'విజార్డ్ ఆఫ్ క్రౌ' వంటి నవలలతో బాటు కథలు, నాటకాలు, 'డి కాలనైజింగ్ ద మైండ్', 'పెన్ పాయింట్స్ అండ్ గన్ పాయింట్స్', 'బారెల్ ఆఫ్ పెన్', 'మూవింగ్ ద సెంటర్' వంటి నాన్ ఫిక్షన్, జైలు డైరీ, యుద్ధకాలం నాటి జ్ఞాపకాలు... మొదలైనవి గూగీ ప్రసిద్ధ రచనలు. "చరిత్రలో భాష సంస్కృతులనేవి ప్రజల సామూహిక జ్ఞాపకాల నిధి" అంటాడు గూగీ. పూర్వీకులు వారసత్వ సంపదగా కాపాడుకుంటూ వచ్చిన ఆ నిధిని పాశ్చాత్య వలసవాదం, భాషా సామ్రాజ్యవాదం కబళిస్తున్నాయి అంటూ, ఆంగ్ల భాషా సాహిత్యాల స్థానే అంతరించిపోతున్న స్థానిక మూలవాసుల భాషలను అధ్యయనం చేయాలి అని బలంగా వాదించాడు.


వలస వాదం తెచ్చిన క్రైస్తవ మతం, పాశ్చాత్య విద్య స్థానిక తెగల మధ్య ఎలాంటి అంతర్గత విభేదాలను, సాంస్కృతిక వైరుధ్యాలను పెంచి పోషిస్తున్నాయో, ఆ రెండు సమాజాల మధ్య పారుతున్న నది సజీవమైన జీవన విధానాన్ని ఎలా కాపాడుకుంటూ వస్తున్నదో 'ద రివర్ బిట్వీన్' నవలలో చూడగలం. ఇది కెన్యా దేశ కథ మాత్రమే కాదు, ప్రపంచవ్యాప్తంగా అంతరించి పోతున్న జాతులు, వారి బాషా సంస్కృతుల వలపోత. ఈ ప్రపంచంలో నల్లవాడిని తెల్లవాడు, స్త్రీని పురుషుడు, కూలీని రైతు క్రమానుగతంగా దోపిడీ చేస్తున్నారు; వీరందరిలోనూ నల్ల జాతి స్త్రీ వ్యవసాయ కూలీ అత్యంత వ్యవస్థీకృత హింసకు బలవుతున్నారు అంటాడు 'విజార్డ్ ఆఫ్ క్రౌ' నవలలో.

ఇరవై తొమ్మిదేళ్ళ కిందట హైదరాబాద్‌లో అఖిల భారత విప్లవ సాంస్కృతిక సంస్థ జాతుల సమస్య మీద నిర్వహించిన సదస్సులో పాల్గొనటానికి గూగీ ఈ దేశం వచ్చాడు. హుస్నాబాద్‌లో అమరుల స్మృతిలో నిర్మించుకున్న ఆసియాలోనే అతిపెద్దదైన స్థూపాన్ని పారవశ్యంతో చూసాడు. "మీకు కనీసం అమరుల జ్ఞాపకాలను నిలబెట్టుకునే స్వేచ్ఛ అయినా ఉంది," అని సంతోష పడ్డాడు. ఆనాటికే తాను కెన్యా విడిచి అమెరికాలో ప్రవాసిగా బ్రతుకుతున్న వైనాన్నీ, పుట్టిన నేల మీద 'మౌ మౌ' సాయుధ పోరాట కాలంలో ప్రాణాలను కోల్పోయిన సహచరులనూ యాది చేసుకున్నాడు. మళ్ళీ ఏడేళ్ళ క్రితం 2018లో హైదరాబాద్ వచ్చాడు. అప్పుడు తన బాల్య యాది చద్దిమూటను వెంట పెట్టుకుని వచ్చాడు. గూగీ కథ వింటుంటే బస్తర్ అడవుల్లోని ఆదివాసీ గూడేల్లో, తెలంగాణ మారుమూల పల్లెల్లో నీకూ నాకూ ఎదురైన ఆకలి, అవమానం, పీడన అంతా అద్దం ముందు నిలబడినట్టు ఉంటుంది.

భాషా సామ్రాజ్య వాద పెత్తనం, యూరో సెంట్రిక్ ఆలోచనల శవ పేటికకు కొట్టిన మేకులు గూగీ రచనలు. స్వాభిమాన, ప్రతిఘటన పోరాటాలు ఉన్న ప్రతిచోటా ఆయన రచనలు అనువాదం అయ్యాయి. లక్షలాది అభిమానులకు, వేలాదిమంది పరిశోధకులకు కరదీపికగా మారాయి. ఆయన పరంపరకు వేలాదిమంది వారసుల పుట్టుకొచ్చారు. ఆయన స్ఫూర్తితో ఛిద్రమైన తమ మూలాలను, కోల్పోయిన పూర్వీకుల జాడలను అక్షరీకరిస్తున్నారు. అంతేకాదు, ఆయన నలుగురు పిల్లలు కూడా రచనలను ప్రచురించారు. ఆయన కొడుకు ముకోమా వా థియాంగో పేరు మోసిన అకడమిక్. ఆఫ్రికన్ నవలా వికాసం, అస్తిత్వ రాజకీయాల మీద సాధికారత కలిగిన బుద్ధిజీవి.

"నిన్ను నీవు సజీవంగా ఉంచుకోవటానికి ప్రతిఘటన ఉత్తమమైన మార్గం. అన్యాయాన్ని తిరస్కరించటమనే చిన్నపాటి రూపంలోనైనా సరే ప్రతిఘటించాలి. నీ మార్గం సరైనదని నువ్వు నమ్మితే, నీ నమ్మకాలపై నువ్వు స్థిరంగా నిలబడితే, అవే నీ ఉనికిని కాపాడతాయి," అని గూగీ బలంగా నమ్మాడు. ప్రపంచవ్యాప్తంగా పోరాడే జనుల పక్షాన తన రచనలను ఒక మద్దతు వాక్యంగా నిలబెట్టాడు. బాధిత స్వరంలో ఆయన రాజేసిన కొలిమి కెన్యన్ వాడల నుంచి బస్తర్ అడవుల దాకా సజీవం గానే ఉంది.

■ గుఱ్ఱం సీతారాములు
✆ 77805 87586



భాషా సామ్రాజ్య వాద పెత్తనం, యూరో సెంట్రిక్ ఆలోచనల శవ పేటికకు కొట్టిన మేకులు గూగీ వా థియాంగో రచనలు. స్వాభిమాన, ప్రతిఘటన పోరాటాలు ఉన్న ప్రతి చోటా ఆయన రచనలు అనువాదం అయ్యాయి. లక్షలాది అభిమానులకు, వేలాదిమంది పరిశోధకులకు కరదీపికగా మారాయి. ఆయన పరంపరకు వేలాదిమంది వారసులు పుట్టుకొచ్చారు. ఆయన స్ఫూర్తితో ఛిద్రమైన తమ మూలాలను, కోల్పోయిన పూర్వీకుల జాడలను అక్షరీకరిస్తున్నారు.

యుద్ధ సమయం

తప్పక వస్తాయి మృదుల వర్షాలూ,
మట్టి పరిమళం
మెరుపు సవ్వడితో గిరికీలు తిరిగే
విహంగ సమూహం

మడుగుల్లో మండూక గానం
నిశిరాత్రంతా
ఊగాడుతూ బదరీవృక్షం
శ్వేతంగా

తూలికల నిప్పును
వక్షస్థలంలో ధరిస్తూ రాబిన్ పక్షి
కురుచ కంచె తీగెపై
వెర్రి కోర్కెలను ఈలవేస్తూ

ఏ ఒక్కదానికీ తెలియదు
యుద్ధమంటే, దేనికీ కూడా
అది ఎప్పుడు సంభవించిందనే
స్పృహే లేదు

పిట్ట గానీ చెట్టు గానీ పట్టించుకోవు
నరజాతి సమూలంగా నశించినా

తొలిసంధ్యలో మేల్కొన్న వసంతానికి
తెలియనే తెలియదు
మనం వెళ్లిపోయామని.

ఇంగ్లిష్ మూలం: ■ సారా టీజ్డేల్

అనువాదం: ■ తుమ్మూరి రాంమోహన్ రావు
✆ 97015 22234

ఎంత ప్రాంతీయమైతే అంత విశ్వజనీనం

సాహిత్యం భాషను ఆశ్రయించి మనిషిలో ఉప్పొంగే భావాలకు రూపం ఇచ్చే కళ. ఆ భావాలు ఎక్కడ పుట్టాయో, అవి ఎవరి జీవితాన్ని ప్రతిబింబిస్తున్నాయో తెలియకపోతే, తెలుసుకోకపోతే ఆ సాహిత్యం మూలాల నుంచి దూరమై పరాయిదైపోతుంది. అందుకే ప్రపంచ సాహిత్యంలో ప్రాంతీయతకు విశేషమైన స్థానం ఉంది. ప్రాంతీయత అనేది కేవలం భౌగోళిక పరిమితి మాత్రమే కాదు; అది ఒక భాష, ఒక జీవనశైలి, ఒక సంస్కృతి, ఒక వ్యక్తిత్వం. ప్రాంతీయ సాహిత్యం ఒక నిర్దిష్ట భౌగోళిక ప్రాంతంలోని ప్రజల భాషలో రాసిన సాహిత్యం. ఆ ప్రాంతపు ప్రకృతి, నీటి వనరులు, పంటలు, వృత్తులు ఆ సాహిత్యంలో ప్రధాన పాత్రధారులు. సాంస్కృతిక తత్త్వం, జానపద కళలు, కథలు, నమ్మకాలు, సామెతలు ఇవన్నీ ఆ సాహిత్యంలో బలమైన పాత్ర పోషిస్తాయి. అంతేకాదు సామాజిక ధ్వని-ప్రతిధ్వని, గ్రామీణ జీవితం, వర్గ భేదాలు, కుల వ్యవస్థ, వలసకూలీల కష్టాలు ఇవన్నీ ప్రాంతీయ సాహిత్యంలో లోతుగా ఆవిష్కృతమవుతాయి. అణచివేతకు గురైన ప్రజా చరిత్రను ప్రాంతీయత తిరిగి వెలుగులోకి తెస్తుంది. ఆధిపత్య భావాలకు కథనాలకు ప్రత్యామ్నాయంగా నిలుస్తుంది. అందుకే ఎప్పుడయినా ఎక్కడయినా ప్రాంతీయ సాహిత్యం అనేది శక్తివంతమైన ప్రతిభావంతమైన సాహిత్య ధోరణిగా నిలబడింది. ప్రాంతీయ సాహిత్యం లేకపోతే సాహిత్య ప్రపంచం ఎప్పటికీ సంపూర్ణం కాదు. వర్తమాన ప్రపంచీకరణ కాలంలో ఉప్పెనలా ఎగిసిన సాంకేతికత, ముసురుకుంటున్న విదేశీ సంస్కృతుల నేపథ్యంలో ప్రాంతీయ భాషల ప్రోత్సాహం, పరిరక్షణ మరింత అవసరం.

తెలంగాణ ఉద్యమ సమయంలో వచ్చిన కవిత్వం, వచనం, గేయ సాహిత్యం, ప్రజా నాటకాలు ఆనాటి ఉద్యమ గళంగా మారాయి. గ్రామీణుల బాధలు, నిరుద్యోగ యువతలో విరక్తి, ఆత్మహత్యలు వంటి వాస్తవాలు గాఢంగా వాటిలో ప్రతిబింబించాయి. 'తెలంగాణ తల్లి', 'బతుకమ్మ' వంటి ప్రాంతీయ చిహ్నాలు సాహిత్యంలో ప్రాముఖ్యత పొందాయి. మా భూమి, మా భాష, మా సంస్కృతి అనే నినాదాలు సాహిత్యంలో కవిత్వ రూపంలో, కథల రూపంలో, దాదాపు అన్ని సాహిత్య సాంస్కృతిక రూపాల్లో ప్రతిధ్వనించాయి. ప్రభావితం చేసాయి. ఉద్యమాన్ని ఉధృతలూగించాయి. ఫలితంగా ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పడింది. ఏర్పడి పదేళ్ళు దాటిపోయాయి. చరిత్రలో దేని గురించైనా మంచి చెడ్డా ఆలోచించడానికి, బేరీజు వేయడానికి దశాబ్దం పెద్ద సమయం కాకపోవచ్చు, కాని అత్యంత వేగవంతమైన వర్తమాన కాలంలో పదేళ్ళు తక్కువ సమయమేమీ కాదు. అందుకే తెలంగాణాలో అభివృద్ధి తదితర రంగాల్ని కాకుండా సాహితీ సాంస్కృతిక రంగాల్లో జరిగిన మార్పును అంచనా కట్టాల్సిన అవసరం వుంది. తెలంగాణా అస్తిత్వం, అణచివేత, నిరాదరణ తదితర అంశాల గురించి సాహిత్యం ఎంతగా వేదన చెందిందో, ఉప్పెనలా ఎగసిందో అదే స్థాయిలో ఆ స్థితిని కొనసాగించిందా లేదా అన్నది చూడాల్సి వుంది. అనేకానేక మౌలిక అంశాలపైన సాహిత్యకారులు ఈ పదేళ్ళు ఏమేరకు నిలబడ్డారో ఎవరికివారు పరిశీలించాలి.

తెలంగాణ సాహిత్య వికాసం కోసం విస్తృతంగా కవులను వెలుగు లోకి తేవడానికి 2017లో రాష్ట్ర ప్రభుత్వం సాహిత్య అకాడమీని ఏర్పాటు చేసింది. తెలంగాణాకు చెందిన అరుదైన, అపురూపమైన గ్రంథాల సేకరణ, ప్రచురణలతో పాటు; సాహిత్య అంశాలపై పరిశోధన; సభలు, సమావేశాలు, శిక్షణా శిబిరాలు, సదస్సుల నిర్వహణలతో పాటు; తెలుగు నుండి ఇతర భాషలలోకి, ఇతర భాషల నుండి తెలుగులోకి అనువాదాలు చేయించడం... వంటి లక్ష్యాలను పెట్టుకున్నారు. పుస్తకాల ప్రచురణ సభలు, ప్రపంచ మహాసభలు లాంటి పనుల్ని అకాడెమీ నిర్వహించింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే అధికారిక సంస్థ స్థాయిలో అకాడెమీ తన వంతు బాధ్యతల్ని నిర్వహించింది. ఈ కృషి ఎన్నదగిందే అయినా సాహిత్య సభలు శాలువాలు సన్మానాలకు పరిమితం కావడం విచారకరం. ఉద్యమం ఒకసారి విజయవంతమైనాక, నిర్దేశించుకున్న లక్ష్యం చేరుకున్నాక అంతా సేద దీరిపోయారేమో అనిపిస్తుంది.

ప్రభుత్వ సంస్థల స్థితి అట్లా వుంటే వేదికలు, సంఘాల స్థితి దానికి భిన్నంగా ఏమీ లేదు. తెలంగాణ సాహిత్యంతో వివిధ భారతీయ భాషా సాహిత్యాల సమన్వయం అంతగా జరగలేదు. ఇతర భాషల నుంచి తెలుగులోకి, తెలుగులోంచి ఇతర భాషలలోకి పరస్పర అనువాదాల గురించి వ్యక్తుల ప్రయత్నాలే తప్ప సంస్థలు అంతగా కృషి చేయలేదు. కనీసం ఇంగ్లీష్ లోకైనా తెలంగాణ సాహిత్యాన్ని అనువదించే ప్రయత్నాలు విరివిగా జరగలేదు. 'ఇండియన్ లిటరేచర్' లాంటి అనేక పత్రికల్ని చూస్తున్నప్పుడు వాటిలో తెలంగాణ రచనలు కనిపించడం అరుదు. జాతీయ స్థాయిలో తమిళంలో పెరుమాళ్ మెరుగన్ గురించి, మలయాళంలో సచిదానందన్ గురించి మాట్లాడినంతగా తెలుగు వాళ్ళ గురించి, తెలంగాణా వాళ్ళ గురించి ప్రస్తావనలు అతి స్వల్పం. ఆ దిశలో మనం బాగా వెనుకబడే వున్నాం. దానికి ప్రధాన కారణం అనువాదం మీద వున్న చిన్న చూపు, అనువాదకులకు ప్రోత్సాహం లేకపోవడం. ఇక దృశ్య మాధ్యమాలని వినియోగించుకోవడంలో మరింత వెనుకబడివున్నాం. తెలంగాణా సాహితీ మూర్తుల పైన, వారి కృషి పైనా వీడియోలు డాక్యుమెంటరీలు మన దగ్గర అతి స్వల్పం. కేంద్ర సాహిత్య అకాడెమీ సాహిత్యకారుల డాక్యుమెంటరీ ఫిలిమ్స్ చేస్తున్నప్పుడు మన తెలంగాణా అకాడెమీ ఎందుకు మిన్నకుందో అర్థం కాదు. దానికి ప్రధానంగా ఇతర భాషా సాహిత్యాల పట్ల, ఇతర సృజనాత్మక మాధ్యమాల పట్ల అవగాహన కొరవడడం ప్రధాన కారణం. ఇక తెలంగాణా రాష్ట్రం ఏర్పడినంక అధికశాతం సాహితీ సృజనకారులు మేధావులు పాలకుల పొత్తిళ్లలోకి చేరుకోవడం, పదవుల చుట్టూ పురస్కారాల చుట్టూ పరుగులు పెట్టడం మొదలు పెట్టినంక తెలంగాణా అస్తిత్వం విస్మృతి అన్న అంశాలు వెనుక సీట్లోకి వెళ్ళిపోయాయి.

మరోవైపు కొత్త తరంలో చదవడమనే అలవాటు దాదాపు అంతరించిపోతున్నది. అంతా చూడడమే, అది కూడా కొన్ని సెకన్ల నిముషాల్లో ముగిసే రీల్స్ మాత్రమే! ఈ స్థితిని మార్చడానికి అకాడెమీలూ, వ్యక్తులుగా సాహిత్యకారుల ప్రయత్నాలు అతి స్వల్పం. నిజానికి సాహిత్యకారులు కాలేజీలకు స్కూళ్ళకు వెళ్ళాలి విద్యార్థుల్లో సిలబస్‌కు ఆవల నాన్ అకాడెమిక్ రీడింగ్‌ను పెంపొందించేందుకు కృషి చేయాలి. బ్లాగులు రాయడాన్ని ప్రోత్సహించాలి. అందమైన దృశ్యాలని అనవసరమైన అంశాల్ని షేర్ చెయడం కాకుండా అర్థవంతమయిన భావాల్ని షేర్ చేసే అలవాటుని యువకుల్లో విద్యార్థుల్లో ప్రోత్సహించాలి. మరోవైపు ఆధునికత సాంకేతికత మొత్తం ప్రపంచాన్ని ఆక్రమిస్తున్నది. తెలంగాణ సాహిత్య ప్రపంచం ఆధునికతను సంతరించుకోవడంలో వెనకబడిందనే చెప్పాలి.

ఇదిలా వుండగా ఇంకో కోణంలో చూసినప్పుడు తెలంగాణ సాహిత్యం నాటి నుంచి నేటి దాకా అనేక సమస్యల్నీ ఆటుపోట్లనీ ఎదుర్కొంది. అనేక ఆంక్షల్ని నిషేధాల్ని కూడా ఎదుర్కొని నిలదీసింది. 'నా తెలంగాణ కోటి రత్నాల వీణ' అన్న దాశరథి మాటల ప్రేరణతో అన్నింటినీ తట్టుకుని నిలబడింది. ఓ పక్క ఆధునికత లాంటి సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ తెలంగాణ సాహితీ రంగంలో గత దశాబ్ద కాలంలో వందలాదిమంది కొత్త కవులు వచ్చారు. వారిలో దళితులు, స్త్రీలు బలహీన వర్గాలు మైనారిటీ కవులూ విస్తృతంగా ప్రభావవంతంగా రాస్తున్నారు. నిలబడేవాళ్ళు నిలబడుతూనే వున్నారు. కొత్త దారులు వేసే వాళ్ళూ ఎదిగి వస్తున్నారు. ఇరుగు పొరుగు భాషల్లోకి చూడడం, ప్రపంచవ్యాప్తంగా వస్తున్న ధోరణులను అర్థం చేసుకోవడం చేస్తే తెలంగాణా సాహిత్యం మట్టి వాసనలతో మరింత వికసిస్తుంది.

(తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా)

■ వారాల ఆనంద్
✆ 94405 01281

తెలంగాణా సాహితీ రంగంలో గత దశాబ్ద కాలంలో వందలాది మంది కొత్త కవులు వచ్చారు. వారిలో దళితులు, స్త్రీలు బలహీన వర్గాలు మైనారిటీ కవులూ విస్తృతంగా ప్రభావవంతంగా రాస్తున్నారు. ఇరుగుపొరుగు భాషల్లోకి చూడడం, ప్రపంచవ్యాప్తంగా వస్తున్న ధోరణులను అర్థం చేసుకోవడం చేస్తే తెలంగాణా సాహిత్యం మట్టి వాసనలతో మరింత వికసిస్తుంది.





ఏకాంత స్పర్శ

నీవు నీ నుండి విడిపోయినా సరే
నీతో కలసి చేసే ప్రయాణమే ఏకాంతం

మెదడు మైదానంలో
మనసు అనుభవించే మనమైన స్వేచ్ఛ

నీ తనం తప్పి తోడే నిజాలు
ఏకాంత స్పర్శకు తడిసి తడిసి

అనుభవం పొలిమేర దాటి
నిజం స్వరంతో విహరిస్తూ పోతే

యాతన అంచులపై
కష్టం కళ్ళు మూసుకుని నడిచే ధైర్యానికి

కలల చిరునామా చూపుతూ
కాలం దారి వదులుతుంది

లోకం ఓ ప్రశ్నాపత్రంగా
ఇష్టాలతో పని లేని పరీక్షలో

ఒక్కో ప్రశ్న రాత్రంత పొడవు
ఓ రోజంత బరువు

వయసుకి రెట్టింపు
ఆలోచన కురిసి

మనిషెత్తు తపన పారితేనే
మనసు పదునెక్కి
బతుకు జీవితమయ్యేది

■ చందలూరి నారాయణరావు
✆ 97044 37247

'తెలుగు జాడలు' పుస్తకంపై చర్చా సమావేశం

తెలుగు రాష్ట్రాలకు వెలుపల ప్రాచీన తెలుగు మూలాలున్న ప్రజల జీవితాల గురించి ఆ ప్రాంతాలకు ప్రయాణించి, ఆ ప్రజలతో సంభాషించిన అనుభవాలతో ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు రాసిన పుస్తకం 'తెలుగు జాడలు'పై చర్చా సమావేశం జూన్ 5 సాయంత్రం 6.30ని.లకు లామకాన్, బంజారాహిల్స్, హైదరాబాద్‌లో జరుగుతుంది. వివరాలకు: 96427 31329.

సుమనస్పతిరెడ్డి

శీలావీ పురస్కార ప్రదానం

శీలావీ సాహిత్య చిత్రకళా వేదిక 2025 సంవత్సరానికి గాను శీలా వీర్రాజు కథానికా పురస్కారాన్ని 'గారడివాడు' కథా సంపుటి రచయిత కె.ఎ. ముని సురేష్ పిళ్ళెకి, శీలా వీర్రాజు చిత్రకళా పురస్కారాన్ని చిత్రకారుడు పి.ఎస్. చారికి ఇస్తున్నది. రూ.15వేల నగదు, జ్ఞాపికతో పురస్కార ప్రదానం జూన్ 7 సాయంత్రం 5.30ని.లకు రవీంద్ర భారతి (మొదటి అంతస్తు), హైదరాబాద్‌లో జరుగుతుంది. విహారి, మామిడి హరికృష్ణ, ఇంద్రగంటి మోహనకృష్ణ, అమృతలత, ఎమ్వీ రామిరెడ్డి పాల్గొంటారు. శీలావీ చిత్రలేఖనాలపై వ్యాస సంకలనం 'ఒక చిత్రకారుడు – అనేక అవలోకనాలు', శీలా వీర్రాజు ఫాంట్‌తో 250 మంది కవుల కవితా సంకలనం 'శీలాక్షరాలు' ఆవిష్కరణలు జరుగుతాయి.

శీలా సుభద్రాదేవి

కథ, కవిత, వ్యాసం, ఆధ్మాత్మిక సంపుటాలకు ఆహ్వానం

ఈశ్వరగారి ముక్తేశ్వరి ఫౌండేషన్ ఇచ్చే సాహితీ అవార్డుల కోసం 2024లో ప్రచురితమైన కథా, కవితా, వ్యాస, ఆధ్యాత్మికా సంపుటాలను పంపాలి. ఒక్కో విభాగానికి రూ.10,116 చొప్పున నగదు పారితోషికంతోపాటు, జ్ఞాపికతో వేములవాడలోని ముక్తేశ్వరి ఫౌండేషన్ ప్రధాన కార్యాలయంలో సత్కారం ఉంటుంది. రచనలు మూడేసి ప్రతులను జూన్ 25 లోపు పంపాల్సిన చిరునామా: ఈశ్వరగారి నరహరి శర్మ, చైర్మన్, ఈశ్వరగారి ముక్తేశ్వరి ఫౌండేషన్, ఓల్డ్ మార్కెట్, వేములవాడ- 505302 ఫోన్: 93966 48880.

మంగారి రాజేందర్

వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో
12 మందికి సేవా పతకాలు

వరంగల్ క్రైం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న 11మందిని సేవా పతకాలకు, ఒకరిని ఉత్తమ సేవా పతకానికి ఎంపిక చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తమ సేవా పతకంలో హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న ఏ.రఘునరెడ్డి ఉండగా, సేవా పతకాలకు ఎంపికైన వారిలో వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, సీసీఆర్‌బీ ఎస్సై జె. విల్సన్, ఏఎస్సై పి. ప్రకాశ్‌రెడ్డి, ఏఆర్ ఎస్సైలు మక్బూల్ పాషా, రాంధన్, షేక్ పాషా, కాజీపేట ట్రాఫిక్ పీఎస్ ఏఎస్సై వి.చంద్రమౌళి, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్స్ ఖాజా నిజాముద్దీన్, బుస్సు భీమయ్య, మామునూర్ హెడ్‌కానిస్టేబుల్ బి. రమేశ్, వంగర కానిస్టేబుల్ కె. తిరుపతిగౌడ్ ఉన్నారు.

ఎవరికైనా డబ్బులిస్తే..
వారి ఇండ్లు రద్దు చేస్తాం

- పదేళ్లలో ఒక్క ఇల్లు ఇవ్వని గత పాలకులు
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీ ఇస్తున్న ఎమ్మెల్యే, మేయర్, కార్పొరేటర్లు

న్యూశాయంపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎవరికైనా డబ్బులు ఇస్తే వారి ఇళ్లు రద్దవుతాయని, ఇళ్లకు పైసలు వసూలు చేశారని చెప్పిన వారికి రూ.25వేలు బహుమతి ఇస్తామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ హంటర్ రోడ్‌లోని అభిరామ్ గార్డెన్‌లో ఆదివారం నియోజకవర్గ పరిధిలోని 26డివిజన్ల లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ పేద కుటుంబాలకు పెద్ద పండుగగా ఇచ్చిన ప్రజా ప్రభుత్వం మనది అన్నారు. ప్రతి పేదవారి సొంత ఇంటి కల ఇందిరమ్మ రాజ్యంలోనే సాకారం అవుతుందన్నారు. పదేళ్ల పాలనలో ఒక్క ఇల్లు ఇవ్వని గత ప్రభుత్వం, మన ప్రభుత్వం వచ్చిన 17నెలల్లోనే ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు అయ్యాయని, ఆదివారం 660 మందికి ప్రొసీడింగ్ కాపీలు అందజేశామని, మిగతా వారికి వారం రోజుల్లో అందజేస్తామన్నారు. ప్రజా ప్రభుత్వంలో అర్హులకు న్యాయం చేయాలన్నదే లక్ష్యం అన్నారు. హనుమకొండ చౌరస్తాలో రోడ్డుపై కూ రగాయలు అమ్ముకునే వ్యక్తుల విషయంలో రోడ్లు నీటుగా ఉండాలని, వారిని అక్కడి నుంచి వేరే చోటికి మారుస్తామనే నిర్ణయంతో మేం ఉంటే, చిరువ్యాపారులను అడ్డుపెట్టుకుని కొందరు చిల్లర రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. చిరువ్యాపారులకు మేం అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మహానగరపాలక సంస్థ మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజుతో పాటు, పశ్చి మ నియోజకవర్గంలోని కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉవ్వెత్తున సాగిన ఉద్యమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు నిర్వహించిన పాత్ర అద్వితీయం. రాష్ట్రం కోసం ఎందరో ఆత్మబలిదానం చేసుకున్నారు. ఎట్టకేలకు తెలంగాణ రాష్ట్ర కల సాకారమైంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఒక వైపు అధికారులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. మరో వైపు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైనప్పటికీ ఉమ్మడి జిల్లాలో అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. రాష్ట్ర అవతరణ వేడుకలు జరగుతున్న వేళ ఉమ్మడి జిల్లాలో సాగిన తెలంగాణ ఉద్యమం, స్వరాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సాకారం కాని స్వప్నాలపై ప్రత్యేక కథనం...



అభివృద్ధి అంతంతే..!

- అపరిష్కృతంగా అనేక సమస్యలు
- స్వయంపాలనలో ముక్కలైన ఉమ్మడి జిల్లా
- జిల్లాల విభజనతో నెరవేరని లక్ష్యం
- విడిపోయాక నగర అస్తిత్వంపై నీలినీడలు
- అటకెక్కిన ఉక్కుఫ్యాక్టరీ హామీ
- స్వరాష్ట్ర పోరాటంలో ఓరుగల్లు పాత్ర కీలకం
- నేడు రాష్ట్ర అవతరణ వేడుకలు
- విస్తృతంగా ఏర్పాట్లు చేసిన అధికారులు

చేసింది కొంత.. చేయాల్సింది ఎంతో..

హనుమకొండ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉవ్వెత్తున సాగిన తెలంగాణ తొలి, మలి ఉద్యమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు అద్వితీయమైన పాత్ర పోషించారు. తెలంగాణ ఉద్యమానికి సంబంధించిన ఎన్నో కీలక ఘట్టాలు, భారీ బహిరంగ సభలు, సదస్సులు వరంగల్ జిల్లా కేంద్రంగానే సాగాయి. ఉద్యమం సందర్భంగా తీసుకున్న ప్రతీ కీలక నిర్ణయం, ఇచ్చిన పిలుపునకు ఉమ్మడి వరంగల్ వేదికగా నిలిచింది. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను ఎలుగెత్తుతూ నిర్వహించిన భారీ బహిరంగ సభలకు ఓరుగల్లే వేదికైంది. తెలంగాణలోని అన్ని జిల్లాల కన్నా మిన్నగా వరంగల్ ఉద్యమంలో అగ్రభాగాన నిలిచింది. తెలంగాణ ఉద్యమ పితామహుడు ప్రొఫెసర్ జయశంకర్ మార్గదర్శనంలో ఉద్యమం ముందుకు సాగడంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు ముందు వరుసలో నిలిచారు. ఉద్యమ సందర్భంగా నిర్వహించిన పలు సదస్సుల, భారీ బహిరంగ సభలు, ర్యాలీల్లో వేలాదిగా పాల్గొన్నారు. జై తెలంగాణ అంటూ పిడికిలి బిగించి నినదించారు. తెలంగాణ మలి ఉద్యమంలో ధర్మాగ్రహాన్ని వెలిబుచ్చి జిల్లాలో 120 మంది ఆత్మబలిదానాలు చేశారు. ఓరుగల్లు కేంద్రంగా జరిగిన మూడు సభలు తెలంగాణ ఉద్యమాన్ని కొత్త మలుపు తిప్పాయి. 2003 ఏప్రిల్ 27న వరంగల్ జైత్ర యాత్ర పేరిట నిర్వహించిన సభకు 17 లక్షల మంది హాజరయ్యారు. ఈ మహాసభ ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. అదే సంవత్సరం డిసెంబర్ 5న జనగామలో ఓరుగల్లు వీరగర్జన పేరుతో మరో భారీ బహిరంగ సభ జరిగింది. ఆ తర్వాత 2007లో తెలంగాణ విశ్వరూప సభ భారీ ఎత్తున నిర్వహించారు. ఈ సభకు పది లక్షల మందికిపైగా పాల్గొన్నారు. 2010 డిసెంబరు 16న హనుమకొండలోని ప్రకాశ్‌రెడ్డి పేటలో మహాగర్జన పేరుతో నిర్వహించిన ఘర్జన సభకు 25 లక్షల మంది హాజరయ్యారు. ఈ సభ గిన్నీస్ బుక్ రికార్డులకెక్కి వరంగల్ పేరు ప్రపంచ వ్యాప్తంగా మర్మోగింది. మహాగర్జన తెలంగాణ ఉద్యమ చరిత్ర పుటల్లో చెరిగిపోని ఓ మహోజ్వల ఘట్టం. తెలంగాణ ఉద్యమంలో ప్రజలంతా రోడ్లపైకి వచ్చి ప్రధాన రోడ్లు, జంక్షన్లలో రోడ్లపైనే వంటలు చేశారు. అక్కడే కూర్చొని బంతి భోజనం చేశారు. ఉవ్వెత్తిన సాగిన ఈ వంటావార్పు ఆందోళనతో అనేక చోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. మానుకోట ఘటన తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పింది. ఉద్యమ ఉధృతికి ఉత్ప్రేరకంగా మారింది. తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో మైలురాయిలా నిలిచింది. ఉద్యమానికి మరింత ఆజ్యం పోసింది. తెలంగాణ ఉద్యమ వ్యాప్తికి, ఉద్యమ విస్తృతికి ఆద్యుడు తెలంగాణ జాతిపిత ఆచార్య కొత్తపల్లి జయశంకర్. ఉద్యమానికి తాత్విక భావనను, సైద్ధాంతిక పునాదిని వేశారు. ప్రజాకవి కాళోజీ నారాయణ రావు సైతం తెలంగాణ తొలి ఉద్యమంలోనే తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలపై అక్షర శస్త్రాలను సంధించారు. ఉద్యమమే ఊపిరిగా బతికిన ఉద్యమకారులెందరో తమ ప్రాణాలను తృణప్రాయంగా త్యజించారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఆత్మబలిదానాలు చేశారు. ఎందరో వీరుల పోరాటం, మరెందరో అమరవీరుల ఆత్మబలిదానాల ఫలితంగా 2014 జూన్ 2న తెలంగాణ

మిగతా 6వ పేజీలో...



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవానికి ముస్తాబైన హనుమకొండ కలెక్టర్ కార్యాలయం



పరీక్షల కేంద్రాలను పరిశీలిస్తున్న చైర్మన్ బాలకృష్ణారెడ్డి, వీసీ ప్రతాప్‌రెడ్డి, కన్వీనర్ వెంకట్రామిరెడ్డి

ఎడ్‌సెట్ ప్రశాంతం

- 83శాతం అభ్యర్థులు హాజరు
- రాష్ట్ర వ్యాప్తంగా 74 కేంద్రాల్లో నిర్వహణ
- ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి

4

420 హామీలతో కాంగ్రెస్ మోసం

- రాష్ట్రానికి బీజేపీ నిధులు కేటాయించకుండా అన్యాయం
- ప్రజలు కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారు
- బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ భాస్కర్

హనుమకొండ టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో తెలంగాణ ప్రజలకు 420 హామీలు ఇచ్చి మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ భాస్కర్ అన్నారు. ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడిచిన ప్రజల సమస్యలను పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 10 సంవత్సరాల పాలనలో రాష్ట్రానికి నిధులు కేటాయించకుండా అన్యాయం చేసిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని అన్నారు. విభజన చట్టంలోని హామీలను అమలు చేయకుండా కేంద్రం తుంగలో తొక్కిందన్నారు. రాష్ట్రంలో 8 మంది బీజేపీ పార్లమెంటు సభ్యులు ఉన్నా నిధులు తీసుకురావడంలో విఫలమౌతున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా కేసీఆర్ 14 సంవత్సరాలు పోరాటాలు చేసి ప్రాణ త్యాగానికి సిద్ధపడినట్లు గుర్తుచేశారు. సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని 10 యేళ్ల పాలనలో దేశంలోనే అగ్రభాగాన నిలిపిన మహనీ యుడు కేసీఆర్ అని వినయ్‌భాస్కర్ అన్నారు. ప్రజల ఆకాంక్షలను నేరవేర్చిన కేసీఆర్ పాలనను ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు.



బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న దాస్యం వినయ్ భాస్కర్

నేడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా అవతరణ వేడుకలు

తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకుందామని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ భాస్కర్ పార్టీ శ్రేణులను కోరారు. గ్రామగ్రామన జాతీయ జెండాతో పాటు పార్టీ జెండాను ఎగరవేసి, కేసీఆర్ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని కోరారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావు హాజరవుతారని తెలిపారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరుకావాలని వినయ్‌భాస్కర్ కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు రుణవిమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, సంకు నర్సింగ్, ఇమ్మడి లోహితరాజు, నల్లా స్వరూపరాణిరెడ్డి, సోదా కిరణ్, మాజీ కార్పొరేటర్లు ఉడతల సారంగపాణి, జోరిక రమేష్, పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, నాయకులు పత్తి సంపత్‌రెడ్డి, వీరేందర్, పుల్లయ్య, నవీన్, యాకుబ్ పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించకుంటే
సమ్మెకు సిద్ధం


327 యూనియన్ సెక్రటరీ జనరల్ శ్రీధర్

5

అమరుల స్థూపానికి
రాజకీయ రంగు

- బీఆర్ఎస్ గద్దెతో సహా స్థూపానికి తెలుపు రంగు వేసిన మునిసిపల్ సిబ్బంది
- మాది స్థూపం అంటూ గులాబీ రంగు వేసిన బీఆర్ఎస్ శ్రేణులు
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన గొడవ

4



అవినీతి ఆగేనా..?!

- అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్‌తో పాటు ఏఐ సేవలు
- బుకింగ్ లేకున్నా.. ప్రతీ రోజూ ఐదు వాక్ ఇన్ రిజిస్ట్రేషన్‌లు
- నేటి నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాలో అమలు

భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్షాళనపై ప్రభుత్వ నజర్

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

వసూళ్లకు నిలయాలుగా.. అవినీతికి ఆనవాళ్లుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిలుస్తున్నాయి. పత్రాలన్నీ సక్రమంగా ఉన్నా.. ఎంతో కొంత ముట్టచెబితేనే పక్కాగా పని అవుతుంది. కొంతమంది డాక్యుమెంట్ రైటర్లే వసూళ్ల రా యుళ్లుగా చలామణి అవుతున్నారు. అధికారుల వాటా క లుపుకుని డాక్యుమెంట్ తయారీ ఖర్చుల కింద వసూళ్లకు దిగుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఇటీవల ముగ్గురు సబ్‌రిజిస్ట్రార్‌లు అవినీతి నిరోధక శాఖకు చిక్కడం కలకలం రేపింది. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్ శాఖలో ప్రభుత్వం కొత్తగా తీసుకవస్తున్న స్లాట్ బుకింగ్ విధానంతో పాటు కృత్రిమ మేధతో(ఏఐ) పర్యవేక్షణ, వాక్ ఇన్ రిజిస్ట్రేషన్‌లు ఏ మేరకు అక్రమాలను అడ్డుకట్టు వేస్తాయనే చర్చ జరుగుతుంది. వివరాల్లోకి వెళితే..

అక్రమాలకు అడ్డాగా.. అవినీతికి ఆనవాళ్లుగా..

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంతో పాటు 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ప్రతీ రోజు 300 నుంచి 500 వరకు డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. అయితే రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా ఉమ్మడి జిల్లాల్లో కొంతమంది డాక్యుమెంట్ రైటర్లు, సబ్‌రిజిస్ట్రార్‌ల మధ్య అవగాహనతో అక్రమాలకు అడ్డాగా మారాయనే ఆరోపణలు ఉన్నాయి. సబ్‌రిజిస్ట్రార్‌లకు, డాక్యుమెంట్ రైటర్లకు మధ్య వసూళ్ల బాగో తం ఏసీబీ దాడుల్లో బయటపడింది. గత ఏడాది జూలై 26వ తేదీన హనుమకొండ జిల్లా పరకాల సబ్‌రిజిస్ట్రార్ సునిత 1,173 గజాల భూమిని గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసేందుకు డాక్యుమెంట్ రైటర్ నరేష్ ద్వారా రూ.80 వేలు తీసుకుంటు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. డాక్యుమెంట్ తయారు ఖర్చులతో పాటు సబ్‌రిజిస్ట్రార్‌లకు ఇవ్వాల్సిన మాముళ్ల లెక్క కూడా ఈ డాక్యుమెంట్ రైటర్ ఆఫీసుల్లోనే కుదురుతుందనే ఆరోపణలు ఉన్నాయి. వీరితో పాటు ఔట్‌సోర్సింగ్ ద్వారా తమ వారిని కంప్యూటర్ ఆపరేటర్లుగా,

మిగతా 5వ పేజీలో...

కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అజీజ్‌ఖాన్



వరంగల్ స్పోర్ట్స్, జూన్ 1(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా హనుమకొండకు చెందిన మహ్మద్ అజీజ్‌ఖాన్ ఎన్నిక య్యారు. ఆదివారం హైదరా బాద్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు హనుమకొండ జిల్లాకు చెందిన పలువురికి రాష్ట్ర కమిటీలో అవకాశాలు వరించాయి. ఇందులో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మహ్మద్ అజీజ్‌ఖాన్, ఈసీ మెంబర్‌గా ఆకుల సారం గపాణి, రిఫరీ కమిటీ సభ్యులుగా సీహెచ్. శ్రీనివాస్, టెక్నికల్ సభ్యులుగా ఎండీ. అక్ర మ్‌ఖాన్‌లు ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లా డు తూ..రాష్ట్ర కమిటీలో హనుమకొండ జిల్లా నుంచి సముచిత స్థానం కల్పించిన కబ డ్డీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులకు ధన్యవాదాలు తెలిపారు.

బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తులు

వరంగల్ కలెక్టరేట్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 1, 5వ తరగతులలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఇందుకోసం షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి భాగ్యలక్ష్మి ప్రకటించారు. ఆసక్తి గల విద్యార్థులు వరంగల్ సహాయ సాంఘిక సంక్షేమ అధికారి (9550078045, 7396503448, 8919553026), నర్సంపేట సహాయ సాంఘిక సంక్షేమ అధికారి (7337585866, 7396503448, 8919553026) నుంచి దరఖాస్తులు తీసుకోవాలని, ఈ నెల 16వ తేదీలోగా ఏఎస్‌డబ్ల్యూఓ కార్యాలయాల్లో అందజేయాలని ఆమె సూచించారు.

గుంటూరుపల్లెలో 10 పశువుల అపహరణ

రూ.4లక్షల విలువ చేసే 9 గేదెలు, 1 దూడ మాయం



చోరీ జరిగిన పశువుల కొట్టాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ రవీందర్‌రెడ్డి

నర్సంపేట టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పశువుల కొట్టం నుంచి 10 పశు వులను గుర్తు తెలియని దొంగలు అపహరణకు పాల్పడిన సంఘటన నర్సంపేట మండలంలోని మహేశ్వరం శివారు గుంటూరుపల్లెలో శనివారం రాత్రి జరిగింది. ఎస్సై అరుణ్ తెలిపిన వివరాలిలా వున్నాయి. గుంటూరుపల్లెకు చెందిన మోతె తిరుపతిరెడ్డి అనే వ్యక్తికి చెందిన పశువుల కొట్టం నుంచి 9 గేదెలు, 1 దూడను గుర్తు తెలియని దొంగలు అపహరించుకెళ్లినట్లు తెలిపారు. వీటి ధర రూ.4 ల క్ష లు ఉంటుందని, తిరుపతిరెడ్డి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. పశువులతో ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై కోరారు. సంఘటన స్థలాన్ని నర్సం పేట ఏసీపీ రవీందర్‌రెడ్డి, ఎస్సై అరుణ్ ఆదివారం సందర్శించి పరిశీలించారు. ఇదిలావుండగా పెద్ద సంఖ్యలో పశువుల చోరీ జరగటంపై నర్సంపేట ప్రాం తం లో కలకలం రేపింది. ఒకటి, రెండు గేదెలను అపహరించుకెళ్లిన సంఘ టనలు జరిగినప్పటికీ ఇంత పెద్ద సంఖ్యలో కొట్టం నుంచి ఎత్తుకెళ్లడంపై సం చలనం రేకెత్తిస్తోంది. ఎవరైనా ఒకరు చేశారా, లేదంటే ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పశువుల దొంగల ముఠా సభ్యులు అపహరణకు పాల్పడ్డారా అనే అను మా నాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సంఘటనపై ఏసీపీ స్వయంగా రంగంలో దిగి విచారణ జరపడం గమనార్హం.

రేపు చింతగట్టులో రాకేష్ సంతాప సభ

హసన్‌పర్తి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఛత్తీస్‌గడ్ మాడ్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు అగ్రనేత కేశవ రావు అలియాస్ బసవరాజ్ కంప్యూటర్ ఆపరేటర్ కామ్రేడ్ రాకేష్ అలియాస్ వివేక్ సంతాప సభ మంగళవారం చింతగట్టులోని రాకేష్ స్వగృహంలో నిర్వహిస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. బుధవారం రాకేష్ దశదిన కర్మ నేపథ్యంలో నిర్వహిస్తున్న ఈ సంతాప సభకు ప్రజా సంఘాలు, పౌర హక్కుల సంఘం, మానవ హక్కుల సంఘం, అమరుల బంధుమిత్రుల కమిటీ సభ్యులు, వివిధ విద్యార్థి సంఘాల నేతలు హాజరవుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ముంచుతున్న మాయగాళ్లు..!


పల్లె ప్రజలపై సైబర్ పంజా

లక్షల్లో కష్టార్జితాన్ని కోల్పోతున్న ప్రజలు

అవగాహన లేక సైబర్ మోసాలకు బలవుతున్న వైనం

బాధితుల్లో రైతులు, ప్రభుత్వ ఉద్యోగులు

అవగాహన కల్పించాలని వేడుకోలు



మహదేవపూర్ రూరల్, జూన్ 1 : సైబర్ నేరగాళ్లు రోజురోజుకు రెచ్చిపోతున్నారు. కొత్త కొత్త పద్ధతుల్లో వల వేస్తూ రూ. లక్షలు దోచుకుంటున్నారు. యాప్స్, స్పాం కాల్స్, లింకులతో పాటు జంప్‌డు కాల్స్ ఐడెంటిటీ దొంగతనం ద్వారా భారీగా అకౌంట్లలో ఉన్న కరెన్సీని కొల్లగొడుతున్నారు. ఒకప్పుడు ప్రధాన నగరాలు, పట్టణాలకే పరిమితమైన సైబర్ నేరగాళ్ళు గ్రామీణులపైన దృష్టిపెట్టారు. డబ్బులు ఎక్కువ మొత్తంలో నిల్వ ఉంచుకునే వారితో పాటు అధికంగా లావాదేవీలు జరిపే వారిపై దృష్టి పెడుతూ వివిధ రకాలుగా సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో సైబర్ నేరాలపై అవగాహన లేకపోవడంతో మోసగాళ్ళ వలలో పడి ఆర్థికంగా కుదేలవుతున్నారు..

ఇటీవల జరిగిన సైబర్ నేరాల్లో అత్యధికంగా రైతులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు బాధితులుగా మారుతున్నారు. మహదేవపూర్ మండల కేంద్రంలో పనిచేస్తున్న ఓ రేంజ్ అధికారి, ఓ ఏపీఎం దఫాలు దఫాలుగా చెరో లక్ష వరకు కోల్పోయారు. వాట్సాప్‌లో వచ్చిన ఓ అనధికార యాప్ ఇన్‌స్టాలేషన్ ద్వారా వీరి వాట్సాప్ పూర్తిగా సైబర్ నేరగాళ్ళ చేతిలోకి వెళ్ళడంతో అకౌంట్ల నుంచి డబ్బులు కోల్పోయారు. సూరారం గ్రామానికి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు సైబర్ వలలో చిక్కుకుని రూ.3లక్షల వరకు కోల్పోయాడు. బాధిత ఉపాధ్యాయుడి సిమ్ స్వాప్ ద్వారా ఈనేరానికి పాల్పడ్డారు. సిమ్ స్వాప్ చేసిన నేరగాళ్ళు తొలుత ఆధార్ లాక్ చేసి అకౌంట్లను లాక్ చేశారు. ఆతర్వాత అకౌంట్లలోని డబ్బులను విడతల వారీగా నొక్కేశారు. సిమ్ స్వాప్ కావడంతో ఆయన మొబైల్‌కు మెసేజ్ కూడా రాలేదు. సైబర్ మోసాన్ని ఆలస్యంగా గుర్తించిన ఉపాధ్యాయుడు తేరుకునే లోపే రూ.3లక్షలు కాజేశారు. అప్పటికీ ఫిర్యాదు చేసినప్పటికి కేవలం రూ.20వేల మాత్రమే హోల్డ్ అయ్యాయి. తాజాగా ఎల్కేశ్వరం గ్రామానికి చెందిన ఓరైతు చెందిన రూ.3లక్షలను సైబర్ నేరగాళ్ళు కాజేశారు. పెట్టిన పెట్టుబడికి రెట్టింపు వస్తాయనే వాట్సాప్‌లో వచ్చి న ఓ మెసెజ్‌తో సైబర్ నేరానికి గురయ్యాడు. దీం తో ధాన్యం అమ్మగా వచ్చిన మొత్తాన్ని ఆరైతు కోల్పోయాడు.

అవగాహన లేక.. ఆలస్యంగా ఫిర్యాదులు

సైబర్ మోసాలపై అవగాహన లేకపోవడంతో రైతులు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు ఆర్థికంగా చితికిపోతున్నారు. సైబర్ మోసాల బారిన పడకుండా ఉండడంతో పాటు మోసాన్ని గుర్తించి ఫిర్యాదు చేయడంపై అవగాన లేకపోవడంతో భారీగా తమ కష్టార్జితాలను కోల్పోతున్నారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఫిర్యాదు చేస్తే డబ్బులు తిరిగి పొందే అవకాశం ఉంటుంది. కాని అది సైబర్ నేరమని గుర్తించడానికే రోజులు గడుస్తుండటం సైబర్ నేరాలపై వారికున్న అవగాహన ఎంటో అర్థమవుతోంది. గ్రామాల్లో కళాప్రదర్శనల ద్వారా అవగాహన కల్పిస్తే అదుపులోకి రావచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నా యి.

ప్రధాన సైబర్ మోసాలు ఇవే..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో పాటు పలు ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల పేర్ల మీద ఫేక్ అప్లికేషన్లు రెడి చేసి వాట్సాప్ ద్వారా పంపిస్తుంటారు. దానిని క్లిక్ చేసి ఇన్స్టాల్ చేయగానే ఆమొబైల్ పూర్తిగా హ్యాక్ అయ్యి సైబర్ నేరగాళ్ళ చేతుల్లోకి వెళ్తుంది. హ్యాక్ అయిన బాధితుడి బంధువులు, స్నేహితులకు సేమ్ యాప్ లేదా మెజేస్ పంపించి సైబర్ వలలో చిక్కుకునేలా చేస్తారు. మీకు క్రెడిట్ కార్డు, లోన్ ఆఫర్ వచ్చిందంటూ కాల్ చేస్తారు. వారితో మమేకమైతే ఓటీపీల ద్వారా డబ్బులు కాజేస్తారు. ఇక ఫేక్ మెసెజ్‌లు, లింకులను క్లిక్ చేయడం ద్వారా సైబర్ మోసాలకు బలవుతున్నారు. ఇవే కాకుండ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ తదితర సోషల్ మీడియా ప్లాట్ ఫాం ద్వారా ఇబ్బందుల్లో ఉన్నానంటూ తెలిసిన వారి పేర్ల మీద చాటింగ్ చేస్తుంటారు. ఇక పలుకుబడి కలిగిన వ్యక్తుల ఐడెంటీటిని ఉపయోగించుకుని ఫోన్‌లో వారి పీఏ అంటూ మోసాలకు ప్పాలడుతున్నారు. ఇవే కాకుండ రకరకాలుగా సైబర్ మోసగాళ్ళు నేరాలకు పాల్పడుతున్నారు.అధికారులు సైబర్ నేరాలు, మోసాల పట్ల అవగాహన కల్పిస్తే నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. కేవలం వాట్సాప్, సోషల్ మీడియాల్లో కాకుండా మండల కేంద్రాలు, గ్రామాల్లో దీనిపై సంబంధిత అధికారులు అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

కిరణ్ ఖరే, భూపాలపల్లి జిల్లా ఎస్పీ

అపరిచిత వ్యక్తులు పంపే మెసేజ్, లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. తెలిసిన వ్యక్తుల పేర్ల మీద వచ్చే ఫోన్‌కాల్స్ పట్ల జాగ్రత్త వహించాలి. ఆన్‌లైన్ పేమెంట్లు చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అప్లికేషన్లు, వెబ్ సైట్లు సరైనవేనో కాదో నిర్ధారించాకే వాటిని వినియోగించాలి.

టీఎస్ ఎడ్‌సెట్ ప్రశాంతం

రాష్ట్ర వ్యాప్తంగా 74 కేంద్రాల్లో నిర్వహణ

ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి



ఆన్‌లైన్‌లో ప్రశ్నాపత్రాలను విడుదల చేస్తున్న చైర్మన్ బాలకృష్ణారెడ్డి, వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ జూన్ 1, (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా టీఎస్ ఎడ్‌సెట్-25 ప్రవేశాల పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. కాకతీయ యూనివర్సిటీ ఎడ్‌సెట్-25 కార్యాలయంలో ఆదివారం ఉదయం 8 గంటల ప్రాంతంలో రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకృష్ణారెడ్డి, ఎడ్‌సెట్ చైర్మన్ కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, రాష్ట్ర ఉన్నత విద్య మండలి వైస్ చైర్మన్లు ఈ.పురుషోత్తం, ప్రొఫెసర్ మొహమ్మద్, సెక్రటరీ ప్రొఫెసర్ ఎస్.వెంకటేశ్‌లు ఎడ్‌సెట్ ప్రశ్నాపత్రాన్ని ఆన్‌లైన్‌లో విడుదల చేశారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాల్లో కంప్యూటర్ బెస్డ్ పరీక్షలు జరిగాయి. ఎడ్‌సెట్‌కు రాష్ట్ర వ్యాప్తంగా 38,758 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోగా 32,106 మంది పరీక్షలకు హాజరైయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 74 పరీక్ష కేంద్రాల్లో మొత్తంగా 83 శాతం హాజరునమోదైనట్లు ఎడ్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డి వెల్లడించారు. కాగా, వరంగల్ ప్రాంతంలోని మొక్షిత, వాగ్దేవి కళాశాల, ఆయాన్ ఇన్స్టిట్యూట్, జయ కాలేజీ, సుమతిరెడ్డి కళాశాల, వాగ్దేవి హనుమకొండ, నోబెల్ ఇన్స్టిట్యూట్ పరీక్షల కేంద్రాల్లో జరిగిన పరీక్షల నిర్వహణ తీరును ఉన్నత విద్యమండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకృష్ణారెడ్డి, కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలతో కలిసి పరిశీలించారు.

కేయూ ఎడ్‌సెట్ కార్యాలయంలో జరిగిన ప్రశ్నా పత్రాల ఆన్‌లైన్ విడుదల కార్యక్రమంలో కేయూ విద్యా విభాగం డీన్ ప్రొఫెసర్ ఎం.రామనాథ్‌కిషన్, క్యాంపస్ కళా శాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్ , డాక్టర్ ఎ.నరేందర్, ఎడ్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డిలు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



యుగందర్ (ఫైల్)

హసన్‌పర్తి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లిలో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు తెలిపిన ప్రకారం... కొత్తపల్లికి చెందిన కొత్తూరు యుగందర్(50) గత నెల 29న ఇంటి నుచి వెళ్లి తిరిగి వస్తానని చెప్పి రాలేదని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అతని వద్ద 8179364720 నెంబరు కలిగిన సెల్‌ఫోన్ ఉందని, అతని మొబైల్‌కి ఫోన్ పే అవకాశం ఉండడంతో బంధువులను ఫోన్ పే ద్వారా డబ్బులు వేయమని కోరుతున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు వెంటనే హసన్‌పర్తి పోలీసు స్టేషన్ 8712685097 నంబర్‌కు ఫోన్ చేయాలని ఇన్‌స్పెక్టర్ చేరాలు కోరారు.

వివాహిత అదృశ్యం

మడికొండ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వివాహిత కనిపించకుండా పోయిన ఘటన మడికొండలో చోటుచేసుకుంది. స్థానిక ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం... స్థానిక రైతు మేరె కిషన్ భార్య మేరె కల్పన(26) జూన్ 30న ఉదయం తన తల్లిని హాస్పిటల్‌కు తీసుకెళ్ళాలని చెప్పి ఇంటి నుంచి వెళ్ళి తిరిగి రాలేదు. కిషన్ తన అత్తగారిని అడుగగా అక్కడికి రాలేదని తెలిపింది. బంధువులు, స్నేహితుల వద్ద విచారించినా ఆచూకీ లభించలేదు. ఇంటి నుంచి వెళ్ళిన సమయంలో బ్లాక్ కలర్ పంజాబీ డ్రెస్ ధరించి ఉంది. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం తెలపాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.

సమస్యల పరిష్కారానికే భూభారతి

రేపటి నుంచి అవగాహన సదస్సులు

ఆర్డీవో గణేష్‌బాబు



మాట్లాడుతున్న తొర్రూర్ ఆర్డీవో గణేష్‌బాబు

మరిపెడ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఎళ్ల తరబడి నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూభారతి చట్టాన్ని రూపొందించిందని, దీని ద్వారా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించుకోవాలని తొర్రూర్ ఆర్డీవో గణేష్ బాబు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో డివిజన్‌స్థాయి రెవెన్యూ సిబ్బందికి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ నెల 3 నుంచి గ్రామాల్లో రెవెన్యూ అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. రైతులు భూ సమస్యలు ఏమైనా ఉంటే సంబంధిత ఫారాన్ని నింపి అధికారులకు అందజేయాలని సూచించారు. సంబంధిత అధికారులు సదరు సమస్యను స్థాయిని బట్టి పరిశీలించి విచారణ జరిపి పరిష్కరిస్తామన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్ర 4 గంటల వరకు ఆయా గ్రామ పంచాయతీల్లో నిర్వహించే సదస్సులను రైతులు వినియోగించుకోవాలని కోరారు. జూన్ 3వ తేదీన పురుషోత్తమాయగూడెం, బుర్హాన్‌పురం, 4న గుండెపూడి, గాలివారిగూడెం, అమ్మనాయక్ తండా, 5న నీలికుర్తి, రేఖ్యా తండా, నేతావత్ తండా, బావోజిగూడెం, ఆనేపురం, వెంకట్యా, స్టేజీ తండా, 6న రాంపూర్, ఉల్లేపల్లి, భూక్యా, లూనవత్ తండా, 9న తాళ్లపూకల్, పాంబండ, చింతల గడ్డ, రూప్‌సింగ్ తండా, వెంకంపాడు, బీచ్‌రాజ్‌పల్లి, ఎల్లారిగూడెం, 10న తానంచర్ల, డీఎస్ఆర్ జెండాల, కోట్యా, వాల్యా తండా, మూలమర్రి తండా, అజ్మీరా తండా, బాల్నిదర్మారం, తండా ధర్మారం, లచ్యా తండా, 11న వీరారం, అజ్మీర, బాల్య, దంట్లకుంట తండా, ఎడ్జర్ల, గుర్రప్ప తండా, 12న ఎల్లంపేట, లక్మా, సోమ్లా, బొట్యా తండా, గిరిపురం, ఎలమం చిల తండా, 13న చిల్లంచర్ల, బుర్కి తండా, అబ్బాయిపాలెం, ధారావత్ తండా, 16న మరిపెడ మునిసిపాలిటి కార్యాలయంలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మరిపెడ, నర్సింహులపేట, చిన్నగూడూరు తహసీల్దార్లు కృష్ణవేణి, రమేష్‌బాబు, మహబూబ్ అలీ, యమ్మారై శరత్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీఈఆర్టీ జాతీయ సదస్సుకు గురునాథరావు



మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : న్యూఢిల్లీలో ఈ నెల 25, 26 తేదీల్లో జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్టీ) జాతీయ సదస్సుకు జిల్లాలోని కేసముద్రం మండలం పెనుగొండ జడ్పీఎస్ఎస్ సైన్స్ ఉపాధ్యాయుడు వి.గురునాథరావు తెలంగాణ రాష్ట్రం నుంచి మూడోసారి ఎంపికయ్యారు. విద్యాబోధన శాస్త్రంలో కొత్త ఆచరణలను ప్రోత్సాహించేందుకు ఈ వేదిక అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. గురునాథరావు తయారు చేసిన 'హ్యాండ్స్-ఆన్ ఫిజిక్స్' అనే ప్రాజెక్టు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం అనుభవాత్మక పఠనాన్ని అభివృద్ధి చేసేలా రూపొందించబడింది. గతంలో 2018, 2022 సంవత్సరాల్లో ఈ సదస్సులో పాల్గొని జాతీయస్థాయి అవార్డులు అందుకున్నారు. ఆయన ఇప్పటి వరకు సుమారు 100 పరిశోధన పత్రాలను వివిధ యూనివర్సిటీలు, ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు నిర్వహించిన సదస్సులు, సెమినార్లలో సమర్పించారు. ఎన్‌సీఈఆర్టీ సదస్సుకు ఎంపికైన గురునాథరావును జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్ రెడ్డి అభినందించారు.

సంపదను కార్పొరేట్‌లకు దోచిపెడుతున్న మోదీ

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి



సీపీఐ సమావేశంలో మాట్లాడుతున్న నల్లు సుధాకర్‌రెడ్డి

చిన్నగూడూరు (మహబూబాబాద్ జిల్లా), జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సంపదను ప్రధాని మోదీ కార్పొరేట్ శక్తు లకు దోచిపెడుతున్నారని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, మరిపెడ డివిజన్ ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి ఆరోపిం చారు. మండల కేంద్రంలో ఆదివారం సీపీఐ మండల మూడో మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మోదీ పాలనలో దేశంలో ఆర్థిక అసమానతలు మునుపెన్నడూ లేని విధంగా పెరిగిపోయాయని అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన పాలకులు వాటిని విస్మరించి, దేశ సంపదను లూటిచేసి కార్పొరేట్ శక్తులకు అప్పనంగా కట్టబెట్టే పనిలో పడ్డారని దుయ్యబట్టారు. 45శాతం సంపద ధనవంతుల చేతిలో కేంద్రీకృతమై ఆకలి, దారిద్రం, నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోయాయని గుర్తుచేశారు. అనంతరం సీపీఐ మండల కార్యదర్శిగా గంజి శేషాద్రి రెడ్డి, సహాయ కార్యదర్శిగా దొంతు స్టాలిన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు రామడుగు బ్రహ్మం, పోలేపాక వెంకన్న, ఒగ్గుల వెంకన్న, కందుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు

అమరుల స్థూపానికి రాజకీయ రంగు

బీఆర్ఎస్ గద్దెతో సహా స్థూపానికి తెలుపు రంగు వేసిన మునిసిపల్ సిబ్బంది

మాది స్థూపం అంటూ గులాబీ రంగు వేసిన బీఆర్ఎస్ శ్రేణులు

అధికారిక కార్యక్రమం వల్లే తెలుపు రంగు వేశాం : కమిషనర్

పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన గొడవ



బీఆర్ఎస్ గద్దెతో సహా స్థూపానికి తెలుపు రంగు వేసిన దృశ్యం



తెలుపు రంగును తొలగించి గులాబీ రంగు వేసిన బీఆర్ఎస్ శ్రేణులు



సీఐతో వాగ్వాదం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నర్సంపేట టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రమంతటా రాష్ట్ర అవతరణ దినోత్సవ కార్యక్రమాల పనుల్లో నిమగ్నం కాగా, నర్సంపేట పట్టణంలో ఇందుకు భిన్నంగా సరికొత్త గొడవకు తెరలేపారు అమరవీరుల స్థూపానికి గులాబీ రంగే ఉండాలని బీఆర్ఎస్ శ్రేణులు, లేదు అధికారిక కార్యక్రమం ఉన్నందునే తెలుపు రంగు వేశామంటూ మునిసిపల్ సిబ్బంది వాదన ఆదివారం రాత్రి నర్సంపేట పట్టణంలో కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. వివరాలిలా వున్నాయి. పట్టణంలోని వరంగల్ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న తెలంగాణ అమర వీరుల స్థూపం, స్థూపం ఎదురుగా గల బీఆర్ఎస్ జెండా గద్దెకు స్థానిక మునిసిపల్ సిబ్బంది తెలుపు రంగు వేశారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పట్టణ పార్టీ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు స్థూపం వద్దకు చేరుకొని కొంత మంది కాంగ్రెస్ నాయకుల ప్రోద్బలంతోనే తమ జెండా గద్దెను, స్థూపం కలర్ తెలుపు రంగులోకి మార్చారని నిరసన తెలుపుతూ వెంటనే గులాబీ రంగు వేయించారు. అధికారిక కార్యక్రమం దృష్ట్యా తెలుపు రంగు వేస్తే దాన్ని తొలగించారంటూ మునిసిపల్ కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో టౌన్ సీఐ రఘుపతిరెడ్డి, ఎస్సైలు రవికుమార్, అరుణ్‌లు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ నాయకులు కావాలని రంగు మారుస్తున్నారని, స్థూపం వద్దకు వచ్చారంటూ సీఐతో బీఆర్ఎస్ నాయకులు వాగ్వాదానికి దిగారు. కమిషనర్ భాస్కర్‌తో సీఐ బీఆర్ఎస్ నాయకులకు ఫోన్‌లో మాట్లాడించగా జెండా గద్దెకు గులాబీ రంగు ఉంటుందని, స్థూపానికి మాత్రం తెలుపు రంగు వేస్తామని, కార్యక్రమం అనంతరం రంగు మార్చుకోండని కమిషనర్ తెలిపాడు. దీంతో గొడవ సద్దుమనిగి బీఆర్ఎస్ శ్రేణులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

‘గిగ్’ వర్కర్లకూ ‘ఈ-శ్రమ్’



జనగామలో గిగ్ వర్కర్లకు అవగాహన కల్పిస్తున్న కార్మిక శాఖ అధికారి కుమారస్వామి

- దరఖాస్తుకు అవకాశం కల్పిస్తూ కేంద్రం నిర్ణయం
- కార్డుతో సామాజిక భద్రతా ప్రయోజనాలు
- అవగాహన కల్పిస్తున్న కార్మిక శాఖ అధికారులు

జనగామ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉన్న గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం కేంద్ర కార్మికశాఖ సంకల్పించింది. దేశంలో వివిధ సర్వీసుల కింద పనిచేస్తున్న గిగ్ వర్కర్లను కార్మికులుగా గుర్తిస్తూ నిర్ణయం తీసుకుంది. గతంలోనే గిగ్ వర్కర్ల చట్టాన్ని తీసుకురాగా తాజాగా వారిని కార్మికులుగా అధికారికంగా గుర్తించేందుకు ఈ-శ్రమ్ కార్డులను అందజేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఈ-శ్రమ్ పోర్టల్‌లో మార్పులు చేసింది. గత నెలలోనే గిగ్ వర్కర్లకు ఈ-శ్రమ్ కార్డులు అందించే ప్రక్రియ ప్రారంభం కాగా దీనిని మరింత వేగవంతం చేసేందుకు ప్రస్తుతం ఆయా జిల్లాల్లో కార్మిక శాఖ అధికారులు ప్రచారాన్ని వేగవంతం చేస్తున్నారు. తెలంగాణ కార్మిక శాఖ కమిషనర్ ఆదేశాలతో కార్మిక శాఖ అధికారులు ఈనెల 23 నుంచి 31 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కొరియర్, హోమ్ సర్వీస్ సంస్థల్లో పనిచేస్తున్న వారికి ఈ-శ్రమ్ దరఖాస్తుపై అవగాహన కల్పిస్తున్నారు.

సామాజిక భద్రత

గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత ఇవ్వాలన్న లక్ష్యంతో ఈ-శ్రమ్ కింద కార్డులు ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. ఈ-శ్రమ్ కార్డు అందించడంతో పాటు ఆయుష్మాన్ భారత్ పరిధిలోని ప్రధానమంత్రి జన్‌ఆరోగ్య యోజన కింద ఆరోగ్య ప్రయోజనాలు, ఇతరత్రా సామాజిక భద్రతా ప్రయోజనాలను అందించాలనదే కేంద్రం లక్ష్యం. ఈ-శ్రమ్ కార్డు పొందడం ద్వారా ఆరోగ్య బీమా కవరేజ్, ప్రమాద బీమా, పెన్షన్ వంటి ఆర్థిక భరోసా పథకాలు వర్తిస్తాయి. 18 నుంచి 59ఏళ్ల లోపు ఉండి ఏదైనా కంపెనీలో గిగ్ వర్కర్లుగా పనిచేస్తున్న వారు ఈ-శ్రమ్ కార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆధార్ కార్డు, పాన్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలతో మీసేవ, కామన్ సర్వీస్ సెంటర్లలో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

గిగ్ వర్కర్లకు చాలా ప్రయోజనం

ఆర్.కుమారస్వామి, సహాయ కార్మిక అధికారి, జనగామ



దేశవ్యాప్తంగా పనిచేస్తున్న గిగ్ వర్కర్లకు ఈ-శ్రమ్ కార్డు అందించి సామాజిక భద్రత కల్పించాలని కేంద్రం నిర్ణయించింది. దీని వల్ల కొరియర్, ఫుడ్ డెలివరీ, హోమ్ సర్వీసెస్‌లో పనిచేస్తున్న వారికి కేంద్రం నుంచి ఆర్థిక ప్రయోజనాలు అందుతాయి. అందువల్ల వివిధ సంస్థల్లో పనిచేస్తున్న గిగ్ వర్కర్లు ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. గిగ్ వర్కర్లందరూ దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నాం.

గిగ్ వర్కర్లంటే ఎవరు?

డెలివరీ, హోమ్ సర్వీసుల కింద పని చేసే వారిని గిగ్ వర్కర్లుగా వ్యవహరిస్తారు. జొమాటో, స్విగ్గీ వంటి ఫుడ్ డెలివరీ కంపెనీల కింద పనిచేసే వారితోపాటు కొరియర్, హోమ్ సర్వీస్, ఏసీ టెక్నీషియన్స్, గ్రాఫిక్స్ డిజైనర్స్ వీడియో ఎడిటర్స్ వంటి పనులు చేసే వారిని గిగ్ వర్కర్లుగా కేంద్రం గుర్తించింది. ప్రస్తుత సమాజంలో సాంకేతిక పెరగడం, గ్రామాలు సైతం పట్టణీకరణకు చేరువ కావడంతో ఆన్‌లైన్ వాడకం పెరిగిపోయింది. ఈ క్రమంలో ఇంట్లోనే ఉంటూ ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్లు పెట్టడం సాధారణమైంది. దీనికి తోడు గ్రామస్థాయిలోనూ ఏసీలు, వాటర్ ప్యూరిఫయర్లు, ఫ్రిడ్జ్‌లు, స్మార్ట్ టీవీలు, వాషింగ్ మిషన్లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువుల వాడకం పెరిగింది. దీంతో డెలివరీ బాయ్స్, సర్వీసింగ్ బాయ్స్ ఉద్యోగాలు పుట్టుకొచ్చాయి.

రూ.20కే టిఫిన్.. ఆహా ఏమిరుచి

- పేదల కడుపు నింపేందుకే అంటున్న హోటల్ నిర్వాహకులు
- ఆదర్శంగా నిలుస్తున్న దంపతులు


మహబూబాబాద్‌లో నర్సంపేట బైపాస్‌రోడ్ వద్ద టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్న సంపత్, అరుణ దంపతులు

మహబూబాబాద్ టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : రోజుకు రోజుకూ నిత్యావసరసరుకుల ధరలు ఆకాశన్నంటడంతో ఏమి తినాలన్న.. ఏమి కొనాలన్న ధరలు మండిపోతున్న తరుణంలో మానుకోటలో హోటల్ నిర్వాహకులు రొయ్యల సంపత్-అరుణ దంపతులు రూ. 20కే టిఫిన్ అందిస్తూ మానవతను చాటుకుంటున్నారు. వంట గ్యాస్, నిత్యావసర సరుకులు ఇలా అన్నింటి ధరలు పెరిగాయని ఇటీవల కాలంలో హోటల్ నిర్వాహకులు ప్లేట్ టిఫిన్ రేట్లు రూ.40కి పెంచినా వారు మాత్రం పాత ధర కంటే తక్కువగానే విక్రయిస్తున్నారు. పేదల కడుపు నింపేందుకు తాము రూ.20కి టిఫిన్ పెడుతున్నామని చెబుతున్నారు. మహబూబాబాద్ శివారు గుమ్మునూరుకు చెందిన రొయ్యల సంపత్-అరుణ దంపతులు జీవనోపాధి కోసం నర్సంపేట బైపాస్ వద్ద మూడు సంవత్సరాలుగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనంపై అరుణ హోటల్ పేరుతో టిఫిన్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. రూ.20కి రుచికరమైన టిఫిన్‌ను అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ఈ హోటల్‌లో సంపత్, అరుణ దంపతులతో పాటు సంపత్ తల్లి స్వరూప, అత్తమ్మ మల్లమ్మ నలుగురు పని చేస్తున్నారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు టిఫిన్ తయారు చేసి విక్రయిస్తున్నారు. పెద్ద హోటల్లోనైతే రూ.20 పెడితే టీ కూడా రాని పరిస్థితుల్లో ఆ ధరకు ప్లేట్ టిఫిన్ అందించడం విశేషం. ఇడ్లీ, వడ, బోండ, దోశ ఇలా ఏ టిఫిన్ అయినా రూ.20కే దొరుకుతుంది. అక్కడ ఎక్కువగా ఆటో డ్రైవర్లు, కూలీలు టిఫిన్ తింటారు. ఇటీవల మానుకోటలో ప్లేట్ టిఫిన్ రూ.30 నుంచి రూ.40కి ధర పెంచినా వారు మాత్రం ఎప్పటిలాగే రూ.20కే విక్రయిస్తూ పేదల కడుపు నింపుతూ మానవతను చాటుకుంటున్నారు. లాభాపేక్ష లేకుండా నిరుపేదలంతా టిఫిన్ చేయాలనే తమ కుటుంబమంతా కష్టపడుతూ రూ.20కే టిఫిన్ అందిస్తున్న ఆ దంపతులు నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎక్కువ డబ్బులు సంపాదించాలనే యావ ఉన్న సమాజంలో పేదల కడుపు నింపాలని సేవాభావంతో హోటల్ నడిపిస్తూ తక్కువ ధరకు టిఫిన్ అందిస్తున్న సంపత్, అరుణ దంపతులను మానుకోట వాసులు అభినందిస్తున్నారు.

దుక్కులకు వేళాయె

- ఉత్సాహంతో అరకలు కట్టిన రైతన్నలు
- ఇప్పుడే విత్తరాదంటున్న వ్యవసాయాధికారులు



పర్వతగిరి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : రుతుపవనాలు ముందే వచ్చి వర్షాలు పడుతుండడంతో రైతులు ఉత్సాహంగా దుక్కులు దున్ని భూ ములను చదును చేసుకుంటున్నారు. సాలు, ఇరువాలు దున్ని విత్తనా లు పెట్టేందుకు సిద్ధమయ్యారు. ముందస్తు వానలతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. ఇప్పుడు వర్షాలు కురిసి అనంతరం వర్షాలు వస్తాయా ? లేదా ? అన్న సందిగ్ధంలో రైతన్న కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ నెల మొదటి వారంలోనే విత్తనాలు నాటేందుకు రైతులు పత్తి విత్తనాలు, ఎరువుల కోసం పట్టణాలకు వెళ్లి కొనుగోలు చేసి ఇళ్లలో నిల్వ చేసుకుంటున్నా రు. వ్యవసాయ అధికారులు మాత్రం తొంద రపడి ఎలాంటి విత్తనాలు విత్తరాదని సూచిస్తున్నారు. తొందరపడి విత్తనాలు వేస్తే తెగు ళ్లు, చీడపీడల ఉధృతి ఎక్కువగా ఉండే ఆస్కారం ఉందని హెచ్చరిస్తున్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

ప్రశాంత్, మండల వ్యవసాయాధికారి



రైతులు ముందుగా భూసారాన్ని పెంచేందుకు దుక్కులు దున్నే సమయంలో భాస్వరాన్ని చల్లాలి. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించే కంపెనీల విత్తనాలను కొనాలి. విత్తనాలు తీసుకున్నాక తప్పకుండా బిల్లు తీసుకొని భద్రపర్చుకోవాలి. తద్వారా వారు ఇచ్చిన విత్తనాలు మొలకెత్తకుంటే ఆ కంపెనీ, షాపు యజమాని ద్వారా పంట నష్ట పరిహారం పొందవచ్చు. విత్తనాలను శుద్ధి చేసిన ప్యాకెట్లు మాత్రమే కొనుగోలు చేయాలి. దళారుల వద్ద దొరికే నాణ్యతలేని విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి

ఓరుగంటి కుమారస్వామి, రైతు, చింతనెక్కొండ



వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దుక్కులను దున్ని విత్తనాలు వేసేందుకు సిద్ధం చేసుకున్నా. నకిలీ విత్తనాలు, పురుగుల మందులు అమ్మకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. నకిలీ విత్తనాల వల్ల నష్టపోవాల్సి వస్తుంది. ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూడాలి.

పంట మార్పిడితో అధిక దిగుబడి

వరంగల్ సహ పరిశోధన సంచాలకుడు ఆర్ ఉమారెడ్డి


ఏడీఆర్ ఉమారెడ్డి

వరంగల్ వ్యవసాయం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం దగ్గర పడుతున్నందున రైతులు సాగుకు సమాయత్తం కావాలని, ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ప్రాంతీయ పరిశోధన స్థానం వరంగల్ సహ పరిశోధన సంచాలకుడు ఆర్.ఉమారెడ్డి తెలిపారు. ఈ విషయంలో ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు అధిక దిగుబడి పొందాలంటే వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలను పాటించాలన్నారు. తొలుత భూమిని లోతుగా దున్నుకోవాలన్నారు. వేసిన పంటలనే మళ్లీ వేయకుండా తప్పనిసరిగా పంట మార్పిడి చేయాలని, అప్పుడే అధిక దిగుబడి వచ్చే అవకావం ఉంటుందని తెలిపారు. పత్తి, మొక్కజొన్న, వరి కొయ్యలను ఎట్టిపరిస్థితిలో సాగుభూమిలో కాల్చవద్దన్నారు. అవసరం ఉన్న చోట మృత్తిక (భూసార)పరీక్షలు చేయించుకోవాలని, తద్వారా ఎరువులను ఒక క్రమపద్ధతిలో వేసుకోవడానికి వీలవుతుందని చెప్పారు. సాగు చేయాలనుకున్న భూమిలో తొలుత పచ్చిరొట్ట (జనుము, జీలుగ, పిల్లి పిసర, పెసర) పంటలను వేసుకోవాలని, సాగు సమయం వచ్చే సరికి ఆ పంటలను అందులోనే కలియదున్నాలని, తద్వారా మంచి దిగుబడి వస్తుందని అన్నారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, ఆదర్శ రైతుల సలహాలు సూచనలతో మేలైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలన్నారు. తొలకరి జల్లులు పడగానే తొందరపడి విత్తనాలు వేయొద్దని, భూమిలో ఉండే అధిక వేడి వల్ల అవి మొలకెత్తవని అన్నారు. ఎర్ర చెలుక నేలలైతే 70 మీమీ. వర్షపాతం, నల్ల రేగడి నేలలైతే 60 మీమీ వర్షపాతం నమోదైతేనే విత్తుకోవాలని సూచించారు. రైతులందరూ ఒకే రకం హైబ్రిడ్ విత్తనాలను వేస్తున్నారని, అలా కాకుండా ఏరకం పలు రకాల విత్తనాలను ఎంచుకొని మంచి యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు వస్తాయని రైతులకు సూచించారు.


వన దేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారంలో భక్తుల సందడి

తాడ్వాయి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడారంలో వనదేవతలు సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులను దర్శించుకోవడానికి సుదూర ప్రాంతాల నుంచి తల్లుల భక్తులు ఆదివారం తరలి వచ్చారు. ఈ క్రమంలో భక్తులు ముందుగా జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించి తల్లులకు తలనీలాలు సమర్పించుకున్నారు. అనంతరం ఎత్తు బంగారం(బెల్లం) మోసుకుంటూ అమ్మవార్ల గద్దెలకు చేరుకున్నారు. దేవతలకు పూజలు చేశారు. కుంకుమ, పసుపు, పూలు, పండ్లు చీర, సారె, కొబ్బరి కాయలు గద్దెలకు సమర్పించుకొని కోరికలు తీరాలని మొక్కులు చెల్లించుకున్నారు. వారంతపు సెలవు కావడంతో వేరు వేరు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 10వేల మందికి పైగా భక్తులు తల్లులకు మొక్కులు చెల్లించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

ఘనంగా ఉట్లపల్లి పోచమ్మ జాతర


మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

కాటారం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గోదావరి నది ఒడ్డున అటవీప్రాంతంలో కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విలసిల్లుతున్న ఉట్లపల్లి పోచమ్మ జాతర జోరుగా సాగుతున్నది. ఏడాదిలో కేవలం వేసవి కాలంలో ప్రతి గురువారం, ఆదివారం సాగే జాతరకు భక్తులు హాజరై తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. మండలంలోని గుండ్రాత్‌పల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంత సమీపంలో వెలసిన ఉట్లపల్లి పోచమ్మ జాతర ఆదివారం వైభవంగా జరిగింది. మండలంతో పాటు మంథని, చెన్నూరు, గోదావరిఖని, భూపాలపల్లి తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఉట్లపల్లికి వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. జంతుబలులిచ్చారు. కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి వాహనాల్లో వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్న అనంతరం చెట్ల కింద సేదతీరుతూ విందు, వినోదాలతో గడిపారు.

చిన్న కాళేశ్వరం ఇన్‌చార్జి ఈఈగా తిరుపతిరావు నియామకం

కాటారం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం డివిజన్-2 ఇన్‌చార్జి ఈఈగా తిరుపతిరావును నియమించారు. మహదేవపూర్ డివిజన్-2 ఈఈగా పనిచేస్తున్న ఎలకొండ యాదగిరి శనివారం ఉద్యోగ విరమణ చేయగా ఇరిగేషన్‌శాఖ ఆధ్వర్యంలో హన్మకొండలో ఆత్మీయ అభినందన సన్మానం వేడుకలు నిర్వహించారు. దీంతో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు డివిజన్-1 ఈఈగా పనిచేస్తున్న తిరుప తిరావుకు డివిజన్-2 ఈఈ గా అదనపు బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో డీఈఈలు ఉపేందర్, సతీష్, రవిచంద్ర, ఏఈఈలు వెంకన్న, శ్రావణ్, యాకయ్య తదితరులు ఉన్నారు.

అవినీతి ఆగేనా..?!

(3వ పేజీ తరువాయి)

ఆఫీసు బాయ్‌గా, స్వీపర్‌గా కార్యాలయాల్లో పెట్టుకుని కొందరు ఎస్ఆర్‌వోలు వసూళ్లకు దిగుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ముగ్గురు సబ్‌రిజిస్ట్రార్‌లు ఏసీబీ అధికారులకు పట్టుబడటం రిజిస్ట్రేషన్ శాఖలో అవినీతికి నిదర్శనంగా చెప్పుకుంటున్నారు. గత ఏడాది మార్చి 22వ తేదీన మహబూబాబాద్ సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా, జూలై 26వ తేదీన పరకాల సబ్‌రిజిస్ట్రార్ సునిత, ఈ యేడాది మార్చి 20వ తేదీన స్టేషన్ ఘన్‌పూర్ సబ్‌రిజిస్ట్రార్ రామకృష్ణలు వరుసగా అవినీతి నిరోధకశాఖ అధికారులకు పట్టుబడ్డారు. అయితే పొరుగు జిల్లా నుంచి వచ్చిన కొందరు అధికారులు పెట్టిన ఖర్చులను రాబట్టుకునే పనిలో భారీగా వసూళ్లకు దిగుతున్నారనే ప్రచారం జరుగుతోంది. అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నప్పటికీ ప్రతి డాక్యుమెంట్‌కు రూ.2వేల నుంచి రూ.20వేల వరకు ఇచ్చుకోవాల్సిందేనని బాధితులు వాపోతున్నారు. చెయ్యి తడపకుంటే రిజిస్ట్రేషన్ కాగితాల్లో ఏదో ఒక తప్పును గుర్తించి రోజులు, నెలల తరబడి తిప్పుతున్న సందర్భాలు ఉన్నాయి.

కృతిమ మేధ సాయం.. వాక్ ఇన్ రిజిస్ట్రేషన్లు

ప్రభుత్వం ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ విధానాన్ని జూన్ 2వ తేదీ నుంచి అమలు చేయడంతో పాటు రిజిస్ట్రేషన్లలో అనేక మార్పులు తీసుకవస్తుంది. ప్రధానంగా కృతిమ మేధ (ఏఐ)తో రిజిస్ట్రేషన్లకు సహకారం అందించేలా ఏర్పాట్లు చేశారు. ఏఐ అనుసంధానంతో కూడిన చాట్‌బాట్ మేధ 82476 23578 వాట్సాప్ నెం బర్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ వాట్సాప్ నెంబరులో రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ కార్యాలయం లోకేషన్, స్లాట్ బుకింగ్‌లో ఖాళీల వివరాలు, సమయంతో పాటు గిఫ్ట్ డీడ్, సెల్ డీడ్ తదితర చార్జీల వివరాలు ఈ ఏఐ చాట్‌బాట్ మేధ ద్వారా తెలుసుకునేలా అందుబాటులోకి తెచ్చారు. అలాగే రిజిస్ట్రేషన్ల కోసం స్లాట్ బుకింగ్ చేసుకోనివారి కోసం ప్రభుత్వం వాక్ ఇన్ రిజిస్ట్రేషన్ల విధానాన్ని ప్రవేశ పెట్టింది. స్లాట్ బుకింగ్ చేసుకోని వ్యక్తులు ప్రతి రోజు సాయంత్రం 5గంటల నుంచి 6గంటల మధ్య కార్యాలయానికి వెళితే వాక్ ఇన్ విధానంలో రిజిస్ట్రేషన్ చేసే అవకాశాన్ని కల్పించారు. ఈ వాక్ ఇన్ విధానంలో రోజుకు ఐదు రిజిస్ట్రేషన్లే చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం అమలవుతున్న సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఈ వాక్ ఇన్ విధానంలో ఎక్కువగా బ్యాంకు లోన్లకు సబంధించిన మార్టిగేజ్ డాక్యుమెంట్లు, రిలీజ్ డీడ్‌లు రిజిస్ట్రేషన్ అవుతున్నట్లుగా ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ స్పాట్ రిజిస్ట్రేషన్లతో అత్యవసరం ఉన్నవారికి ఉపయోగ పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వీటితో పాటు త్వరలోనే డెవలపర్ రిజిస్ట్రేషన్ మాడ్యుల్(డీఆర్‌ఎం)ను త్వరలో అందుబాటులోకి తేనున్నారు.

దీంతో లే అవుట్‌లో డబుల్ రిజిస్ట్రేషన్లు జరుగకుండా, రిజిస్ట్రేషన్ పూర్తయిన వాటి వివరాలను ఇటు రిజిస్ట్రేషన్ కార్యాలయాలతో పాటు అటు బిల్డర్ లేదా డెవలపర్ వద్ద ఉండేలా డీఆర్‌ఎంను అందుబాటులోకి తీసుకరానున్నారు. అలాగే రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగం చేసేందుకు ఆధార్ ఈ సంతకంను ప్రవేశ పెడుతున్నట్లుగా ప్రభుత్వం ప్రకటించింది. రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న ఈ విధానాన్ని త్వరలోనే ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అమలు చేయనున్నారు.

స్లాట్ బుకింగ్‌తో అక్రమాలకు చెక్ పడేనా ?

ప్రభుత్వం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరుగుతున్న అక్రమాలపై నజర్ పెట్టింది. ఏసీబీకి చిక్కుతున్నవారిలో రాష్ట్రంలో అత్యధికంగా స్టాంపులు, రిజిస్ట్రేసన్ శాఖ ఉద్యోగులు కూడా ఉండటంతో ఈ శాఖపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. కొత్తగా స్లాట్ బుకింగ్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఏప్రిల్ 10 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 22సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశ పెట్టింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తొలివిడతలో వరంగల్ రూరల్, ఖిలా వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రయోగత్మకంగా ఎంపిక చేశారు. ఆశించిన స్థాయిలో స్లాట్ బుకింగ్ విధానం సక్సెస్ కావటంతో మే 12వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మరో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేయగా, అందులో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, నర్సంపేట, జనగామ, స్టేషన్‌ఘనపూర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఏప్రిల్, మే నెలల్లో రెండు విడతల్లో ఆరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో చేపట్టిన స్లాట్ బుకింగ్ విధానం విజయవంత అయినట్లుగా అధికారులు భావిస్తున్నారు. దీంతో మిగతా ఆరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కూడా ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ విధానాన్ని సోమవారం నుంచి అమలు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేశారు. స్లాట్ బుకింగ్ విధానంతో రిజిస్ట్రేషన్‌ల కోసం పడిగాపుల కాయాల్సిన అవసరం లేదని పేర్కొంటున్నారు. ఏదైనా డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ చేయించకోవాలంటే సబంధిత వ్యక్తులు ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆ స్లాట్‌లో కేటాయించిన సమయానికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. దీంతో రిజిస్ట్రేషన్ల కోసం కార్యాలయాల చుట్టు తిరగాల్సిన అవసరం ఉండదని, బ్రోకర్ల అవసరం ఉండదని పేర్కొంటున్నారు. ఈ విధానంలో ప్రతి రోజు ఒక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 48 రిజిస్ట్రేషన్లు మాత్రమే చేసే అవకాశం ఉంది. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు స్లాట్ బుక్ చేసుకోని, రిజిస్ట్రేషన్‌లు చేయించుకోవచ్చునని ప్రభుత్వం చెపుతుంది. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారం అంతగా లేకపోవడంతో ఎక్కువ రిజిస్ట్రేషన్లు కావటం లేదని అధికారులు పేర్కొంటున్నారు. అయితే వాస్తవ పరిస్థితుల్లోకి వచ్చే వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ అంతా సాఫీగా సాగుతుందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రిజిస్ట్రేషన్ కోసం డాక్యుమెంట్ తయారీ కోసం డాక్యుమెంట్ రైటర్లను ఆశ్రయించాల్సి ఉంటుంది. అందరికి ఆన్‌లైన్‌పై అవగాహన లేకపోవడం, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత రైతులు స్లాట్ బుకింగ్ కోసం డాక్యుమెంట్ రైటర్లనే ఆశ్రయించాల్సి ఉంటుంది. ఇక రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినప్పటికి సబ్ రిజిస్ట్రార్‌లను కాదని పని అయ్యే పరిస్థితి లేదని అంటున్నారు.

సైక్లింగ్‌తో సంపూర్ణ ఆరోగ్యం

సైకిల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజయ్య

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ రోజు సైక్లింగ్ చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉండవచ్చని సైకిల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజయ్య అన్నారు. ఆదివారం అంతర్జాతీయ సైక్లింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని డీఎస్ఏ ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్ఎస్‌లో ఏర్పాటు చేసిన సైక్లింగ్ వేడుకల్లో భాగంగా ఇంచార్జీ డీవైఎస్‌వో దేవికతో కలిసి రాజయ్య జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ... నేడు ప్రతీ ఒక్కరు శరీర వ్యాయామం లేక పోవడంతో వివిధ రకాల వ్యాధుల బారిన పడుతున్నారని అన్నారు. ప్రతీ రోజు సైకిల్ తొక్కడం వల్ల వ్యాయామంతో పాటు ఎలాంటి వ్యాధులు దరిచేరకుండా నివారించవచ్చని రాజయ్య తెలిపారు. ఈ సందర్భంగా వివిధ క్రీడల్లో శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులకు సైక్లింగ్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్, ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి శ్యాంప్రసాద్, డీఎస్ఏ కోచ్‌లు నరేందర్, రమేష్, ఎండీ. అఫ్జల్, శంకర్, వెంకట్, ప్రభుదాస్, సైకిల్ అసోసియేషన్ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.


జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న రాజయ్య


ప్రభుత్వం స్పందించకుంటే సమ్మెకు సిద్ధం

327 యూనియన్ సెక్రటరీ జనరల్ శ్రీధర్

రాంనగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఆర్టిజన్ సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రంలోని నాలుగు డిస్కంల ఆర్టిజన్ కార్మికులతో కలిసి సమ్మె చేయడానికైన వెనుకాడమని ప్రభుత్వ అనుబంధ సంఘం 327 యూనియన్ సెక్రటరీ జనరల్ ఇనగాల శ్రీధర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వం వచ్చి యేడాది దాటిన ఆర్టిజన్‌ల సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయని వాటిని పరిష్కరించే దిశగా కృషిచేయాలని వివిధ డిస్కంలలోని ఆర్టిజన్ కార్మికులు ఆదివారం పల్లా రవిందర్‌రెడ్డి భవన్‌లో ఇనుగాల శ్రీధర్ ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఇనుగాల శ్రీధర్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి కార్మికుల సమస్య తెలియజేస్తామని, పరిష్కరించని పక్షంలో దశల వారిగా అందోళనలకు దిగి అవసరమైతే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టిజన్ నాయకులు ధరావత్ సికిందర్, వల్లాల యుగేందర్, పప్పు వెంకటేశ్వర్లు, చింతల పూడి సతీష్, గన్ను నరేందర్‌రెడ్డి, చెన్నవేని బాబన్న, సతీష్‌రెడ్డి, సలీం పాషా, శ్రీనువాస్‌రెడ్డి, అటికేటి రవీందర్, 327 యూనియన్ ఎస్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నాయకులు తులసి, బుచ్చయ్యగౌడ్, ఆర్‌సి రెడ్డి పాల్గొన్నారు.



శ్రీధర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆర్టిజన్లు



రామ్‌కిషన్‌ను సన్మానించిన ఎంపీ కావ్య

జూలైవాడ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య సంస్థ జెనీవా నిపుణులు, సలహా ప్యానెల్ సభ్యులుగా నియమితులైన వరంగల్‌కు చెందిన డాక్టర్ అజ్మీరా రామ్‌కిషన్ ఆదివారం హనుమకొండ కనకదుర్గా కాలనీలోని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యను కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ శాలువాతో సన్మానించి రామ్‌కిషన్‌ను అభినందించారు. పరకాల నియోజకవర్గంలోని బావ్‌సింగ్‌పల్లికి చెందిన రామ్‌కిషన్ ప్రస్తుతం ఢిల్లీలో జాయింట్ డ్రగ్ కంట్రోలర్‌గా పని చేస్తున్నారు.



ప్రపంచ ఆరోగ్య సంస్థ సలహాదారుడు రామ్‌కిషన్‌ను సన్మానిస్తున్న ఎంపీ కడియం కావ్య

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

- ఏఐసీసీ ఓబీసీ కోఆర్డినేటర్ కత్తి వెంకటస్వామి గౌడ్
- ప్రతిభా పురస్కారాలు అందజేత

న్యూశాయంపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలని ఏఐసీసీ ఓబీసీ కోఆర్డినేటర్ కత్తి వెంకటస్వామి గౌడ్ సూచించారు. హనుమకొండ హంటర్ రోడ్‌లోని గౌడ హాస్టల్ భవన్‌లో ఆదివారం 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గోపా హనుమకొండ, వరంగల్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కార అవార్డులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కత్తి వెంకటస్వామి మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో గౌడ విద్యార్థులు ఎంతో మంది కష్టపడి చదువుల్లో రాణిస్తున్నారన్నారు. వారిని మరింత ఉత్తేజపరుస్తూ ప్రయోజకులుగా, సమాజ సేవకులుగా తీర్చిదిద్దాలనే గొప్ప సంకల్పంతో గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్(గోపా) ఆధ్వర్యంలో ఇలాంటి మహోన్నత కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం 10వ తరగతి, ఇంటర్‌లో రాణించిన 90 మంది గౌడ విద్యార్థులకు నగదు పారితోషికం, షీల్డ్‌తో పాటు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో గోపా హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు చిర్ర రాజుగౌడ్, డాక్టర్ లక్ష్మీనారాయణగౌడ్, గోపా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ బి.విజయ్ భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.శ్రీనివాస్‌గౌడ్, గౌడ ప్రతిభా పురస్కార కార్యక్రమ కన్వీనర్ వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్, గోపా వరంగల్ జిల్లా సీనియర్ నాయకులు పెద్ది వెంకట్‌నారాయణ, బూర విద్యాసాగర్‌గౌడ్, తాళ్లపెల్లి జనార్దన్‌గౌడ్, మార్క విజయ్ గౌడ్, పొగాకుల అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పురస్కారాలు అందుకున్న గౌడ విద్యార్థులతో గోపా నాయకులు



ఎస్‌ఈ నాగేందర్‌రావును సన్మానిస్తున్న ఉద్యోగులు, తదితరులు

నాగేందర్‌రావు సేవలు మరువలేనివి

రిటైర్డు సీఈ జనార్దన్‌రెడ్డి, ఎస్‌ఈ రాఘవరెడ్డి

హనుమకొండ టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఆర్‌అండ్‌బీ శాఖలో ఎస్‌ఈగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన నాగేందర్‌రావు సేవలు మరువలేనివని ఆర్‌అండ్‌బీ రిటైర్డు సీఈ జనార్దన్‌రెడ్డి, హనుమకొండ ఎస్‌ఈ టి. రాఘవరెడ్డి కొనియాడారు. ఆదివారం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో హనుమకొండ ఎస్‌ఈగా ఉద్యోగ విరమణ పొందిన నాగేందర్‌రావుకు ఆల్ ఇండియా బిల్డర్స్ అసోసియేషన్, ఇంజనీర్ల సంఘం అసోసియేషన్ ఆధ్వర్యంలో వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డు సీఈ జనార్దన్‌రెడ్డి, నూతన ఎస్‌ఈ టి. రాఘవరెడ్డి హాజరై నాగేందర్‌రావు సేవలను కొనియాడారు. నాగేందర్‌రావు ఏఈఈగా ఉద్యోగంలో చేరి డిప్యూటీ ఈఈ, ఈఈ, ఎస్‌ఈగా ఉమ్మడి ఖమ్మం జిల్లా, కరీంనగర్, వరంగల్ జిల్లాలో పనిచేసినట్లు తెలిపారు. నాగేందర్‌రావు తోటి ఉద్యోగులతో ఎంతో ఆప్యాయంగా ఉండేవారని అన్నారు. ఆర్‌అండ్‌బీ శాఖలో ఉత్తమ అధికారిగా పేరుతెచ్చుకున్నారని పలువురు అధికారులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆల్‌ఇండియా బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రవీందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఇంజనీర్ల సంఘం అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

నాయిని ట్రస్ట్ టోర్నమెంట్ విజేత కాజీపేట



కాజీపేట జట్టుకు రూ.లక్ష చెక్కు, షీల్డ్ ఇస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

న్యూశాయంపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో నాయిని విశాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గత 14 రోజులుగా జరిగిన టీ-10 టోర్నమెంట్ ఆదివారం ముగిశాయి. 178 జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్స్‌లో విజేతగా కాజీపేట జట్టు, రన్నరప్‌గా అలంకార్ జట్టు నిలిచాయి. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై విజేత జట్టుకు రూ.లక్ష, రన్నరప్ జట్టుకు రూ.50వేల చెక్కులతో పాటు షీల్డులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విశాల్‌రెడ్డి పేరు మీద నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో 178 జట్లు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. యువకులు గెలుపోటములను పాజిటివ్‌గా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయిని కుటుంబ సభ్యులు, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జంక్షన్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

న్యూశాయంపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్‌లోని న్యూశాయంపేట జంక్షన్‌లో ఎట్టకేలకు ట్రాఫిక్ పోలీసు అధికారులు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేశారు. గత మార్చి 27న 'ఆంధ్రజ్యోతి'లో 'న్యూశాయంపేట జంక్షన్ అస్తవ్యస్తం, ట్రాఫిక్ సిగ్నల్స్ లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో ట్రాఫిక్ పోలీసులు స్పందించి జంక్షన్‌లో సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయడంతో స్థానిక ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



న్యూశాయంపేట జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్

అర్చకులంటే చాలా గౌరవం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

హనుమకొండ కల్చరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : తనకు మాదిగ సమాజంపై ఎంత ప్రేమ ఉందో అంతే అభిమానం బ్రాహ్మణులపై అదే భావం ఉందని అర్చకులంటే ఎంతో గౌరవమని పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నారు. శనివారం రాత్రి కొత్త ఢిల్లీ నుంచి అవార్డు అందుకున్న ఆయన ర్యాలీగా వస్తూ వేయిస్తంభాల ఆలయం వద్ద తనకోసం వేచి ఉన్న అర్చక నేతలను వాహనం దిగివచ్చి ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ అర్చక సమాఖ్య అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తనుగుల రత్నాకర్ తదితరులు మంద కృష్ణ మాదిగను దుస్సాలువాలతో సత్కరించారు.



మందకృష్ణను సన్మానిస్తున్న గంగు ఉపేంద్రశర్మ, అర్చకులు

సిందూర్ జవాన్‌కు ఘన స్వాగతం



జవాన్ రంజిత్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

మడికొండ/కాజీపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మడికొండకు చెందిన గుగులోత్ నాగేశ్వర్‌రావు కుమారుడు గుగులోత్ రంజిత్‌కుమార్ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. రాజస్థాన్ జోధ్‌పూర్ ఎయిర్‌బేస్ నుంచి ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని ఆదివారం స్వగ్రామానికి చేరుకున్న సందర్భంగా ఆయనకు స్థానిక కాంగ్రెస్ నేతలు ఘన స్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించి స్వాగతించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, మాజీ సర్పంచ్ వస్కుల వెంకటస్వామి, మెట్టుగుట్ట రామాలయం చైర్మన్ పల్లపు అర్జున్, కాంగ్రెస్ నాయకులు బైరి లింగమూర్తి, వస్కుల శంకర్, సాంబయ్య, బాలాజీ, జిట్ట చంటి, విజయ్, కిషన్, శ్రీను, మహేందర్, కుమార్, చట్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు. కాజీపేటలో స్వాగతం పలికిన వారిలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, మాజీ సర్పంచ్ వస్కుల వెంకటస్వామి, స్థానికులు పల్లపు అర్జున్, బైరి లింగమూర్తి, వస్కుల శంకర్, విజయ్, బాలాజీ, శంకర్ తదితరులు ఉన్నారు.

ఇంజనీరింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

- పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్‌రెడ్డి
- రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌కు ఫిర్యాదు

కేయూ క్యాంపస్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : నిబంధనల విరుద్ధంగా లక్షల్లో అక్రమంగా విద్యార్థుల నుంచి డొనేషన్లు వసూళ్లకు పాల్పడుతున్న సుమతిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలపై తక్షణమే చర్యలు చేపట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం కేయూలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఈటుకాల పురుషోత్తంను కలిసి సుమతిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అక్రమ వసూళ్లపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. హనుమకొండ సుమతిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ముందస్తు అడ్మిషన్లకు పాల్పడుతూ రూ. లక్షల్లో డొనేషన్లు వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ వసూళ్లకు పాల్పడిన డబ్బులకు రశీదులు ఇవ్వడం లేదన్నారు. రశీదుల లేకుండా వసూల్ చేస్తున్న ఘటనల నేపథ్యంలో దందా ఏ మేరకు నడుస్తోందో గమనించవచ్చని ఆందోళన వెలిబుచ్చారు. ఎస్ఆర్ వర్సిటీ ఐకార్ ఇండియన కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రిసెర్చ్ అనుమతులు లేకుండా అగ్రికల్చర్ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పిస్తూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆరోపించారు. తక్షణమే సుమతిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలతో పాటు ఎస్ఆర్ యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున దశలవారిగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్, నాయకులు శంకర్ పాల్గొన్నారు.

గురుకులాల్లో ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులు

- నేడు తుది గడువు
- రేపు డెమో తరగతులు

హసన్‌పర్తి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలోని తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యా సంస్థల్లో ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర బాలికల గురుకుల పాఠశాల, కళాశాల హసన్‌పర్తి ప్రిన్సిపాల్స్ అశోక్‌రెడ్డి, ఇందుమతి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బండారుపల్లి, వేలేరు బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలతో పాటు హసన్‌పర్తి, నెక్కొండ, కొడకండ్ల బాలికల గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఖాళీగా ఉన్న సబ్జెక్టులు బోధించుటకు అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీష్, సంస్కృతం, గణితం, ఫిజికల్ సైన్స్, బయోసైన్స్, సోషల్ బోధించేందుకు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న గణితం, బోటని, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ బోధించడం కోసం అభ్యర్థులు జూన్ 2వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. జూన్ 3వ తేదీన హసన్‌పర్తి బాలికల గురుకుల పాఠశాల, కళాశాలల్లో జరిగే డెమో, ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాల కోసం 9866559707, 9866559727 నెంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఆఫీసర్ క్లబ్‌లో అక్రమాలకు పాల్పడిన ముగ్గురి అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ సత్యనారాయణరెడ్డి

హనుమకొండ టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆఫీసర్ క్లబ్‌లో మెంబర్‌షిప్, ఎంట్రీ ఫీజుల్లో అక్రమాలకు పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఆదివారం సుబేదారి సీఐ పి. సత్యనారాయణరెడ్డి తెలిపారు. హనుమకొండ సుబేదారిలోని ఆఫీసర్ క్లబ్‌లో మేనేజర్‌గా పని చేసే వ్యక్తితో పాటు మరో ఇద్దరు అక్రమంగా డబ్బులు వసూలు చేసి వ్యక్తిగతానికి వాడుకున్నట్లు సీఐ తెలిపారు. ఆఫీసర్ క్లబ్ బారులో పని చేసే శ్రీనివాస్ అనే వ్యక్తి వద్ద రూ. 10 లక్షలు తీసుకుని ఇవ్వకపోవడంతో ఏప్రిల్ 18న ఉరివేసుకుని తన చావుకు క్లబ్ సభ్యులైన గోలి గోపాల్‌రెడ్డి, రాజిరెడ్డి, రవీందర్‌లే కారణమని చెప్పడంతో క్లబ్ కమిటీ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ పి. సత్యనారాయణరెడ్డి తెలిపారు. కమిటీలో 145 మంది ఉండగా సుమారుగా రూ. 2 కోట్ల వరకు అక్రమాలు జరిగినట్లు సీఐ తెలిపారు.

వివేక్‌నగర్ అభివృద్ధి కమిటీ ఎన్నిక

వడ్డెపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్‌లోని వివేక్‌నగర్ కాలనీ అభివృద్ధి కమిటీ సర్వసభ్య సమావేశం ఆదివారం పోచమ్మ దేవాలయ ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా కాలనీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మర్రి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా మీసాల రమేశ్, కోశాధికారిగా సురభి వినోదరరావులను ఎన్నుకున్నారు.



ప్రభాకర్ రమేశ్

చికిత్స పొందుతూ ట్రాక్టర్ డ్రైవర్ మృతి

మడికొండ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కడుపు నొప్పి భరించలేక గడ్డిమందు తాగి ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందాడు. మడికొండ ఎస్సై పెగడ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు... స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ నోముల కుమార్ కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. శనివారం కడుపు నొప్పి భరించలేక గడ్డిమందు తాగి పడిపోయాడు. గమనించిన భార్య నోముల సుజాత కుమార్‌ను 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కాగా, భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎడ్యుకేషన్ కిట్లు అందజేత

కాజీపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): స్కూల్ ప్రిపరేటరీ డే కార్యక్రమాన్ని పురస్కరించుకుని బాలవికాస ఆధ్వర్యంలో ఆదివారం బాలవికాస సంస్థ కార్యాలయంలో 273 మంది అనాథలకు ఎడ్యుకేషన్ కిట్‌లు అందజేశారు. ఈ కిట్స్‌లో పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు ఉన్నాయి. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు లూర్దు మర్రెడ్డి మాట్లాడుతూ.. మనిషికి విద్య అనేది ఎంతో ప్రాధాన్యమైందన్నారు. బాలవికాస అందిస్తున్న సహకారం ప్రతి విద్యార్థి వినియోగించుకుని భవిష్యత్‌ను మంచిగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా అభివృద్ధి పథకం సభ్యులు సుజాత, జ్యోతి, అమూల్య, ఐటీ మేనేజర్ శివరాం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి అంతంతే..!

(3వ పేజీ తరువాయి)

రాష్ట్రం ఏర్పాటయింది. ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది.

జరిగింది కొంతే..

తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఉమ్మడి జిల్లాలో ప్రజలు ఆశించినంత ప్రగతి చోటు చేసుకోలేదు. కొన్ని రంగాల్లో అదీ కొంత మేరకే అభివృద్ధి జరిగింది. సాగునీటి రంగం అభివృద్ధి చెందిందని చెప్పటానికి నిర్దిష్టంగా ఏమీ లేదు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల, సమ్మక్క బ్యారేజీల అందుబాటులోకి రావడం ఒక్కటే చెప్పుకోదగ్గ అంశం. నాసిరకం నిర్మాణం వల్ల మేడిగడ్డ కుంగుబాటుకు గురికావడంతో వీటి నిర్మాణాలపై పెద్ద వివాదమే సాగుతోంది. మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం భవిష్యత్తుపైనే అనుమానాలు తలెత్తాయి. దీనిపై ప్రస్తుతం విచారణ జరుగుతోంది. మిషన్ కాకతీయ ద్వారా చెరువుల అభివృద్ధి జరిగింది. వ్యవసాయ రంగానికి నిరంతరాయంగా ఉచిత విద్యుత్ సరఫరా అవుతోంది. వైద్యపరంగా జిల్లాకో మెడికల్ కాలేజీ అందుబాటులోకి వచ్చింది. జిల్లాకో కోర్టు వచ్చింది. విద్యాపరంగా హనుమకొండలో కాళోజీ వైద్య విశ్వవిద్యాలయం ఏర్పాటైంది. ములుగులో జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటవుతోంది. పరిశ్రమల పరంగా వరంగల్ జిల్లాలో మెగాటెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో మిషన్ భగీరథ ద్వారా, వరంగల్ నగరంలో అమృత్ పథకం ద్వారా తాగునీరు అందుబాటులోకి వచ్చింది. హనుమకొండలో కాళోజీ కళాక్షేత్రం ఎట్టకేలకు పూర్తయింది. వరంగల్‌లో పాత సెంట్రల్ జైలు స్థలంలో రూ. 1100 కోట్లకుపైగా వ్యయంతో మల్టీసూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం జరుగుతోంది. ఆరు జిల్లాలకు కొత్త సమీకృత కలెక్టరేట్ల భవన నిర్మాణాలు జరిగాయి. కేఎంసీ ఆవరణలో రూ. 150 కోట్లతో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి అందుబాటులోకి వచ్చింది. కాజీపేటలో ఫాతిమానగర్ బ్రిడ్జి విస్తరణలో భాగంగా మరో సమాంతర బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది. రాంపూర్‌లో ఐటీ పార్క్‌లో ఇప్పుడిప్పుడే ఐటీ కంపెనీల వస్తున్నాయి. జడ్పీలు, మండలాలు, గ్రామ పంచాయతీల పునర్విభజన జరిగింది. కొత్త మునిసిపాలిటీలు ఏర్పాటయ్యాయి. మామునూరులో విమానాశ్రయం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ లభించింది. కాజీపేటలో ఇంటగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం జరుగు తోంది.

జిల్లాల పునర్విభజనతో అస్తవ్యస్తం

పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేసే పేరుతో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన జిల్లాల పునర్విభజన వల్ల ఆశించిన లక్ష్యం నెరవేరకపోగా కొత్త సమస్యలు పుట్టుకు వచ్చాయి. చిన్న జిల్లాలో అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని చెప్పినప్పటికీ ఆచరణలో అది పూర్తిస్థాయిలో జరగలేదు. పైగా కొంత గందరగోళ పరిస్థితులు కూడా ఏర్పడ్డాయి. 2016లో మొదట్లో ఉమ్మడి వరంగల్ జిల్లా అయిదు చిన్న జిల్లాలు వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, జనగామ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలుగా ఏర్పాటు చేశారు. ఆ తర్వాత జయశంకర్ భూపాలపల్లి జిల్లాను విడగొట్టి ములుగు జిల్లాను చేశారు. నగర సమగ్రాభివృద్ధికి రూ. 662 కోట్లతో చేపట్టనున్నట్టు సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించిన అభివృద్ధి పనులకు ఇంకా పునాది రాళ్లే పడలేదు. రూ. 1200 కోట్లతో అండర్ డ్రైనేజీ వ్యవస్థ పనుల ఊసే లేదు. కమలాపూర్‌లో ట్రిపుల్ ఐటీ ఏర్పాటుకు ఇంకా మోక్షం కలుగలేదు. సైనిక్ స్కూల్ ఇంకా రాలేదు. రాష్ట్ర విభజన హామీల్లో ఒకటైన మహబూబాబాద్ జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు జాడే లేదు.



విద్యుత్ దీపాలతో అలంకరించిన హనుమకొండలోని విద్యుత్ భవన్


జరగాల్సింది ఎంతో..

రాష్ట్రావతరణ తర్వాత ఉమ్మడి జిల్లాలో చాలా సమస్యలు ఇప్పటికీ అపరిష్కృతంగా ఉన్నాయి. జరగాల్సిన అభివృద్ధి ఇంకా ఎంతో ఉంది. వరంగల్ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) నిర్మాణం పనులు ఇంకా పూర్తికాలేదు. ఇన్నర్ రింగ్ రోడ్డు పనులు మొదలే కాలేదు. గ్రేటర్ వరంగల్‌లో కొత్త మాస్టర్ ప్లాన్ ఇంకా పూర్తిగా అమలులోకి రాలేదు. పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న నగరానికి అనుగుణంగా 2041 వరకు సిటీ అవసరాలకు సరిపోయేలా 2013లో శ్రీకారం చుట్టిన మాస్టర్ ప్లాన్ బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఆమోదం పొందక అమలులోకి రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా దీని అమలుపై ఇంకా స్పష్టత రాలేదు. తెలంగాణ ఏర్పాటుతో వరంగల్ పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెంతుందని ఆశించిన ప్రజలకు చివరకు నిరాశే మిగిలింది. భారీ పరిశ్రమలేవి రాలేదు. హైదరాబాద్ తరహాలో వరంగల్‌లో ఐటీ పరిశ్రమలు తలివస్తాయని గత ప్రభుత్వం ఊరించింది. ఇప్పటి వరకు ఆశించిన పురోగతి లేదు. రాంపూర్ వద్ద ఐటీ పార్క్‌లో ఇప్పటి వరకు అయిదు కంపెనీలే ఏర్పాటయ్యాయి. హైదరాబాద్ -వరంగల్ కారిడార్ ఏర్పాటు కలగానే మిగిలిపోయింది. వరంగల్‌లోని మెగాటెక్స్‌టైల్ పార్క్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ పార్క్ ఏర్పాటుతో లక్ష మందికి ఉద్యోగాలు వస్తాయని ఊరించినా ఆచరణలో అది ఇంకా అమడ దూరంలోనే ఉంది. వరంగల్‌లో 21 అంతస్తుల మెగా మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం చేపట్టిన అక్కడి నుంచి తొలగించిన వరంగల్ సెంట్రల్ జైల్ నిర్మాణం మామునూరు సమీపంలో ఇప్పటి వరకు మొదలే కాలేదు.

రాష్ట్రావతర వేడుకలకు ఏర్పాట్లు

రాష్ట్రావతరణ ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. హనుమకొండ జిల్లా రాష్ట్ర ఆవిర్భావ ప్రధాన వేడుకలు పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఉదయం 10 గంటలకు జరుగుతాయి. రాష్ట్ర అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. వరంగల్ జిల్లాలో రాష్ట్రావతర వేడుకలు వరంగల్ కోటలోని కుష్‌మహల్ వద్ద జరుగుతాయి. ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జాతీయ జెండాను ఎగురవేస్తారు. ములుగు జిల్లాలో ఆవిర్భావ వేడుకల్లో ముఖ్య అతిథిగా స్త్రీ శిశు సంక్షేమ మంత్రి సీతక్క ముఖ్య అతిధిగా పాల్గొంటారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో రాష్ట్ర అటవీ అభివృద్ధి కమిటీ చైర్మెన్ పొడెం వీరయ్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. మహబూబాబాద్ జిల్లాలో సమీకృత కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో ప్రభుత్వ చీఫ్ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రు నాయక్, జనగామ జిల్లాలో సమీకృత కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ప్రభుత్వ చీఫ్ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. రాష్ట్రావతర వేడుకలను పురస్కరించుకొని వరంగల్ నగరంలోని ప్రధాన కూడళ్లను రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం • 2 జూన్ 2025
7



క్రికెట్ గేమ్‌లో అమ్మాయిలకే భవిష్యత్తు!

మన వాళ్లకు క్రికెట్ అంటే పిచ్చి. గ్రౌండ్‌లో అయినా మొబైల్‌లో అయినా.. "ఈ మధ్యకాలంలో అబ్బాయిలే కాదు అమ్మాయిలు కూడా క్రికెట్ గేమ్ ఆడటం బాగా పెరిగింది.." అంటారు 'రియల్ క్రికెట్' అనే మొబైల్ గేమ్‌ను అభివృద్ధి చేసిన టీమ్‌లో ఒకరైన అంజూ మన్‌కర్. ఆమెను నవ్య పలకరించినప్పుడు ఈ గేమ్‌కు సంబంధించిన అనేక విశేషాలు వెల్లడించారు.

"క్రికెట్ చాలా మందికి జీవితాల్లో ఒక భాగం. వీరిలో ఎక్కువ మంది గ్రౌండ్స్‌కు వెళ్లి ఆడలేరు. దీనితో మానిటర్స్ ముందు.. మొబైల్స్‌లోను ఆడుతూ ఉంటారు. గతంలో ఈ గేమ్స్‌కు కొన్ని పరిమితులు ఉండేవి. మాకు 2013లో ఒక మంచి క్వాలిటీ ఉన్న క్రికెట్ గేమ్‌ను తయారుచేయాలనే ఆలోచన కలిగింది. ఫుట్‌బాల్‌లో మనకు మంచి మంచి మొబైల్ గేమ్స్ ఉన్నాయి. అలాంటిది మనం కూడా తయారుచేస్తే- ప్రపంచమంతా దానిని ఆడతారు అనే ఆలోచనతో రియల్ క్రికెట్‌ను అభివృద్ధి చేయటం ప్రారంభించాం. అప్పుడు మా టీమ్ కేవలం ఆరుగురు మాత్రమే! మేము దీనిని అభివృద్ధి చేసిన తర్వాత 2020లో జాక్‌సన్ డైస్ అనే కంపెనీ కొనుగోలు చేసింది. ఆ తర్వాత ఈ మధ్యకాలంలోనే క్రాఫ్టన్ అనే కంపెనీ కూడా భాగస్వామిగా చేరింది. క్రాఫ్టన్ మాతో చేరటం వల్ల అంతర్జాతీయంగా ఈ గేమ్‌కు మరింత ఆదరణ లభిస్తుందని భావిస్తున్నా. మొదట్లో ఈ గేమ్‌ను తయారుచేసినప్పుడు కొన్ని లక్షల మంది మాత్రమే డౌన్‌లోడ్ చేసేకొనేవారు. ఇప్పుడు ఈ సంఖ్య 50 కోట్లకు చేరింది.

చాలా కష్టం..

గేమింగ్ అంటే చాలా మంది సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తే చాలు అనుకుంటారు. గేమింగ్‌లో సాఫ్ట్‌వేర్ ఎంత ప్రధానమో.. కళాత్మకంగా ఉండటం కూడా అంతే ప్రధానం. క్రికెట్‌లాంటి గేమ్‌ను అభివద్ధి చేయటం ఒక కోణం నుంచి చూస్తే పెద్ద సవాల్ అనే చెప్పాలి. మరో కోణం నుంచి చూస్తే కొంత సులువు అనే చెప్పాలి. ఈ కారణాలు నేను వివరిస్తాను. షూటింగ్‌లాంటి గేమ్‌ను తయారుచేస్తున్నామనుకుందాం. చాలా మందికి షూటింగ్‌లో రూల్స్ తెలియవు. అందువల్ల వారికి ఆ రూల్స్ సులభంగా అర్థమయ్యేలా గేమ్‌ను తయారుచేయాలి. ఇది ఒక పెద్ద సవాల్. క్రికెట్‌లాంటి గేమ్‌లో రూల్స్ అందరికీ తెలుసు. అందువల్ల ఈ రూల్స్‌ను ఆడేవారికి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని ఉండదు. అయితే ఈ గేమ్ వాస్తవిక ప్రపంచానికి దగ్గరగా ఉండాలి. భావోద్వేగాలు ఉండాలి. ఆడేవ్యక్తికి నిజంగా గ్రౌండ్‌లో ఉన్నంత భావన కలగాలి. ప్రతి రోజు గ్రౌండ్‌లో ఆడినప్పుడు ఎలాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతాయో.. వాటన్నింటినీ బేరీజు వేసుకుంటూ ఈ గేమ్‌ను అభివృద్ధి చేయాలి. ఒక రోజులో రెండు గంటలు ఈ గేమ్ ఆడినా బోరు కొట్టకూడదు. లేకపోతే గేమర్స్ దీనిని ఆదరించరు. అందువల్ల మేము ఈ గేమ్‌ను తయారుచేసేటప్పుడు చిన్న చిన్న విషయాలపై కూడా దృష్టి పెట్టాం. లేకపోతే గేమర్స్ దీనిని వదిలేసి ఇతర గేమ్స్‌లోకి వెళ్లిపోతారు.

అమ్మాయిలు కూడా..

ఒకప్పుడు క్రికెట్ కేవలం పురుషుల ఆట మాత్రమే. భారత ఉపఖండంలో ఇప్పటికీ ఎక్కువ మంది అబ్బాయిలే ఈ గేమ్‌ను ఆడతారు. అయితే ఈ మధ్యకాలంలో ఈ గేమ్‌ను ఆడుతున్న అమ్మాయిల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. ఉదాహరణకు ప్రతి రోజూ మా గేమ్‌ను 20 లక్షల మంది ఆన్‌లైన్‌లో ఆడుతూ ఉంటారు. వీరిలో 11 శాతం అమ్మాయిలు ఉంటారు. మా దగ్గర ఉన్న గణాంకాల ఆధారంగా చూస్తే వీరి సంఖ్య పెరుగుతూ వస్తోంది. భవిష్యత్‌లో మరింతగా పెరుగుతుంది. మేము అమ్మాయిల టీమ్‌లతో ప్రత్యేకమైన గేమ్‌ను తయారుచేయాలనుకుంటున్నాం. ఇక ఏ ప్రాంతంలో ఎక్కువగా క్రికెట్ గేమ్‌ను ఆడతారు అనే విషయాన్ని గమనిస్తే- మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలు.. హైదరాబాద్ అని చెప్పవచ్చు. ఇక్కడ నుంచి మా గేమ్‌ను ఎక్కువగా ఆడతారు.

గేమింగ్‌లో తక్కువే..

గేమింగ్ అనేది ఒక ప్రత్యేకమైన క్రీడ. ఈ గేమ్స్‌ను తయారుచేసే కంపెనీలు కూడా ప్రత్యేకమైనవే! అయితే మహిళా గేమింగ్ డెవలపర్స్ ప్రస్తుతం తక్కువనే చెప్పాలి. ఒక కంపెనీలో 10 మంది మగ డెవలపర్స్ ఉంటే.. అమ్మాయిలు ఇద్దరు మాత్రమే ఉంటారు. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. వీటిలో ఒకటి- గేమింగ్‌ను ఒక సీరియస్ ఐటీ పరిశ్రమగా భావించకపోవటం. ప్రతి ఏడాది కొన్ని వేల కోట్ల రూపాయల టర్నోవర్ ఉన్న పరిశ్రమ ఇది. కానీ దీనిని ఐటీలో భాగంగా భావించరు. ఈ ధోరణిలో మార్పు వస్తే ఎక్కువ మంది అమ్మాయిలు గేమింగ్ అభివృద్ధిలో పాలుపంచుకుంటారు. ఇక చిన్నప్పటి నుంచి అమ్మాయిలు కళల వైపు వెళ్లాలని.. అబ్బాయిలు ప్లే స్టేషన్స్ వంటివి ఆడాలనే భావన తల్లితండ్రుల్లో ఉంటుంది. కానీ ఈ మధ్యకాలంలో ఈ విభజన చెరిగిపోతోంది. అమ్మాయిలు కూడా ప్లేస్టేషన్ల వంటివి ఆడుతున్నారు. ఇంకో పదేళ్లలో ఈ విభజన పూర్తిగా చెరిగిపోతుంది. ఆ సమయానికి గేమింగ్‌కు ఐటీ పరిశ్రమలో ఒక సముచిత స్థానం లభిస్తుంది. అప్పుడు క్రికెట్ గేమ్‌లో అమ్మాయిలకే భవిష్యత్తు ఉందని చెప్పాలి.

క్యాన్సర్‌తో పోరాడి.. కిరీటాన్ని గెలుచుకుని..



చిన్నప్పుడు ఏదైనా చిన్న దెబ్బతగిలితేనే ఎంతో హైరానా పడిపోతారు అందరూ. కానీ క్యాన్సర్ అంటే ఏంటో సరిగా తెలియని వయసులోనే దాని బారిన పడి పోరాడి గెలిచి నేడు ప్రపంచ సుందరిగా నిలిచారు ఓపల్ సుచాత షుంగ్‌సిరి. క్యాన్సర్‌తో తనలా ఎవరు ఇబ్బంది పడకూడదని 'ఓపల్ ఫర్ హర్' అనే ప్రాజెక్ట్‌ను ఆమె ప్రారంభించారు. దీని ద్వారా రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నారు ఈ థాయ్‌లాండ్ భామ. ఈ ప్రాజెక్ట్ గురించి పలు సందర్భాల్లో ఆమె పంచుకున్న సంగతులు..

ఆరోగ్యమే ప్రధానం

క్యాన్సర్ నన్ను, నా ఆలోచనలను ఎంతో మార్చింది. మనిషి జీవితంలో ఆరోగ్యం కంటే ఏదీ ముఖ్యం కాదని నా అభిప్రాయం. ఎందుకంటే ఆరోగ్యం ఉంటేనే తన లక్ష్యాలు చేరుకోగలరు, ఏదైనా సాధించగలరు.

నాకు పదహారవ ఏటనే రొమ్ములో కణితి ఉన్నట్లు తెలిసింది. ఈ విషయం తెలిసినప్పుడు ఎంతో బాధ పడ్డా, భయపడ్డా. నాకిక భవిష్యతే లేదని నిరాశ చెందా. కానీ భయంలో నుంచి నాలో ధైర్యం పుట్టుకొచ్చింది. దానితో క్యాన్సర్‌ను జయించా. అయితే ఆ పరిస్థితుల్లో నా కుటుంబం, చుట్టూ ఉన్న సమాజం నాకెంతో అండగా నిలబడింది. మరి నాలా ఇలాంటి అండ లేని వారి పరిస్థితి ఏంటనే ఆలోచనే 'ఓపల్ ఫర్ హర్' స్థాపనకు పునాది అయింది.

నాలా అండ లేని వారి కోసం

క్యాన్సర్ సంక్లిష్ట సమయంలో ఎదుర్కొన్న అనుభవాలను తెలిసిన వారితో పంచుకున్నాను. నేను చెప్పిన ఆ అనుభవాలు తమకు స్ఫూర్తినిచ్చిందని, తామూ క్యాన్సర్‌ను జయించామని కొందరు చెప్పారు. అప్పుడే క్యాన్సర్ రోగులకు అవగాహనతో పాటు మనోధైర్యాన్ని అందించాలని అర్థమయింది. నాలానే క్యాన్సర్‌ను జయించిన వారి జీవిత కథలు చెప్పి మరికొందరికి జీవితం మీద ఆశ కలిగించాలని నిర్ణయించుకున్నా. ఆలోచన అయితే ఉంది కానీ దానిని సరైన వేదిక లేదు. 'ఓపల్ ఫర్ హర్' స్థాపనతో ఆ వేదిక దొరికింది.

నా సంపాదన కూడా..

'ఓపల్ ఫర్ హర్' ప్రాజెక్ట్‌లో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన, దానిని ముందుగా గుర్తించాల్సిన ఆవశ్యకత తెలియజేశా. క్యాన్సర్‌ను జయించిన వారితో పాడ్‌కాస్ట్‌లు, వైద్యులతో ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంతో మందిలో ఆత్మస్థైర్యం నింపడం ప్రారంభించా. అయితే ఆ తరువాత నాకో భయంకరమైన చేదు నిజం తెలిసింది. అదేంటంటే చాలా మందికి ఆస్పత్రులకు వెళ్లేందుకు డబ్బులు లేవని. దాంతో అలాంటి వారి కోసం నిధుల సేకరించడం మొదలుపెట్టా. నా సంపాదన కూడా నిరుపేద మహిళల చికిత్స కోసం విరాళంగా ఇచ్చేశా. ఆపై ఆస్పత్రులు, క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లు, లాభాపేక్ష లేని సంస్థలు ఆర్గనైజేషన్లు, థాయ్‌లాండ్ ప్రజారోగ్య శాఖతో కలిసి పనిచేయడం ప్రారంభించా. ఇలా ఇప్పటి వరకూ ఎంతోమంది థాయ్ మహిళలకు రొమ్ము క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించా. ప్రస్తుతం ఈ మిస్‌వరల్డ్ పోటీల ద్వారా రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన గురించి 'ఓపల్ ఫర్ హర్' స్వరాన్ని ప్రపంచమంతా వినిపించగలిగా.

ప్రపంచమంతా విస్తరించాలి..

ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది మహిళలు రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నారు. థాయ్‌లాండ్‌లోనే ఏటా సుమారు 2 వేల మంది రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నారు. వీటిలో 5 శాతం కంటే తక్కువ కేసులు మాత్రమే తొలి దశలో బయటపడుతుండడం బాధాకరం. క్యాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే సులభంగా దానిని జయించవచ్చు. అందుకే 'ఓపల్ ఫర్ హర్' కేవలం థాయ్‌లాండ్‌కు మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలని అనుకుంటున్నా. ప్రపంచ నలుమూలల ఉన్న రొమ్ము క్యాన్సర్ బాధితులకు జీవితంపై ఆశలు రేకెత్తించాలని భావిస్తున్నా.

దోమలను పారద్రోలే మొక్కలు ఇవే..!

వానాకాలంలో దోమల బెడద ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం కాగానే గుంపులుగా దోమలు ఇంట్లోకి వచ్చేస్తూ ఉంటాయి. ఇవి రాత్రిపూట నిద్రపోనివ్వవు. వీటివల్ల పలు రకాల వ్యాధులు కూడా సోకుతాయి. దోమలను నివారించేందుకు ఇంటి చుట్టూ కొన్ని రకాల మొక్కలు పెంచితే సరిపోతుంది అంటున్నారు నిపుణులు.



- ఇంటి ప్రధాన ద్వారానికి ఎదురుగా తులసి మొక్కను ఏర్పాటు చేస్తే దోమలు లోనికి రావు. బాల్కనీలు, కిటికీల గోడల మీద కూడా చిన్న కుండీల్లో తులసి మొక్కను పెంచవచ్చు.
- ఇంటి పరిసరాల్లో యూకలిప్టస్, నీలగిరి మొక్కలు పెంచితే మంచి ప్రయోజనం కనిపిస్తుంది. ఈ మొక్కలు విడుదల చేసే ఘాటైన వాసనలకు దోమలు నశించిపోతాయి.
- చాలామంది దోమలు వచ్చే సమయానికి ఇంటి తలుపులు మూసేస్తూ ఉంటారు. అయినప్పటికీ బాల్కనీలు, కిటికీల నుంచి దోమలు ఇంట్లోకి వచ్చేస్తూ ఉంటాయి. ఇలాంటప్పుడు ఆ ప్రదేశాల్లో వెడల్పాటి కుండీలు ఏర్పాటు చేసి పుదీనా, నిమ్మ గడ్డి, రోజ్‌మేరీ, లావెండర్, బంతిపూల మొక్కలు పెంచాలి. ఈ మొక్కల ఆకులు, పూల నుంచి వెలువడే సువాసనలు సరిపడక దోమలు దూరంగా పారిపోతాయి. ఈ మొక్కల కుండీలను ఇంట్లో అమర్చుకుంటే దోమలన్నీ బయటికి వెళ్లిపోతాయి.



- సిట్రోనెల్లా అనేది ఓ గడ్డి మొక్క. ఇది సుగంధాన్ని వెదజల్లుతుంది. ఈ మొక్కని కిటికీల దగ్గర, ఇంటి చుట్టూ గోడల వెంబడి పెంచితే దోమలు దూరంగా వెళ్లిపోతాయి.
- దోమలు ఎక్కువగా తిరిగే ప్రదేశంలో వెల్లుల్లి మొక్కను పెంచితే పది రోజుల్లో దోమలన్నీ నశించిపోతాయి.
- గుమ్మానికి ఇరుపక్కలా హార్స్‌మింట్, స్నేక్‌ప్లాంట్, ఆలియం, సేజ్, జెరేనియం మొక్కల కుండీలు పెడితే దోమలు ఇంట్లోకి రావు.
- గడ్డి చేమంతి మొక్క కూడా దోమలను పారద్రోలుతుంది. దీని పూలు పసుపు, తెలుపు, ఎరుపు, గులాబీ, ఊదా రంగుల్లో ఉంటాయి. ఇంటి ముందు వేలాడే కుండీలను ఏర్పాటు చేసుకుని వాటిలో ఈ మొక్కను పెంచితే ప్రయోజనం ఉండడమే కాకుండా పరిసరాలు అందంగా కనిపిస్తాయి.



న్యూస్‌మేకర్

ఆమె పయనం... సమున్నతం

అంజలి సూద్... భారత సంతతికి చెందిన ఈ అమెరికన్ గురించి ఇప్పుడు నెటిజన్లు తెగ వెతికేస్తున్నారు. కారణం... ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ విశ్వవిద్యాలయం... 'బోర్డ్ ఆఫ్ ఓవర్సీర్స్' (పర్యవేక్షక మండలి) సభ్యురాలిగా ఆమెను ఎంపిక చేయడం.

అమెరికా ఓటీటీ 'ట్యూబి' సీఈఓగా ఉన్న అంజలి... గతంలో విమియో, అమెజాన్ తదితర ప్రముఖ కంపెనీల్లో ఉన్నత హోదాల్లో పని చేశారు. వ్యాపారాన్ని కొత్త పుంతలు తొక్కించి... లాభాల బాట పట్టించారు.

'విద్యాశక్తి ద్వారా అమ్మానాన్నలు నా గురించి కన్న కలలను నిజం చేశాను. దాన్ని రేపటి తరానికి అందించాలని కోరుకొంటున్నాను' అంటున్న 41 ఏళ్ల అంజలి విజయ ప్రస్థానం ఇది.



అమెరికాలో ప్రస్తుతం అధ్యక్షుడు ట్రంప్ ప్రభుత్వం... హార్వర్డ్ విశ్వవిద్యాలయం మధ్య వివాదం తీవ్రస్థాయికి వెళ్లింది. ఈ తరుణంలో అంజలి వర్సిటీ 'బోర్డ్ ఆఫ్ ఓవర్సీర్స్' సభ్యురాలిగా ఎంపిక కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పదవిలో ఆమె రెండేళ్లు కొనసాగుతారు. 'బోర్డ్ ఆఫ్ ఓవర్సీర్స్'... హార్వర్డ్ రెండో అత్యున్నత పాలకమండలి. లిబరల్ పార్టీ నాయకుడిగా ఎన్నికైన మార్క్ కార్నే బోర్డులో తన సభ్యత్వానికి రాజీనామా చేయడంతో, ఆ ఖాళీని అంజలితో భర్తీ చేసింది వర్సిటీ. ఆమె హార్వర్డ్ పూర్వ విద్యార్థిని కూడా.

విజయ పరంపర...

దాదాపు పదేళ్లపాటు విమియో విజయాల్లో భాగస్వామి అయిన అంజలి... 2023లో కంపెనీ నుంచి తప్పుకున్నారు. ఆ వెంటనే ఫాక్స్ కార్పొరేషన్ నుంచి ఆమెకు పిలుపు వచ్చింది. దాని అనుబంధ సంస్థ అయిన 'ట్యూబి' సీఈఓగా బాధ్యతలు చేపట్టారు. అమెరికాలో ఉచితంగా సినిమాలు, టీవీ షోలు అందించే ఓటీటీ వేదిక ఇది. అంజలి చేరికతో కంపెనీ గ్రాఫ్ అమాంతం పెరిగిపోయింది. నెలకు దాదాపు పది కోట్ల మంది దీన్ని ఉపయోగిస్తున్నారంటే.. అందులో ఆమె కృషి గురించి ప్రధానంగా చెప్పుకోవాలి.

అదే వర్సిటీలో...

అంజలిది అమెరికాలో స్థిరపడిన పంజాబీ కుటుంబం. డెట్రాయిట్‌లో పుట్టిన ఆమె... ఫ్లింట్ నగరంలో పెరిగారు. పద్నాలుగేళ్ల వయసులో 'ఫిలిప్స్ అండోవర్ అకాడమీ'లో చదివేందుకు మసాచుసెట్స్ వెళ్లారు. 2005లో పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం నుంచి ఫైనాన్స్ అండ్ మేనేజ్‌మెంట్‌లో బీఎస్సీ పూర్తి చేశారు. 2011లో హార్వర్డ్ వర్సిటీ నుంచి ఎంబీఏ పట్టా పొందారు. ఇప్పుడు అదే వర్సిటీ పాలక మండలిలో కీలక బాధ్యతలు చేపట్టారు.

ఉన్నత హోదాలు...

బీఎస్సీ అవ్వగానే ఉద్యోగ జీవితంలోకి ప్రవేశించిన అంజలి కెరీర్ వాయు వేగంతో దూసుకుపోయింది. 2005- 2014 మధ్యకాలంలో ఆమె సాజెంట్ అడ్వైజర్స్, టైమ్ వార్నర్, అమేజాన్‌లలో ఫైనాన్స్, మీడియా విభాగాల్లో పని చేశారు. తరువాత 'విమియో' గ్రూప్‌లో గ్లోబల్ మార్కెటింగ్ హెడ్‌గా బాధ్యతలు చేపట్టారు. మూడేళ్ల తిరక్కుండానే ఆ కంపెనీకి సీఈఓ అయ్యారు. అంజలి సారథ్యంలో కంపెనీ కంటెంట్ ప్రొడక్షన్ నుంచి కంటెంట్ క్రియేటర్లకు సాఫ్ట్‌వేర్ టూల్స్ అందించే స్థాయికి ఎదిగింది. ఎన్నడూ చూడని లాభాలను ఆర్జించింది. ప్రత్యక్ష ప్రసారాలకు ఉద్దేశించిన 'లైవ్ స్ట్రీమ్', వీడియో ఎడిటింగ్ కోసం తెచ్చిన 'మ్యాజిస్టో' యాప్‌లతో పాటు 'వైర్‌మ్యాక్స్, విబ్బిట్ట్' సాఫ్ట్‌వేర్ స్టార్టప్‌లను 'విమియో' సొంతం చేసుకోవడంలో అంజలిదే ప్రముఖ పాత్ర.

కొత్త బాధ్యతలు...

తాజాగా హార్వర్డ్ వర్సిటీ బోర్డ్ ఆఫ్ ఓవర్సీర్స్‌కు ఎంపిక కావడంతో తన కల నెరవేరిందంటారు అంజలి. 'మా అమ్మానాన్న నా గురించి ఎన్నో కలలు కన్నారు. విద్యాశక్తి ద్వారా ఆ కలలను నేను సాకారం చేయగలిగాను. దీన్ని తరువాతి తరాలవారికి అందించాలనేది నా సంకల్పం' అంటున్న అంజలి... హార్వర్డ్ అందుకు సరైన వేదికగా భావిస్తున్నారు. అంతేకాదు... ఆమె ప్రస్తుతం 'సిరియస్ ఎక్స్‌ఎమ్, డోల్బీ లేబరెటరీస్'కు బోర్డు మెంబర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. 'చేంజ్ డాట్ ఓఆర్జీ'కి చైర్మన్‌గా ఉన్నారు.

అందరిలో ఆసక్తి...

హార్వర్డ్‌లో జరిగిన నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్న విదేశీ విద్యార్థుల సమాచారం ప్రభుత్వానికి ఇచ్చేందుకు వర్సిటీ నిరాకరించడాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా పరిగణిస్తున్నారు. దీంతో అటు వర్సిటీకి, ఇటు ట్రంప్ ప్రభుత్వానికి మధ్య విభేదాలు తలెత్తాయి. ఇలాంటి క్లిష్ట సమయంలో వర్సిటీ పాలక మండలిలో అంజలి కీలక బాధ్యతలు చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆమె కార్యాచరణ ఎలా ఉంటుందనేదానిపై అందరిలో ఆసక్తి నెలకొంది.

అవార్డులు ఎన్నో...

ప్రముఖ బిజినెస్ మ్యాగజైన్ 'ఫార్చ్యూన్ 40 అండర్ 40' జాబితాలో చోటు దక్కించుకున్న అంజలి ఎన్నో అవార్డులు, గౌరవ సత్కారాలు అందుకున్నారు. 2019లో ఆమెకు 'న్యూయార్క్ ఉమెన్ ఇన్ ఫిలిమ్ అండ్ టెలివిజన్' అవార్డు లభించింది. గత సంవత్సరం 'ది హాలీవుడ్ రిపోర్టర్' ప్రకటించిన వినోద రంగంలో అత్యంత శక్తివంతమైన మహిళల జాబితాలో అంజలికి చోటు దక్కింది. అంచెలంచెలుగా ఎదుగుతూ కెరీర్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకున్న ఆమె నికర ఆదాయం దాదాపు రూ.73 కోట్లు. ఇదంతా వివిధ కంపెనీలకు అందించిన సేవల ద్వారా పొందిన ప్రతిఫలం. సాధించాలన్న పట్టుదల, బలమైన సంకల్పం ఉంటే ఏ లక్ష్యం పెద్దది కాదని అంజలి నిరూపించారు. కలలను ఛేదించి... భావితరాలకు స్ఫూర్తిమంత్రం అయ్యారు.

శాండ్‌విచ్‌లు అందంగా...

మనం సాధారణంగా శాండ్‌విచ్‌లు చేసుకుని తింటూ ఉంటాం. ఇంటికి అతిథులు వచ్చినప్పుడు మాత్రం వాటిని అందంగా రూపొందించి చక్కగా పళ్లెంలో అమర్చాలని అనుకుంటాం. చూడగానే ఆకట్టుకునేలా శాండ్‌విచ్‌లను ఎలా తయారుచేయాలో తెలుసుకుందాం...



- ఒక బ్రెడ్‌ను తీసుకుని రెండు త్రిభుజాకారపు ముక్కలుగా కోయాలి. రెంటినీ ఒకదాని పక్కన మరోదాన్ని కాస్త ఎడంగా పెట్టాలి. వీటిపైన పాలకూర ఆకును పెట్టాలి. దీనిమీద టమాటా ముక్కలు, చీజ్ తురుం, కొత్తిమీర చీలికలు, ఇతర కూరగాయల ముక్కలు (కేరట్, కీరా, బీట్‌రూట్ లాంటివి) అమర్చాలి.



- ఈ రెండు త్రిభుజాకారపు బ్రెడ్ ముక్కలను ఒకదానితో మరోదాన్ని మూసివేయాలి. లోపల ఉన్న కూరగాయల ముక్కలు పడిపోకుండా జాగ్రత్త తీసుకోవాలి. ఒక పొడవాటి ప్లాస్టిక్ కవర్‌తో ఈ రెండు ముక్కలను కలిపి చుట్టాలి.
- ఒక శాండ్‌విచ్ పేపర్‌ను తీసుకుని పొడవాటి దీర్ఘచతురస్రాకారంలో కత్తిరించాలి. ఈ పేపర్‌తో ముందుగా తయారుచేసుకున్న శాండ్‌విచ్‌ను కోన్ మాదిరి చుట్టాలి. తరవాత ఒక పళ్లెంలో జాగ్రత్తగా పెట్టాలి. శాండ్‌విచ్ పేపర్‌మీద సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఏదైనా రాయవచ్చు.



- పళ్లెంలో ఖాళీ ఉన్నట్లయితే కూరగాయల ముక్కలను అందమైన ఆకృతుల్లో పేర్చవచ్చు. అవసరమైతే మొలకలు, డ్రైఫ్రూట్స్ కూడా చేర్చవచ్చు.

ఎండుద్రాక్ష నీళ్లతో ప్రయోజనాలు



డ్రైఫ్రూట్స్ ఆరోగ్యానికి చాలా మంచివి. అందుకే చాలామంది ఉదయాన్నే నానబెట్టిన బాదం, ఎండుద్రాక్ష తింటుంటారు. అయితే పరగడుపున నల్ల ఎండుద్రాక్ష నీళ్లను తాగడం వలన కూడా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. అవేంటో తెలుసుకుందాం..

- ఈ నీళ్లలో ఫైబర్ ఉంటుంది. అది అజీర్తి సమస్యలను దూరం చేస్తుంది.
- ఈ నీళ్లలోని పొటాషియం రక్తపోటును నియంత్రిస్తుంది.
- ఈ నీళ్లలో సహజసిద్ధంగా ఉండే చక్కెర, కార్బోహైడ్రేట్లు శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి.
- ఈ నీటిలో ఐరన్, విటమిన్ బి కాంప్లెక్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తహీనత దరిచేరకుండా చేస్తాయి.
- ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు, పొటాషియం బీపీని నియంత్రిస్తాయి. చెడు కొలెస్ట్రాల్‌ను తగిస్తాయి. దాంతో గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది.
- ఈ నీళ్లలో ఉండే విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌ను తటస్థీకరించి చర్మ సమస్యలను దూరం చేస్తాయి
- 10- 15 నల్ల ఎండు ద్రాక్షలను తీసుకుని నీళ్లతో బాగా కడిగాలి. ఇప్పుడు వాటిని ఓ గ్లాసుడు మంచి నీళ్లలో వేసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయం పరగడుపున ఆ నీటిని తాగేయాలి. నానబెట్టిన ఎండుద్రాక్షలను కూడా తినేయవచ్చు.

బెంగళూరు ఐఐఎస్సీలో బీఎస్సీ మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్

బీటెక్ మేథ్స్ అండ్ కంప్యూటింగ్ కోర్సుల అడ్మిషన్‌కు దరఖాస్తులను బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ) స్వీకరిస్తోంది. నెక్స్ట్ జనరేషన్ టెక్నాలజీలు, ఫీచరిస్టిక్ డిసిప్లెయిన్స్‌కు ఉద్దేశించిన ఈ కోర్సులను 2022లో ప్రారంభించారు. ఆసక్తిగల అభ్యర్థులు iisc.ac.in/admissions వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. క్లాసులు ఆగస్టు 1 నుంచి మొదలవుతాయి. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా అడ్మిషన్ నిర్వహిస్తారు.



దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 6

ఎన్ఐఆర్‌డీలో పీజీ డిప్లొమా

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్'(ఎన్ఐఆర్‌డీపీఆర్)లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ట్రైబల్ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్(పీజీడీటీడీఎమ్), ప్రోగ్రామ్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి దూరవిద్యలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కోరుతున్నారు. మొత్తం మూడు సెమిస్టర్లు ఉంటాయి. మూడో సెమిస్టర్ పూర్తిగా ప్రాజెక్ట్ వర్క్ ఉంటుంది. **కోర్సు కాలవ్యవధి:** 18 నెలలు

అర్హత: గుర్తింపు పొందిన వర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ పాసై ఉండాలి.

కోర్సు ఫీజు: రూ.18,200/-(ఎస్సీ/ఎస్టీలకు ఫీజులో కొంత మేరకు మినహాయింపు ఉంటుంది) **చివరి తేదీ:** 2025 జూలై 31

వెబ్‌సైట్: www.nirdpr.org.in

ఫోన్: 040 24008442, 7416860345, **Email:** dec.nird@gov.in.

సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీలో

సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో 2025-26 సంవత్సరానికి సంబంధించి పీజీ, యూజీ, పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ రెగ్యులర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ వెలువడింది. ప్రవేశ పరీక్ష ఆధారంగా వీటిలో ప్రవేశాలు జరుపుతారు.

- శిల్పం, చిత్రలేఖనం, డిజైన్స్, సంగీతం, రంగస్థలం, నృత్యం, జానపదం, తెలుగు, చరిత్ర, పర్యాటకం, భాషాశాస్త్రం, జర్నలిజం, జ్యోతిషం, యోగా అంశాలతో ఈ కోర్సులు ఉన్నాయి.
- బీఎఫ్ఏ(నాలుగు సంవత్సరాలు)
- బీడిజైన్(నాలుగు సంవత్సరాలు)
- ఎంఎఫ్ఏ(రెండు సంవత్సరాలు)
- ఎంఏ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్(రెండు సంవత్సరాలు),
- ఎంఏ/ ఎంపీఏ(రెండు సంవత్సరాలు),
- ఎంఏ(తెలుగు, చరిత్ర, సంస్కృతి, పర్యాటకం), రెండేళ్లు, ఎండిజైన్(రెండేళ్లు)...

పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, వరంగల్ **చివరి తేదీ:** 2025 జూన్ 24

ఆలస్య రుసుముతో: 2025 జూన్ 30 **వెబ్‌సైట్:** teluguuniversity.ac.in/



తెలంగాణలో అగ్రి, సంబంధిత కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. రాష్ట్రంలో వ్యవసాయ విద్యను బోధిస్తున్న ఏకైక సంస్థ **'ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం'**. దీనికి భారత వ్యవసాయ పరిశోధన సంస్థ(ఐసీఏఆర్) అక్రిడేషన్ ఉంది. ఈ వర్సిటీకి ప్రస్తుతం వైస్ చాన్స్‌లర్‌గా వ్యవసాయ, ఆర్థిక నిపుణులు, అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ(ఇర్రి)లో ఆరు ఏళ్లపాటు శాస్త్రవేత్తగా, ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకులో రెండు ఏళ్ల అంతర్జాతీయ టీమ్ లీడర్‌గా బాధ్యతలు నిర్వహించిన ప్రొఫెసర్ **అల్దాస్ జానయ్య** వీసీగా ఉన్నారు. ఆయన వర్సిటీలో చేపట్టిన మార్పులు, వ్యవసాయ విద్య గురించి, తీసుకుంటున్న నిర్ణయాల గురించి **ఆంధ్రజ్యోతి దిక్సూచి**కి వివరించారు.



విదేశీ వర్సిటీలతో కలిసి అగ్రి కోర్సులు

- గత సంవత్సరం 200 సీట్లు పెంచాం
- కౌన్సెలింగ్ విధానంలో మార్పులు లేవు
- విదేశీ విద్యార్థులూ ఇక్కడ చేరవచ్చు



ఏ రాష్ట్రానికి సంబంధించిన సీట్లు ఆ రాష్ట్రానికే కేటాయించినందున ఇప్పుడు తెలంగాణలో ఇప్పటికిప్పుడు సీట్ల కొరత లేనట్టేనా?

జ: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సీట్ల కొరత లేదు. ముందు ఉన్న సీట్ల కంటే గత సంవత్సరం 200 సీట్లు పెంచాం.

కౌన్సిలింగ్ విధానంలో ఏమైనా మార్పులు జరిగాయా?

జ: ప్రస్తుతానికి ఎలాంటి మార్పులు లేవు. గతంలో లాగానే కౌన్సిలింగ్ ప్రక్రియ ఉంటుంది.

వర్సిటీలో చాలా కాలం పనిచేసిన అనుభవం మీకు ఉంది కదా. మీ తక్షణ, దీర్ఘ కాలిక లక్ష్యాలు ఏమైనా ఉన్నాయా?

జ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తీసుకురావలన్నదే నా ఉద్దేశ్యం. అందుకోసం ప్రయత్నాలు మొదలుపెట్టాం. యూజీసీ మార్గ దర్శకాల మేరకు విదేశీ విద్యార్థులకు కూడా మన వర్సిటీలో అడ్మిషన్ ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. ఇప్పటికే గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, స్టడీ ఇండియా పోర్టల్ ద్వారా 10 నుంచి 12 మంది విదేశీ విద్యార్థులు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో చదవడానికి దరఖాస్తులు చేసుకున్నారు. వారిలో బంగ్లాదేశ్, నేపాల్, ఆఫ్రికన్ దేశాల విద్యార్థులు ఉన్నారు.

ఇంజనీరింగ్‌లో కొన్ని బ్రాంచ్‌లకు చాలా డిమాండ్ ఉంటోంది. అలా మీ కోర్సుల్లో వేటికైనా డిమాండ్ ఉన్నదా?

జ: మా దగ్గర అలాంటివి లేవు. మరోవైపు గత సంవత్సరం అగ్రి ఇంజనీరింగ్ ఎంటెక్‌లో చేరడానికి విద్యార్థులు ఎక్కువగా ఆసక్తి కనబరచలేదు.

వ్యవసాయ కోర్సులపై విద్యార్థులు పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. ఇలాంటి సమయంలో విదేశీ వర్సిటీలతో కలిసి కోర్సులు రూపొందిస్తే ఆదరణ ఉంటుందా?

జ: ఈ వార్తల్లో పెద్దగా నిజం లేదు. ప్రతి సంవత్సరం బీఎస్సీ అగ్రికల్చర్‌లో చేరే ప్రతీ వంద మంది విద్యార్థుల్లో 15 నుంచి 20 మంది మాస్టర్స్ చేయడానికి విదేశాలకు వెళుతున్నారు. అలాంటి వారికి ఈ తరహా కోర్సులు ఉపయోగకరంగా ఉంటాయి. వారికి మంచి అవకాశం కూడా. ఈ కోర్సుల అడ్మిషన్ కూడా ఎంసెట్ ర్యాంకు ఆధారంగానే ఉంటుంది. మరో విషయం ఏమంటే బీఎస్సీ అగ్రికల్చర్ చదివి ఎవరు ఖాళీగా ఉండటం లేదు. అందరూ ఉద్యోగాల్లోనే ఉన్నారు.

విదేశీ వర్సిటీతో కలసి అగ్రికల్చరల్ కోర్సును ఆరంభిస్తున్నట్లు ప్రకటించారు. వివరాలు చెపుతారా?

జ: ఐసీఏఆర్ ఒప్పందం, అనుమతుల ప్రకారం ఆస్ట్రేలియాలోని 'వెస్టర్న్ సిడ్నీ యూనివర్సిటీ'తో కలిసి వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సు చేయడానికి అవకాశం కల్పిస్తున్నాం. మూడు సంవత్సరాలు ఇండియాలో, చివరి సంవత్సరం ఆస్ట్రేలియాలోని వెస్టర్న్ సిడ్నీ యూనివర్శిటీలో చదువుకోవడానికి వీలుగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. అందుకోసం ప్రత్యేక నోటిఫికేషన్ ఇచ్చి ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ కోర్సులో చేరడానికి అవకాశం కల్పిస్తాం. అయితే ఈ కోర్సు పూర్తి చేయడానికి దాదాపు ఫీజు రూ. 15లక్షలు ఖర్చు అవుతుంది. ఆస్ట్రేలియా వెస్టర్న్ యూనివర్సిటీలో చదువుకునే విద్యార్థులు వారానికి 20 గంటలు పార్ట్‌టైమ్ పని చేసుకునే అవకాశం ఉంటుంది. దీనితో నివాసం, భోజనం ఖర్చులు కవర్ అవుతాయి. ఈ విద్యార్థులను సైతం మెరిట్ ఆధారంగానే ఎంపిక చేస్తాం.

తెలంగాణ వ్యవసాయ శాఖ కాదనుకుంటే ఇప్పుడు 'అగ్రి' గ్రాడ్యుయేట్లకు ఎక్కడెక్కడ అవకాశాలు ఉంటాయి?

జ: బీఎస్సీ అగ్రికల్చర్ చదివిన వారికి వ్యవసాయ శాఖతోపాటు బ్యాంకింగ్ సెక్టార్‌లో అగ్రికల్చర్ ఆఫీసర్లుగా, ఫైనాన్స్ ఆఫీసర్లుగా, కో ఆపరేటివ్ సెక్టార్‌లో, మార్కెటింగ్ సెక్టార్‌లో, సీడ్ కార్పొరేషన్‌లలో, ఫుడ్ ప్రొసెసింగ్ పరిశ్రమలలో, అగ్రికల్చరల్ మెషినరీ విభాగంలో అవకాశాలు ఉంటాయి. అవే కాకుండా పై చదువులు చదివి బోధనవైపు రావచ్చు.

అంతర్జాతీయ ప్రాజెక్టుల్లో అంటే 'ఇంటర్నేషనల్ రైస్ రీసెర్చ్' వంటి సంస్థల్లో చేరాలంటే ఏమి చేయాలి? అసలా అవకాశాలను శాశ్వతంగా మలచుకోగలరా? ఏదో కొద్ది రోజులకేనా?

జ: అంతర్జాతీయ రైస్ రీసెర్చ్(ఇర్రి)లో పరిశోధనలు చేయాలంటే పేరొందిన జర్నల్స్‌లో వ్యాసాలు ప్రచురితమై ఉండాలి. పరిశోధనలలో మంచి ప్రావీణ్యం అవసరం. 'ఇర్రి'లో నేను ఆరు ఏళ్లు శాస్త్రవేత్తగా పనిచేశాను. నా తర్వాత వ్యవసాయ విశ్వవిద్యాలయానికి పరిశోధన సంచాలకులుగా కొనసాగుతున్న డాక్టర్ బలరాం మూడు సంవత్సరాలు 'ఇర్రి'లో శాస్త్రవేత్తగా ఉన్నారు.

తెలంగాణలో ఎన్ని కళాశాలల్లో వ్యవసాయ కోర్సులు ఉన్నాయి? వీటిలో ఎన్ని సీట్లు ఉన్నాయి?

జ: తెలంగాణలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి మాత్రమే 'ఐసీఏఆర్' అక్రిడేషన్ ఉంది. మరే సంస్థకు ఈ గుర్తింపులేదనే విషయం విద్యార్థులు గుర్తుంచుకోవాలి. మన వ్యవసాయ వర్సిటీలో బీఎస్సీ అగ్రికల్చరల్‌లో 1100ల సీట్లు, కమ్యూనిటీ సైన్స్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్‌లో 200 సీట్లు ఉన్నాయి. ఈ సంవత్సరం నుంచి ఐదు శాతం మంది విదేశీ విద్యార్థులకు అడ్మిషన్ ఇవ్వాలనుకుంటున్నాం.

- అప్పారెడ్డిగూడెం భీమయ్య

SCHOLARSHIP ALERT

Gururayaru Foundation Scholarship

Description: Gururayaru Foundation Scholarship 2025-26 is provided by the Gururayaru Foundation to Indian students pursuing undergraduate studies in recognised institutions. It aims to ensure provisions of quality education to meritorious students through academic scholarships, available to all genders and categories.

Eligibility: Application is open to Indian citizens below 22 years old at the time of application. Applicants must have secured admission for the academic year 2025-26 in a recognised institution for graduation. They should be able to demonstrate strong academic achievements along with supporting documents. Annual family income of the applicants should not exceed 6,00,000.

Prizes & Rewards: Full scholarships towards tuition fee for the selected course of study.

Last Date to Apply: 30-06-2025

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/GRFS1

Dr. Reddy's Foundation Sashakt

Description: Dr. Reddy's Foundation Sashakt Scholarship 2025 is the initiative of Dr. Reddy's Foundation (NGO) that empowers female students in India, who have passed Class 12 and are willing to pursue a BSc. in Natural/Pure Sciences, B.Tech, or MBBS degree programs in one of the specified institutions.

Eligibility: Application is open to Indian female students who have passed Class 12 from a recognised Board with a strong academic record and are willing to pursue a B.Tech in Natural/Pure Sciences, MBBS, or BSc. degree program in one of the specified institutions across India.

Prizes & Rewards: 80,000 per annum for three years.

Last Date to Apply: 30-10-2025

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/RFTS4

buddy4study.com

చిత్రజ్యోతి

SINCE 1965

ఆఖరి చిత్రం అదే కావచ్చు



ఆమిర్ ఖాన్

బాలీవుడ్ హీరో ఆమిర్ ఖాన్ నటించిన తాజా చిత్రం 'సితారే జమీన్ పర్'. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఆయన తన డ్రీమ్ ప్రాజెక్ట్ 'మహాభారతం' గురించి మాట్లాడారు. నటుడిగా ఆ సినిమానే తనకు ఆఖరిది కావొచ్చని పేర్కొన్నారు. "సితారే జమీన్ పర్ విడుదల తర్వాత 'మహాభారతం' ప్రాజెక్ట్‌పైనే పూర్తి దృష్టి సారిస్తాను. భారీ స్థాయి నిర్మాణ విలువలతో పాటు ఎన్నో సవాళ్లతో కూడుకున్న ప్రాజెక్ట్ ఇది. ఎన్నో ఏళ్లుగా ఈ కథతో ప్రయాణిస్తున్నాను. ప్రపంచంలోని ప్రతీ విషయం 'మహాభారతం'లో ఉంటుంది. ఇది ఎలాంటి ప్రాజెక్ట్ అంటే, ఈ సినిమా తర్వాత నేను నటుడిగా ఏదీ చేయాల్సిన అవసరం లేదనే భావోద్వేగానికి గురిచేసేంత గొప్పది" అని అన్నారు.



నిఖిల్ కథానాయకుడిగా భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'స్వయంభు'. భువన్ శ్రీకర్ నిర్మిస్తున్నారు. సంయుక్త కథానాయిక. ఆదివారం నిఖిల్ పుట్టిన రోజు సందర్భంగా చిత్రబృందం కదనరంగంలో విజృంభిస్తున్న నిఖిల్, సంయుక్త పోస్టర్‌ను విడుదల చేసింది.

కాలమే అన్నింటినీ బయట పెడుతుంది



బాలీవుడ్ దర్శకుడు రాజ్ నిడిమోరు సతీమణి శ్యామలీ దే తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన స్టోరీ ఒకటి వైరల్ అవుతోంది. "కాలం అన్నింటినీ బయటపెడుతుంది. కర్మ సమాధానం చెబుతుంది. ఈ విశ్వం దీనిని నిశితంగా చూస్తుంటుంది" అని రాసి ఉన్న సందేశాన్ని ఆమె పోస్ట్ చేశారు. ఈ పోస్ట్‌ను ఆమె రాజ్‌నిడిమోరు, సమంత కలసి పికిల్‌బాల్ గేమ్ ఆడుతూ ఉన్న ఫొటోలను షేర్ చేసిన సమయంలోనే షేర్ చేయడం గమనార్హం.



ఎంతో గర్వపడుతున్నాం



తమిళ హీరో ధనుష్, రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్య గతేడాది విడాకులు తీసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా వీరిద్దరూ కలసి దిగిన ఫొటో నెట్టింట వైరల్ అవుతోంది. తమ తనయుడు యాత్ర గ్రాడ్యుయేషన్ డేలో వీరు పాల్గొన్నారు. ఈ ఫొటోను ధనుష్ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. 'యాత్ర తల్లిదండ్రులుగా ఈ రోజు మేమిద్దరం ఎంతో గర్వపడుతున్నాం' అని క్యాప్షన్ పెట్టారు. ఈ ఫొటోపై నెటిజన్లు హర్షం వ్యక్తం చేశారు. 'చాలా రోజుల తర్వాత మీ ఇద్దరినీ ఇలా ఒకే ఫ్రేమ్‌లో చూడడం సంతోషంగా ఉంది' అని కామెంట్ పెట్టారు. కాగా, ఇదే ఫొటోని రజనీకాంత్ కూడా ఎక్స్‌లో పోస్టు చేశారు. 'నా మనవడు జీవితంలో మొదటి మైలు రాయి దాటాడు. కాంగ్రాట్స్ యాత్ర కన్నా' అని రాసుకొచ్చారు.

కామెడీ.. మిస్టరీ కలబోతగా



సంగీత్ శోభన్ కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'గ్యాంబ్లర్స్'. ప్రశాంతి చారులింగా కథానాయిక. కేఎస్‌కే చైతన్య దర్శకత్వంలో సునీత, రాజ్‌కుమార్ బృందావనం నిర్మిస్తున్నారు. ఈనెల 6న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్రబృందం శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ బృందావనం మాట్లాడుతూ 'గతంలో మా సంస్థలో ప్రముఖ రచయిత విజయేంద్రప్రసాద్ గారి దర్శకత్వంలో 'శ్రీవల్లి' అనే చిత్రాన్ని నిర్మించాం. ఇప్పుడు వైవిధ్యమైన కథాంశంతో 'గ్యాంబ్లర్స్' చిత్రాన్ని రూపొందించాం. ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకుల మనసు దోచుకుంటుంది' అని అన్నారు. ఈ సినిమాలో సంగీత్ శోభన్ నటనలో కొత్తకోణాన్ని ప్రేక్షకులు చూడబోతున్నారు అని సునీత చెప్పారు. కామెడీ, మిస్టరీ, గ్లామర్ కలబోతగా ఈ సినిమా ఉంటుందని దర్శకుడు చెప్పారు.



ప్రేక్షకుల ఆదరణ మరువలేనిది

పలు కుటుంబ కథా చిత్రాలను రూపొందించి పరిశ్రమకు మర్చిపోలేని విజయాలను అందించిన దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి. 32 ఏళ్ల కెరీర్‌లో 42 చిత్రాలను రూపొందించి ప్రేక్షకుల మెప్పు పొందారు. ఆదివారం ఎస్వీ కృష్ణారెడ్డి పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయన సినిమాల్లో నటించిన నటీనటులు అంతా కలసి కృష్ణారెడ్డి పుట్టిన రోజు వేడుకలను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ 'నన్ను మొదట్నుంచి ప్రోత్సహిస్తూ, అండగా నిలుస్తున్న అచ్చిరెడ్డి గారికి రుణపడి ఉంటాను. అలాగే నా తొలి చిత్రంలో హీరోగా నటించేందుకు అంగీకరించిన రాజేంద్రప్రసాద్ గారిని ఎప్పటికీ మరువలేను. అలాగే ఇన్నేళ్లుగా ప్రేక్షకులు నా పట్ల చూపుతున్న ప్రేమాభిమానాలను మరువలేను. వారికి ధన్యవాదాలు తెలుపుతున్నాను' అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, అలీ, రోజా, ఆమని, ఇంద్రజ, లయ తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొందరు నటీనటులపై రాజేంద్రప్రసాద్ అసభ్య పదజాలం ఉపయోగించడం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

విడుదలకు సిద్ధం



సత్యం రాజేశ్, శ్రవణ్, కాలకేయ ప్రభాకర్ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'పాడేరు 12వ మైలు రాయి'. ఎన్.కే దర్శకత్వంలో తోలేటి కృష్ణ నిర్మించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఈనెల 6న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం శ్రీ మోదకొండమ్మ తల్లి ఆశీస్సులతో ఈ సినిమాను తెరకెక్కించాం. సస్పెన్స్‌తో పాటు చక్కని ప్రేమకథతో ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేస్తుంది' అని చెప్పారు. బీభత్సరసం ప్రధాన కథాంశంగా పల్లెటూరి నేపథ్యంలో వస్తున్న పూర్తి వినోదాత్మక చిత్రమిది అని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: పీ ఆర్, సినిమాటోగ్రఫీ:జి. అమర్.

మంచి అనుభూతినిస్తుంది



మురళీ కృష్ణంరాజు, శృతి శెట్టి జంటగా పృథ్వీ పెరిచెర్ల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'స్కై'. నాగిరెడ్డి గుంటక, పృథ్వీ పెరిచెర్ల, శ్రీ లక్ష్మీ గుంటక, మురళీ కృష్ణంరాజు నిర్మిస్తున్నారు. త్వరలోనే విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో టీజర్‌ని లాంచ్ చేశారు. హీరోయిన్ శృతి శెట్టి మాట్లాడుతూ 'ఈ సినిమాలో నటించే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉంది. త్వరలోనే మీ ముందుకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం' అని అన్నారు. హీరో, నిర్మాత మురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ 'నన్ను నేను హీరోగా కంటే ఒక నటుడిగా భావిస్తా. అనుభవజ్ఞులతో కలసి పనిచేయడం సంతోషంగా ఉంది. ఈ చిత్రం మంచి అనుభూనిస్తుంది' అని అన్నారు.

సంగీతానికే తొలి ప్రాధాన్యం



నరేశ్ అగస్త్య, రబియా ఖతూన్ జంటగా విపిన్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'మేఘాలు చెప్పిన ప్రేమ కథ'. సునేత్ర ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై ఉమాదేవి కోట నిర్మిస్తున్నారు. మ్యూజికల్ రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కుతోన్న ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. ఒక ప్రతిభావంతుడైన సంగీతకారుని చుట్టూ చిత్రకథ తిరుగుతుంది. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకుడు విపిన్ మాట్లాడుతూ 'మా సినిమాలో ప్రిన్స్ రామ వర్మ అనే పెద్ద సంగీత విద్వాంసులు అతిథి పాత్రలో నటించారు. ఆయన సినిమాలో పాట కూడా పాడారు.' అని అన్నారు. నిర్మాత ఉమాదేవి మాట్లాడుతూ 'ప్రతి సినిమాలో కళని కనెక్ట్ చేయాలనేది నా ఆశ. అందుకే ఈ సినిమాలో సంగీతానికే తొలి ప్రాధాన్యం ఇచ్చాం. సిరివెన్నెల సీతారామ శాస్త్రి గారికి ఈ చిత్రాన్ని అంకితం ఇస్తున్నాం. తప్పకుండా మీ అందరికీ నచ్చుతుంది' అని అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: మోహన కృష్ణ. సంగీతం : జస్టిన్ ప్రభాకరన్.

తెలంగాణ తరహా పర్యాటకాన్ని..

థాయ్‌లాండ్‌లో ప్రచారం చేస్తా

టైటిల్ గెలిచా.. ఇప్పుడు దేశమే నా ప్రాధాన్యం

- థాయ్‌లాండ్‌లో బలవంతపు వ్యభిచారం బాధాకరం
- అక్కడి మహిళలకు సమానత్వం కోసం కృషి చేస్తా
- పోలీసు, ఆర్మీలో మగువల నియామకంపై ఉద్యమిస్తా
- గెలుస్తానన్న నమ్మకంతోనే 'మిస్ యూనివర్స్' వదిలేశా
- పోటీల్లోకి రాకుండా ఉంటే రాజకీయాల్లో ఉండేదాన్ని
- 'ఆంధ్రజ్యోతి'తో మిస్ వరల్డ్-2025 ఓపల్ సుచాత



హైదరాబాద్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతాలను ప్రచారం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం మిస్ వరల్డ్ వంటి గొప్ప కార్యక్రమానికి ఆతిథ్యం ఇచ్చిందని, ఇలాంటి ప్రచారమే థాయ్‌లాండ్‌లో చేయాల్సి ఉందని మిస్ వరల్డ్-2025 ఓపల్ సుచాత షుంగ్‌సిరి అన్నారు. తాను కోరుకున్న టైటిల్ సొంతమైందని, ఇప్పుడు దేశమే తన ప్రాధాన్యమని స్పష్టం చేశారు. థాయ్‌లాండ్‌లో తన సోదరీమణులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు తెలుసని చెప్పారు. ప్రస్తుతం మహిళలకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నానని, ఇక నుంచి తన ప్రాధాన్యాలు మరింత పెరగనున్నాయని స్పష్టం చేశారు. స్వదేశానికి వెళ్లిన వెంటనే అక్కడి మహిళల కోసం అనేక కార్యక్రమాలు చేయాల్సి ఉందని తెలిపారు. మిస్ వరల్డ్ టైటిల్ గెలుచుకున్న అనంతరం సుచాత తన ప్రాధాన్యాల గురించి 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు

పర్యాటకులు అందుకే వస్తున్నారు..

దాదాపు ఏడున్నర కోట్ల జనాభా ఉన్న థాయ్‌లాండ్‌లో మహిళా హక్కుల ఉల్లంఘన నేను గమనించిన అత్యంత అమానవీయ సమస్య. ఒకవైపు అన్ని దేశాల్లో, అన్ని రంగాల్లో మహిళలు పురుషులతో సమానంగా పోటీ పడుతుండగా, మా దేశంలో అలాంటి పరిస్థితి లేదు. అక్కడ సెక్స్ ట్రాఫికింగ్(బలవంతపు వ్యభిచారం) అతిపెద్ద సమస్య. ఉపాధి అవకాశాల్లేక మహిళలు అయిష్టంగానే ఈ వృత్తిలోకి వెళుతున్నారు. అక్కడ 15-25 అమ్మాయిల అక్రమ రవాణా కొన్ని దశాబ్దాలుగా సాగుతోంది. ఐక్యరాజ్య సమితితో సహా అనేక దేశాలు దీన్ని అతి పెద్ద ప్రపంచ సమస్యగా పేర్కొన్నాయి. దీంతో మహిళలు ఎక్కువగా ప్రభావితం అవుతున్నారు. అనేక ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి వెంటనే దృష్టి పెట్టాల్సి ఉంది. బాలికలను బలవంతంగా వ్యభిచార గృహాలకు తరలిస్తున్నారు. మా దేశానికి వచ్చే పర్యాటకులు సైతం అందుకోసమే వస్తున్నారు. వారి ఆలోచన మారాల్సి ఉంది.

మా దగ్గర మహిళా పోలీసులుండరు..

హైదరాబాద్ విమానాశ్రయంలో అడుగుపెట్టినప్పటి నుంచి నేను గమనించిన కీలక విషయం పోలీసింగ్. ఇక్కడ పురుషులతో సమానంగా మహిళలున్నారు. 25 రోజులుగా నాకు భద్రతగా మహిళలే ఉండటం చాలా సంతోషం. థాయ్‌లాండ్‌లో ఇలాంటి పరిస్థితి లేదు. అక్కడ మహిళలకు సమాన హక్కులు లేవు. 1997 రాజ్యాంగంలో మహిళలకు తొలిసారి సమాన హక్కులు లభించాయి. దీనిని 2007 రాజ్యాంగంలో తిరిగి ధ్రువీకరించారు. అయినా ఇప్పటికీ పోలీసు, మిలిటరీలో మహిళలకు అవకాశం లేదు. మహిళలు అలాంటి పనులు చేయలేరన్నది ప్రభుత్వ భావన. ఇతర రంగాల్లో మహిళలు నామమాత్రంగా ఉన్నా.. అక్కడి కార్యాలయాల్లో పురుషులదే ఆధిపత్యం. భర్తల చేతుల్లో గృహ హింస ఎక్కువగా ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించకుండా మహిళా సాధికారత సాధించడం అసాధ్యం. అందుకే మహిళలకు సమాన అవకాశాలు, సమాన హక్కులు రాజ్యాంగానికే పరిమితం కాకుండా.. అమల్లోకి తేవడం కోసం ఉద్యమిస్తా.

రాజకీయాల్లో మార్పు రావాలి..

పాఠశాల రోజుల నుంచి రాజకీయాలంటే ఆసక్తి. ఈ పోటీల్లోకి రాకుంటే తప్పకుండా రాజకీయాల్లో ఉండేదాన్ని. ఇప్పుడు రాజకీయ సంస్కరణల కోసం నా విజయాన్ని అవకాశంగా ఉపయోగించుకుంటా. థాయ్‌లాండ్ పార్లమెంటులో మహిళల సంఖ్య ఐదో వంతు కూడా లేదు. మొత్తం సీట్లలో 19.4 శాతం మాత్రమే ఉన్నారు. 50 శాతానికి మించి మహిళా ప్రతినిధులు అనేక దేశాల్లో ఉన్నారు. దేశంలో అనేక మార్పులకు రాజకీయమే కీలకం. అక్కడ మహిళల సంఖ్య పెంచితే మహిళా సమస్యలు వేగంగా పరిష్కారం అవుతాయని నేను నమ్ముతా.

గెలుస్తానన్న నమ్మకంతోనే వచ్చా..

గత నాలుగేళ్లలో రెండుసార్లు మిస్ యూనివర్స్‌గా ఎంపికయ్యా. 2022లో మూడో రన్నరప్‌గా నిలవగా.. గతేడాది మొదటి రన్నరప్‌గా నిలిచా. సాధారణంగా మిస్ యూనివర్స్‌లో రెండుసార్లు ప్రయత్నం చేశాక మళ్లీ మిస్ వరల్డ్ కోసం ప్రయత్నించరు. అయితే రెండుసార్లు అవకాశం కోల్పోయినా.. మిస్ వరల్డ్ లాంటి గొప్ప అవకాశం సాధిస్తానన్న నమ్మకం ఉండేది. ఇందులో పాల్గొనాలంటే మిస్ యూనివర్స్ రన్నరప్‌గా గతేడాది లభించిన అవకాశాలన్నీ వదులుకోవాలి. అయినప్పటికీ నేను గెలుస్తానన్న నమ్మకంతోనే ఇక్కడికి వచ్చా. నా ఇంట్లో 16 పిల్లులున్నాయి. తీవ్ర ఒత్తిడిలో ఉన్నప్పుడు వాటితో సమయం గడుపుతా. ఫైనల్‌కి ముందు కూడా ఒత్తిడిని వాటితోనే అధిగమించా. పోటీలో పాల్గొనే ముందు ఇంట్లోని పిల్లులతో వీడియో కాల్ మాట్లాడా. హైదరాబాద్, తెలంగాణ నాకు జీవితాంతం గుర్తుండిపోయే మధుర జ్ఞాపకం.

ప్రపంచ సుందరి పోటీల ఫినాలేలో నాకెంతో ఇష్టమైన మాజీ మిస్ వరల్డ్ మానుషి చిల్లర్‌ను కలిశాను. అలాగే మాజీ ప్రపంచ సుందరి ప్రియాంక చోప్రా అంటే నాకు చాలా ఇష్టం. ఆమె నుంచి స్ఫూర్తి పొందాను. పలు బాలీవుడ్ చిత్రాలను చూశాను. ఆలియా భట్ నటించిన 'గంగూబాయి కాఠియావాడీ' ఎంతగానో నచ్చింది.

బాహుబలి చూసి రివ్యూ ఇస్తా..

అలాంటి సినిమాలు ప్రేక్షకులను ఆలోచింపజేస్తాయి. కొన్ని రోజుల క్రితం హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీని సందర్శించా. 'బాహుబలి' చిత్రం గురించి విన్నాను. కానీ చూడలేదు. పోటీలు పూర్తయ్యాక ఆ సినిమా చూడాలని నాకు నేను ప్రామిస్ చేసుకున్నా. మరోసారి ఇక్కడికి వచ్చేటప్పటికి ఆ సినిమాపై తప్పకుండా రివ్యూ ఇస్తా. అవకాశం వస్తే బాలీవుడ్ సినిమాల్లో నటించడానికి సిద్ధం.

అందాల భామలకు ఆత్మీయ వీడ్కోలు



- విమానాశ్రయంలో సాంస్కృతిక బృందాల బై..బై..
- తిరుగు ప్రయాణమైన 67 మంది సుందరాంగులు

హైదరాబాద్/శంషాబాద్ రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): 72వ మిస్‌వరల్డ్ అందాల పోటీల నిర్వహణ శనివారంతో ముగియడంతో పలు దేశాల సుందరీమణులు ఆదివారం తెల్లవారుజాము నుంచే తిరుగు ప్రయాణం ప్రారంభించారు. దీంతో శంషాబాద్ విమానాశ్రయ ప్రాంతమంతా సందడిగా మారింది. అందాల భామలకు పర్యాటక శాఖ అధికారులు సాంస్కృతిక కళాకారుల ఆధ్వర్యంలో ఘన వీడ్కోలు పలికారు. శనివారం సాయంత్రం హైటెక్స్‌లో జరిగిన గ్రాండ్ ఫినాలేతో పోటీలు ముగించుకుని సుమారు 67 మంది పోటీదారులు వారి వారి దేశాలకు వెళ్లిపోయారు. మూడు వారాల పాటు సాగిన మిస్‌వరల్డ్ పోటీల్లో సుమారు 108 దేశాలకు చెందిన సుందరాంగులు ఉత్సాహంతో పాల్గొన్నారు. పోటీల ఆద్యంతం తెలంగాణ సాంస్కృతిక కళావైభవం ప్రతిబింబించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. తెలంగాణ ప్రజల ఆదరణ, ఆతిథ్యం తమకు జీవితాంతం ఓ మధురజ్ఞాపకంగా నిలిచిపోతుందని వారు పేర్కొన్నారు.

కీర్తి కాదు.. స్ఫూర్తి

మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంచడమే లక్ష్యం

- మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొన్నది అందుకే!
- కిరీటం దక్కకున్నా టాప్-4 నిలవడం గర్వకారణం
- 'ఆంధ్రజ్యోతి'తో మిస్ వరల్డ్ రన్నరప్‌లు

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): 'మా విజయం మాకోసం కాదు.. మాదేశంలో అణచివేతకు గురవుతున్న, ఎన్నో సమస్యలతో సతమతమవుతున్న మహిళా లోకానికి స్ఫూర్తి నింపడమే మా ఉద్దేశం..' అని మిస్ వరల్డ్ టాప్-3 రన్నరప్‌లు చెబుతున్నారు. ఆఫ్రికా ఖండం నుంచి ప్రాతినిధ్యం వహించిన ఇథియోపియా ప్రతినిధి తొలి రన్నరప్‌గా, యూరప్ ఖండం నుంచి విజేతగా నిలిచిన పోలాండ్ సుందరి రెండో రన్నరప్‌గా, అమెరికా-కరేబియన్ ఖండం నుంచి గెలిచిన మార్టినిక్ ప్రతినిధి మూడో రన్నరప్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ప్రపంచ సుందరి కిరీటం దక్కకున్నా టాప్-4లో నిలవడాన్ని గొప్ప విజయంగా భావిస్తున్నామని వారు చెప్పారు. ఆదివారం తమ అభిప్రాయాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

మాత, శిశు ఆరోగ్యం.. నా ప్రాధాన్యం



మా దేశంలో ఆరోగ్యంపై మహిళలకు అవగాహన చాలా తక్కువ. తీవ్ర అనారోగ్యం బారినపడేవరకు కూడా చికిత్స తీసుకోరు. దీనిపై అవగాహన కల్పిస్తున్నా. మాయా చారిటబుల్ సంస్థతో కలిసి ఐదేళ్లుగా పనిచేస్తున్నా. ఇప్పుడు సాధించిన విజయంతో మాతాశిశు ఆరోగ్యంతోపాటు మహిళా సమానత్వం, నిరుద్యోగం, డ్రగ్స్ వంటి ప్రధాన సమస్యలపైనా పనిచేసేందుకు సిద్ధమవుతున్నాను. ఈ పోటీలతో ఇథియోపియా పేరు ప్రపంచానికి తెలిసింది. నా దేశంతో పాటు ప్రపంచ మహిళలకు స్ఫూర్తి కలిగించడమే నా జీవిత లక్ష్యం.

- హసెట్ డెరేజీ, ఇథియోపియా

మా సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేస్తా..



పోలాండ్-భారత్ మధ్య ఎప్పటినుంచో మంచి సంబంధాలు ఉన్నాయి. అక్కడికి విద్య కోసం వచ్చే భారత విద్యార్థుల సంఖ్య కూడా పెరుగుతోంది. మా దేశంలో వందకుపైగా భారతీయ రెస్టారెంట్లున్నాయి. దానితో ఇక్కడ భారతీయ వంటకాలను చాలా ఆస్వాదించా. తెలంగాణ జానపదాలను తెలుసుకోవడం మా పర్యటనలో నాకు ఎక్కువగా నచ్చిన అంశం. నేను పోలాండ్ జానపద నృత్యకారిణిని. సెర్బియాలో జరిగిన అంతర్జాతీయ జానపద నృత్య పోటీల్లో మా దేశం నుంచి పాల్గొన్నాను కూడా. ఇప్పుడు లభించిన విజయంతో మా జానపదాలను ప్రపంచానికి పరిచయం చేస్తా.

- మాజా క్లాజ్డా, పోలాండ్

మా దేశం గురించి ప్రపంచానికి తెలిసింది



మార్టినిక్ అనే ఓ దేశం ఉందన్న విషయం ప్రపంచంలో చాలా మందికి తెలియదు. నేను మిస్ వరల్డ్ పోటీలకు వచ్చినప్పటి నుంచి చాలా మంది మా దేశం గురించి ఆన్‌లైన్ శోధించడం ప్రారంభించారు. మిస్ వరల్డ్‌లో 3వ రన్నరప్‌గా నిలవడంతో... ఇప్పుడు మా చిన్నపాటి ద్వీప దేశం పేరు ప్రపంచానికి తెలిసింది. నా దేశం కోసం నేను సాధించిన అతిపెద్ద విజయమిది. నేను చాలా గర్వపడుతున్నాను. కేవలం 1,100 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో, 3.5 లక్షల జనాభా ఉన్న చిన్న ద్వీపదేశం మాది. దేశం చిన్నదే కావచ్చు. కానీ పర్యాటకులకు ఆకట్టుకునే ఎంతో అందమైన దేశం. జలపాతాలు, బీచ్‌లు, ప్రకృతి అందాలు మాకు దేవుడిచ్చిన వరం. నా విజయంతో మా దేశానికి వచ్చే పర్యాటకుల సంఖ్య కచ్చితంగా పెరుగుతుంది.

- అరేలీ జోకిమ్, మార్టినిక్



గాంధీభవన్‌లో మల్లు రవిని అభినందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తెలంగాణలో సామాజిక బాధ్యతతో పాలన

- ఏడాదిన్నరలోనే కాంగ్రెస్ సర్కారు అద్భుతాలు : మల్లు రవి
- క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ/హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో సామాజిక బాధ్యతతో పాలన సాగుతోందని కాంగ్రెస్ సీనియర్ నేత, నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. పదేళ్ల పాలించిన బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అన్ని విధాలా దోచుకుందని ఆరోపించారు. ఆదివారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ 11వ అవతరణ దినోత్సవాన్ని సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. అనంతరం హైదరాబాద్‌కు చేరుకున్న మల్లు రవి.. గాంధీభవన్‌లో టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌లను కలిసి ధన్యవాదాలు తెలిపారు. కేసీఆర్ కుటుంబంలో పంచాయితీ అంతా ఓ డ్రామా అంటూ టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం కొట్టిపారేశారు.

అన్నదాతల బాధలు వినే తీరిక లేదా?

- జనుము, జీలుగ విత్తనాలు అందించరా?: హరీశ్

జగదేవ్‌పూర్/హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): అందాల పోటీలకు వెళ్లే తీరిక ఉన్న సీఎం రేవంత్‌రెడ్డికి రైతుల బాధలు, కష్టాలు వినే తీరిక లేకుండాపోయిందని మాజీమంత్రి హరీశ్ రావు విమర్శించారు. మార్కెట్ యార్డుల్లో ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులకు జనుము, జీలుగ విత్తనాలను ఎందుకు అందించలేకపోతున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తీగుల్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం పార్టీ గ్రామ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం సభలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. అభివృద్ధి పనులు చేయడానికి డబ్బుల్లేవని చెప్పే రేవంత్‌రెడ్డి వందల కోట్లతో అందాల పోటీలు ఎలా నిర్వహించారని నిలదీశారు. ప్రభుత్వ పరంగా అందాల పోటీలను నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ పరువు తీశారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజుశ్రవణ్ ఆరోపించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. సీఎం అందాల పోటీలకు ప్రాధాన్యం ఇచ్చారు కానీ.. అకాల వర్షాలతో పంటనష్టపోయి విలవిల్లాడుతున్న రైతన్నల ఆవేదనను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

రిజర్వేషన్లు పెంచాకే 'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలి

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచిన తర్వాతనే రాష్ట్రంలో స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. రిజర్వేషన్ పెంపు కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలన్నారు. ఆదివారం కలింగ భవన్‌లో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన బీసీల రాష్ట్రస్థాయి విస్తృత సమావేశంలో జాజుల మాట్లాడారు.

కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించాలి

- చేనేత ఐక్యవేదిక, కేఎల్‌బీ ఫెడరేషన్ డిమాండ్

రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఉద్యమ నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించాలని చేనేత ఐక్యవేదిక అధ్యక్షుడు రాపోలు వీరమోహన్, కొండా లక్ష్మణ్ బాపూజీ(కేఎల్‌బీ) ఫెడరేషన్ కన్వీనర్ ఆర్.జ్ఞానేశ్వర్ డిమాండ్ చేశారు. నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పంపిన వినతి పత్రంలో వారు గుర్తుచేశారు. 1969లో తెలంగాణ ఉద్యమానికి మద్దతుగా మంత్రి పదవికి రాజీనామా చేశాడని, అలాగే మలిదశ ఉద్యమంలో 87ఏళ్ల వయసులో సైతం పోరాటాల్లో పాల్గొని ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు.

యునైటెడ్ ఫూలే ఫ్రంట్ ఇక.. జాగృతి అనుబంధ సంస్థ: ఎమ్మెల్సీ కవిత

యునైటెడ్ ఫూలే ఫ్రంట్ (యూపీఎఫ్) ఇకపై తెలంగాణ జాగృతి అనుబంధ సంస్థగా పని చేస్తుందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న బీసీ రిజర్వేషన్లను అమల్లోకి తెచ్చేవరకు తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని తెలిపారు. ఆదివారం తెలంగాణ జాగృతి కార్యాలయంలో యూపీఎఫ్ నాయకులతో కవిత సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యూపీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. యూపీఎఫ్ కన్వీనర్‌గా బొల్లా శివశంకర్, కో ఆర్డినేటర్‌గా ఆలకుంట హరి, సలహాదారుగా గట్టు రాంచందర్‌రావు, మరో 50 మందిని కో కన్వీనర్లుగా నియమించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడబలుక్కొని బీసీ బిల్లులను కోల్డ్ స్టోరేజీలో పెట్టే కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. త్వరలోనే బీసీ బిల్లులు సాకారమయ్యేందుకు పోరాట కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

అమ్మకు సాయం అందేనా?

(మొదటి పేజీ తరువాయి)

అమలు నిలిచిపోయింది. ఆ తర్వాత రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్.. కేసీఆర్ కిట్ పథకం పేరును ఎంసీహెచ్ కిట్‌గా మార్చింది. ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర అవుతున్నా ఇప్పటికీ పథకం అమలు కావడం లేదు. మరోపక్క, విశ్వసనీయ సమాచారం మేరకు బీఆర్ఎస్ హయంలో కేసీఆర్ కిట్ నగదు బదిలీ కింద రూ.721 కోట్లు బకాయిలు పెట్టింది. వైద్య ఆరోగ్యశాఖ తాజా గణాంకాల ప్రకారం పాత, కొత్త కలిపి ఎంసీహెచ్ కిట్ బకాయిలు రూ.862 కోట్లకు చేరాయి. ఈ నేపథ్యంలో ఎంసీహెచ్ కిట్ పథకం తిరిగి అమలయ్యేనా, అమ్మకు సాయం అందేనా.. అనే సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

కిట్‌లో ఏమిచ్చేవారంటే..

2017 జూన్ 3న అప్పటి సీఎం కేసీఆర్ ఈ కేసీఆర్ కిట్ పథకాన్ని ప్రారంభించారు. గర్భధారణ, ప్రసవానంతర కాలంలో మహిళలకు ఈ పథకం కింద రూ.12 వేలు, అదే ఆడపిల్ల పుడితే రూ.13 వేల ఆర్థిక సాయం ఇచ్చేవారు. అలాగే ప్రసవ సమయంలో కేసీఆర్ కిట్‌ను అందించేవారు. బాలింతకు, నవజాత శిశువుకు 3 నెలలకు సరిపోయేలా దుస్తులు, సబ్బులు, బేబీ ఆయిల్, పౌడర్, దోమ తెర, న్యాప్‌కిన్లు, డైపర్లు వంటి 16 రకాల వస్తువులు కిట్‌లో ఉండేవి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించిన వారికే ఈ పథకం వర్తింపజేశారు. అలాగే ఒక మహిళకు రెండు ప్రసవాలకే దీన్ని పరిమితం చేశారు.



కేంద్ర సాయం తీసుకోని వైనం

రాష్ట్ర ప్రభుత్వం కన్నా ముందే 2017 జనవరి 1న కేంద్రం ప్రధాన మంత్రి మాతృవందన యోజన (పీఎంఎంవీవై) పేరిట ఇదే తరహా పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద రూ.5 వేల నగదు బదిలీ చేస్తారు. ఈ పథకం కింద కేంద్రం అన్ని రాష్ట్రాలకు సాయం అందిస్తోంది. అయితే, బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకం కింద వచ్చే నిధులను తీసుకోలేదు. కేంద్ర సాయం తీసుకుంటే వారు సూచించిన పేరునే పథకానికి కచ్చితంగా పెట్టాలి. అందుకు ఇష్టపడని నాటి రాష్ట్ర ప్రభుత్వం మొత్తం తామే భరిస్తామని చెప్పి కేసీఆర్ కిట్ పథకాన్ని అమలు చేసింది. కానీ, పథకం ప్రారంభించిన మూడేళ్ల పది మాసాలకే చేతులెత్తేసింది. నగదు బదిలీని పూర్తిగా నిలిపివేసింది.

కొత్త కిట్‌పై కసరత్తు...

ఇక, రాష్ట్రంలోని ప్రస్తుత ప్రభుత్వం కేసీఆర్ కిట్ స్థానంలో కొత్త పేరుతో కిట్‌ను ఇవ్వాలని నిర్ణయించింది. ఆ మేరకు అధికారులు కూడా ప్రతిపాదనలు పంపారు. గత సర్కారు కేసీఆర్ కిట్‌తో పాటు కేసీఆర్ న్యూట్రియంట్ కిట్‌ను కూడా ఇచ్చింది. గర్భిణుల్లో రక్తహీనతను తగ్గించేందుకు రెండుసార్లు కిట్ ఇచ్చేవారు. ఆ పథకంలో కోట్ల రూపాయల కుంభకోణం జరగడంతో కాంగ్రెస్ అధికారం చేపట్టిన వెంటనే దానిని నిలిపివేసింది. ప్రస్తుతం కేసీఆర్ కిట్, న్యూట్రియంట్ కిట్ రెండూ కలిసి ఉండేలా కొత్త కిట్‌ను వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు డిజైన్ చేశారు. అందుకు సంబంధించి ప్రతిపాదనలను ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపారు. అయితే ఆ ఫైల్‌కు సీఎంవో ఆమోదం ఇంకా లభించలేదు. ఇక కేంద్రం ఇచ్చే పీఎంఎంవీవై పథకంలో భాగస్వామి అయి కేంద్రం ఒక్కో గర్భిణికి ఇచ్చే రూ.5 వేల సాయాన్ని తీసుకోవాలనే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు వైద్యవర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటంతో కేంద్ర సాయం తప్పకుండా తీసుకునే అవకాశం ఉందని ఓ ఉన్నతాధికారి పేర్కొన్నారు.

5న సిట్ ముందుకు వస్తా

(మొదటి పేజీ తరువాయి)

సహకరించాలని సూచించిన నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ప్రభాకర్‌రావు తరఫు న్యాయవాదులు సుప్రీంకోర్టుకు ఇప్పటికే ఈ మేరకు అండర్‌టేకింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే..! ప్రభాకర్‌రావు విచారణకు సహకరిస్తారని వారు సుప్రీంకోర్టుకు తెలిపారు. ఇక పాస్‌పోర్టును పునరుద్ధరించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో విదేశాంగ శాఖ అధికారులతో న్యాయవాదులు సంప్రదింపులు జరుపుతున్నారు. 'వన్‌టైం ఎంట్రీ' పాస్‌పోర్టుకు లైన్ క్లియర్ అయ్యే అవకాశాలున్నాయి. పాస్‌పోర్టు జారీ అయిన మూడ్రోజుల్లో ప్రభాకర్‌రావు విచారణకు హాజరు కావాలని సుప్రీంకోర్టు తన మధ్యంతర ఆదేశాల్లో పేర్కొంది. ఆ మేరకు ప్రభాకర్‌రావుపై బలవంతపు చర్యలొద్దంటూ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

కీలక మలుపునకు చాన్స్

ఈ కేసులో ఇప్పటి వరకు అరెస్టయిన మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్డీ) రాధాకిషన్‌రావు తమ వాంగ్మూలాల్లో ప్రభాకర్‌రావు చెప్పినట్లు చేశామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ప్రభాకర్‌రావు విచారణ కీలకంగా మారనుంది. ఆయన వాంగ్మూలంతో కేసు కీలక మలుపులు తిరిగే అవకాశాలున్నాయని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఇప్పటి వరకు రాజకీయ కోణం పెద్దగా బహిర్గతం కాకున్నా.. పలువురు బీఆర్ఎస్ నేతల పేర్లు ప్రముఖంగా వినిపించాయి. ఇప్పుడు ప్రభాకర్‌రావు వాంగ్మూలమిస్తే.. ఎవరి ఆదేశాలతో ఫోన్ ట్యాపింగ్ జరిగింది? హోంశాఖ కార్యదర్శి అనుమతి తీసుకున్నారా? ఒకవేళ అత్యవసరంగా ఫోన్లను ట్యాప్ చేస్తే.. ఆ తర్వాత ఏడు రోజుల్లో లిఖితపూర్వకంగా హోంశాఖ కార్యదర్శికి చెప్పారా? అనే కోణాల్లో ప్రభాకర్‌రావును విచారించే అవకాశాలున్నాయి. సిట్ దర్యాప్తులో దాదాపు 1,200 నంబర్లను ప్రణీత్‌రావు అండ్ కో ట్యాపింగ్ చేసినట్లు తేలగా.. హోంశాఖకు మాత్రం పదుల సంఖ్యలోనే ఫోన్ నంబర్లపై అభ్యర్థనలు వచ్చినట్లు సమాచారం. అయితే.. ప్రభాకర్‌రావు విచారణకు సహకరిస్తారా? అడిగిన ప్రశ్నలకు సూటిగా సమాధానమిస్తారా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

సుఖోయ్ చక్రాలపై జగన్నాథుడు



» కోల్‌కతాలోని ఆలయ రథానికి యుద్ధ విమానం టైర్లు


కోల్‌కతా, జూన్ 1: కోల్‌కతాలోని జగన్నాథ ఆలయ రథానికి సుఖోయ్ యుద్ధ విమానం కోసం తయారు చేసిన టైర్లను వాడనున్నారు. ఈ నెల 27న కోల్‌కతాలో జరిగే జగన్నాథ రథయాత్ర కోసం రథాన్ని సరికొత్తగా సిద్ధం చేశారు. దాదాపు 50 ఏళ్ల తర్వాత జగన్నాథ రథానికి బోయింగ్ విమానం టైర్ల స్థానంలో సుఖోయ్ కోసం తయారు చేసిన టైర్లు వచ్చాయి. ఇంతకు ముందు బోయింగ్ 747 విమానం టైర్లను రథానికి వాడేవారు. టైర్లను మార్చాలని 2005లో రథయాత్ర నిర్వాహక సంస్థ ఇస్కాన్ నిర్ణయించింది. కొత్త చక్రాల కోసం 20 ఏళ్లు అన్వేషించామని ఇస్కాన్ (కోల్‌కతా) ఉపాధ్యక్షుడు రాధారామ్ దాస్ వెల్లడించారు. 9టన్నుల బరువున్న రథానికి పలు కంపెనీల టైర్లు పరిశీలించినా కుదరలేదన్నారు. సుఖోయ్ టైర్ల కోసం 2018లో తయారీ సంస్థ ఎంఆర్ఎఫ్‌ను సంప్రదించడానికి ప్రయత్నించామని, గతేడాది ఆ సంస్థ ప్రతినిధులు అందుబాటులోకి వచ్చారని చెప్పారు. భారత వాయుసేనకు మాత్రమే ఈ టైర్లను సరఫరా చేస్తామని తొలుత వారు చెప్పారని వివరించారు. సమస్యను తెలియజేయడంతో టైర్లు ఇవ్వడానికి అంగీకరించారన్నారు. క్రితం నాలుగు టైర్లను డెలివరీ చేశారని, వాటి ధర 1.80 లక్షల రూపాయలని రాధారామ్ వెల్లడించారు.

ప్రియుడి లాటరీ సొమ్ము
30 కోట్లతో ప్రియురాలు పరారీ

కొత్త ప్రియుడితో వెళ్లిపోయిన మహిళ

కెనడా, జూన్ 1: కెనడాకు చెందిన ఓ వ్యక్తి లాటరీలో జాక్‌పాట్ కొట్టాడు. 3.6 మిలియన్ డాలర్లు అంటే దాదాపుగా రూ.30 కోట్లు గెలిచాడు. కానీ, ఏం లాభం.. ఆ డబ్బుతోపాటు ప్రాణంగా ప్రేమించిన ప్రియురాలిని ఒకేసారి కోల్పోయాడు. ఆ ప్రియురాలేం చనిపోలేదు.. ఉన్న ప్రియుడికి హ్యాండిచ్చి ఆ రూ.30 కోట్లు తీసుకుని కొత్త ప్రియుడితో చెక్కేసింది. దీంతో ప్రియురాలి అసలు రంగు బయటపడగా లబోదిబోమంటున్న బాధితుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. తనను మోసం చేసిన మహిళ నుంచి తన డబ్బు తనకి ఇప్పించమని కోరాడు. కెనడాలోని వెన్నిపెగ్‌కు చెందిన లారెన్స్ కాంపెల్ 2024లో కొనుగోలు చేసిన లాటరీ టికెట్‌కు రూ.30 కోట్ల ప్రైజ్‌మనీ వచ్చింది. గుర్తింపు వివరాలు, బ్యాంకు ఖాతా లేక పోవడంతో లారెన్స్. లాటరీ సంస్థ సూచనల మేరకు బహుమతి సొమ్మును ఏడాదిన్నరగా తనతో కలిసి ఉంటున్న ప్రియురాలు మెకెకే ఖాతాలో జమ చేయించాడు. ఆ తర్వాత ఆమె మొత్తం డబ్బు తీసుకుని మరొక ప్రియుడితో పరారైంది.

లోకం తీరు



ఆర్మీలో క్రమశిక్షణే ముఖ్యం.. మతం కాదు

» ఢిల్లీ హైకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జూన్ 1: సైనిక దళాలు వాటి యూనిఫారం ద్వారా కలిసి ఉంటాయే తప్ప మతం కారణంగా విడిపోవని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. విధుల్లో భాగంగా మతపర పరేడ్‌లో పాల్గొనడానికి ఇష్టపడని ఓ క్రైస్తవ ఆర్మీ అధికారిని విధుల నుంచి తొలగించడం సబబేనని పేర్కొంది. ఈ మేరకు జస్టిస్ నవీన్ చావ్లా, జస్టిస్ శైలేందర్ కౌర్‌ల ధర్మాసనం తీర్పు చెప్పింది. ఆ అధికారి విధులు నిర్వర్తించే రెజిమెంట్‌లో గురుద్వారా, మందిరం ఉన్నాయి. విధుల్లో భాగంగా జవాన్లు ప్రతివారం ఆ గుడిలోనికి వెళ్లి పూజలు చేసి, మతపర పరేడ్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. ట్రూప్ లీడర్‌గా ఆ అధికారే తన కింద పనిచేసే జవాన్లను గుడికి తీసుకెళ్లాల్సి ఉంటుంది. అయితే తాను క్రిస్టియన్‌ను అయినందున అలాంటి పూజలు చేయలేనని, తనకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఉన్నతాధికారులు ఇందుకు నిరాకరించారు. 2021 మార్చి 3న ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిని సవాలు చేస్తూ ఆయన ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. "ప్రస్తుత కేసు మతస్వేచ్ఛకు సంబంధించినది ఎంత మాత్రం కాదు. ఉన్నతాధికారి ఇచ్చిన చట్టబద్ధమైన ఆదేశాలను పాటించారా, లేదా అన్నదే ముఖ్యం" అని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది.

ఉపాధ్యాయుడు మందలించడం.. ఆత్మహత్యకు ప్రేరేపించడం కాదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జూన్ 1 : పాఠశాల ఉపాధ్యాయుడు విద్యార్థిని మందలించడం ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈమేరకు తమిళనాడులో ఒక ఉపాధ్యాయుడిపై నమోదైన కేసును కొట్టివేసింది. ఓ పాఠశాల, హాస్టల్ ఇన్‌చార్జిగా ఉన్న ఉపాధ్యాయుడు మరో విద్యార్థి ఫిర్యాదు మేరకు బాధిత విద్యార్థిని మందలించాడు. ఈ ఘటన అనంతరం అతడు గదిలోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఉపాధ్యాయుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణను చేపట్టిన మద్రాస్ హైకోర్టు ఉపాధ్యాయుడిపై ఆత్మహత్యకు ప్రేరేపించిన ఆరోపణలను కొట్టివేయడానికి నిరాకరించింది. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. జస్టిస్ అమానుల్లా, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాల బెంచ్ మద్రాసు హైకోర్టు తీర్పును పక్కన పెట్టింది.

ఫుట్‌బాల్ అభిమానుల వేడుకలు హింసాత్మకం

» పారిస్‌లో ఇద్దరి మృతి.. 200 మందికి గాయాలు

పారిస్, జూన్ 1: ఫ్రాన్స్‌లో చాంపియన్స్ లీగ్ ఫుట్‌బాల్ అభిమానుల విజయోత్సవ వేడుకలు హింసాత్మకంగా మారాయి. రాజధాని పారిస్ వీధులు శనివారం రాత్రి అల్లర్లతో అట్టుడికాయి. ఫుట్‌బాల్ చాంపియన్స్ లీగ్ ఫైనల్‌లో ఇంటర్ మిలన్ జట్టుపై పారిస్ సెయింట్ జర్మైన్(పీఎస్‌జీ) క్లబ్ గెలవడంతో వేలాది మంది అభిమానులు పారిస్‌లో సంబరాల్లో మునిగిపోయారు. ఈ నేపథ్యంలోనే ప్రత్యర్థి జట్టు అభిమానులకు పీఎస్‌జీ అభిమానులకు పలుచోట్ల వాగ్వాదాలు చోటుచేసుకుని తీవ్ర ఘర్షణలకు దారితీశాయి. ఘర్షణల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని.. 21 మంది పోలీసులు సహా 200 మందికి పైగా గాయపడ్డారని ఫ్రాన్స్ అంతర్గత వ్యవహారాల శాఖ తెలిపింది. 559 మందిని పోలీసులు అరెస్టు చేశారని పేర్కొంది.

బ్యాంకాక్ నుంచి అరుదైన పాముల తరలింపు

» శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పట్టివేత

శంషాబాద్ రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): బ్యాంకాక్ నుంచి అరుదైన విష సర్పాలు, తాబేళ్లను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని కస్టమ్స్ అధికారులు శనివారం పట్టుకున్నారు. ముంబైకి చెందిన షేక్ నిజాముద్దీన్, షేక్ అల్తాఫ్ అలీ బ్యాంకాక్ నుంచి ఇండిగో ఎయిర్‌లైన్స్ 6ఈ- 1066 విమానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. వారి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో కస్టమ్స్ అధికారులు ఇద్దరి లగేజీని తనిఖీ చేశారు. అందులో 28 రెడ్ టెయిల్డ్ బాంబూ పిట్ వైపర్లు, మూడు స్పైడర్ టెయిల్డ్ హార్న్‌డ్ వైపర్లు, 6 తాబేళ్లు ఉన్నట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేశారు.

నాసా చీఫ్ ఎంపికలో ట్రంప్ యూటర్న్

» మస్క్ సహచరుడి నియామక నిర్ణయం ఉపసంహరణ

వాషింగ్టన్, జూన్ 1: అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ (నాసా) చీఫ్ పదవికి స్పేస్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ వ్యాపార సహచరుడు, బిలియనీర్, ప్రైవేట్ వ్యోమగామి జేర్డ్ ఐజాక్‌మన్‌ను నామినేట్ చేస్తూ తాను గతంలో తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. గతంలో ఐజాక్‌మన్‌కు ఇతర సంస్థలతో ఉన్న సంబంధాలను సమగ్రంగా సమీక్షించిన తరువాత తాను ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. త్వరలోనే నూతన నామినీని ప్రకటిస్తానని ట్రంప్ తన సోషల్ మీడియా ఖాతాలో పేర్కొన్నారు. ట్రంప్ నిర్ణయంపై ఎలాన్ మస్క్ ఎక్స్ వేదికగా స్పందించారు. "నాసాకు నాయకత్వం వహించడానికి ఐజాక్‌మన్ వంటి సమర్థుడు, మంచివాడు దొరకడం చాలా అరుదు" అని పేర్కొన్నారు.

సిన్వర్‌ను చంపడానికి 30సెకన్లలో 50 బాంబులు

» వైమానిక దాడుల 3డీ వీడియోను విడుదల చేసిన ఐడీఎఫ్

గాజా, జూన్ 1: హమాస్ అగ్రనేత ముహమ్మద్ సిన్వర్‌ను హతమార్చడానికి ఇజ్రాయెల్ భారీ ప్రణాళిక రచించింది. గాజాలోని ఖాన్ యూనిస్‌లో ఉన్న యూరోపియన్ ఆస్పత్రి కింద రహస్యంగా ఏర్పాటు చేసిన హమాస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను లక్ష్యంగా చేసుకొని గత నెల 13న వైమానిక దాడులు చేసింది. ఈ సెంటర్‌పై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) కేవలం 30 సెకన్లలో 50కి పైగా బాంబులను జారవిడిచాయి. ఈ దాడుల్లో సిన్వర్‌తో పాటు రఫా బ్రిగేడ్ కమాండర్ ముహమ్మద్ షబానా కూడా మృతిచెందినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన 3డీ వీడియోను ఇజ్రాయెల్ మిలటరీ తాజాగా విడుదల చేసింది. ఇదిలా ఉండగా, దక్షిణ గాజాలో ఏర్పాటు చేసిన సహాయ పంపిణీ కేంద్రం సమీపంలో ఇజ్రాయెల్ దళాలు ఆదివారం కాల్పులు జరిపాయి. ఈ దాడిలో 31 మంది పాలస్తీనియన్లు మృతిచెందగా, 170 మందికి పైగా గాయపడ్డారు.



ఆదివారం గాజాలో ఇజ్రాయెల్ దాడి, భయంతో పారిపోతున్న ప్రజలు

రష్యా గడ్డ మీది నుంచే రష్యాపై
భీకర దాడులు



ఉక్రెయిన్ దాడిలో ధ్వంసమైన రష్యాలోని ఓ ఎయిర్‌బేస్

మొదటి పేజీ తరువాయి)

దాడులు చేసింది. వీటిల్లో బెలాయా ఎయిర్‌బేస్ ఉక్రెయిన్ సరిహద్దులకు 4 వేలకు పైగా కిలోమీటర్ల దూరంలో ఉండే ఇర్‌కుట్స్క్ రీజియన్‌లో ఉండడం గమనార్హం.! "రష్యాపై ఉక్రెయిన్ దీర్ఘశ్రేణి క్షిపణుల, డ్రోన్లను ఉపయోగించుకోవచ్చు" అంటూ పాశ్చాత్య దేశాల నుంచి అనుమతి వచ్చిన వెంటనే.. రష్యా అవాక్కయ్యేలా ఉక్రెయిన్ క్షిపణులతో కాకుండా.. ఆ దేశ గడ్డ మీద నుంచే చిన్న డ్రోన్లతో దాడులు జరపడం గమనార్హం.! ఈ దాడులను ఉక్రెయిన్ అధికారిక వార్తాసంస్థ 'ఉక్రిఇన్ఫాం'తోపాటు.. రష్యా వార్తా సంస్థ ఏఎఫ్‌పీ, ఆర్టీ కూడా నిర్ధారించాయి. ఇర్‌కుట్స్క్ గవర్నర్ ఐగర్ కోబ్జెవ్‌తోపాటు.. రియాజన్, ముర్మన్స్క్ రీజియన్ల అధికారులు కూడా ఎయిర్‌బేస్‌లపై దాడులు జరిగిన విషయాన్ని అంగీకరించారు. పైన పేర్కొన్న ఎయిర్‌బేస్‌లలో.. డ్రోన్ దాడుల తర్వాత కాలిపోతున్న రష్యన్ యుద్ధ విమానాల వీడియోలు వైరల్ అవుతున్నాయి. 'ఆపరేషన్ వెబ్'తో ఒక ఏ-50 (అవాక్స్) విమానం సహా.. టీయూ-22ఎం3, టీయూ-95 బాంబర్ విమానాలు.. మొత్తం 41 యుద్ధ విమానాలు బుగ్గిపాలయ్యాయి. బెలాయా ఎయిర్‌ఫీల్డ్ పూర్తిగా ఆహుతైంది. ఒక్కో టీయూ-22ఎం3 బాంబర్ ధర రూ.2,505 కోట్లు, టీయూ-95 బాంబర్ ధర రూ.1,361 కోట్లుగా ఉంటుందని అంచనా. దీన్ని బట్టి.. ఉక్రెయిన్ దాడుల్లో రష్యాకు వేల కోట్ల నష్టం వాటిల్లినట్లు స్పష్టమవుతోంది. ఈ ఆపరేషన్‌ను ఉక్రెయిన్ సెక్యూరిటీ సర్వీస్ నిర్వహించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి.

రష్యా ప్రతీకార దాడులు..

ఉక్రెయిన్ డ్రోన్ దాడులతో రగిలిపోయిన రష్యా.. ఆదివారం ఉదయం నుంచి ఉక్రెయిన్‌పై 83 సార్లు వేర్వేరు దాడులు జరిపింది. ఖార్కివ్, కుపియాంక్, లైమన్, టోరెట్స్క్, క్రామాటోర్స్క్, పొక్రోవ్స్క్, నోవోపావ్లివ్కాల్లో మధ్యాహ్నం నుంచి పలు విడతలుగా డ్రోన్, క్షిపణి దాడులు జరిపింది. ఈ మూడేళ్ల యుద్ధంలో



రష్యాలోని ఓ ప్రాంతంలో ఉక్రెయిన్ డ్రోన్ దాడి

రష్యా ఒక్కరోజే 472 డ్రోన్లతో దాడి చేయడం ఇదే మొదటి సారి అని ఉక్రెయిన్ వైమానిక దళం చెప్పింది. తమ గగనతల రక్షణ వ్యవస్థలు 300కు పైగా డ్రోన్లను కూల్చివేసినట్లు ప్రకటించింది. ఖార్కివ్, పిహోల్కివ్కా ప్రాంతాల్లో ఉక్రెయిన్, రష్యా పదాతిదళాల మధ్య భీకరంగా కాల్పులు జరుగుతున్నట్లు జనరల్ స్టాఫ్ వర్గాలు వెల్లడించాయి. ఆదివారం రాత్రి సుమారు అరగంటపాటు రాజధాని నగరం కీవ్‌లో సైరన్ల మోత వినిపించిందని, కుపియాంక్, స్టెపోవా, నోవోసెలివ్కా, నోవా క్రుగ్లియాకివ్కా ప్రాంతాల్లో క్షిపణి దాడులు జరిగినట్లు 'ఉక్రిఇన్ఫాం' వివరించింది. ఆదివారం ఉదయం రష్యా సరిహద్దులకు వెయ్యి కిలోమీటర్ల దూరంలో ఉండే సుమీ రీజియన్‌లోని ఒలెక్సివ్కాలోని ఉక్రెయిన్ గ్రౌండ్ ఫోర్సెస్‌పై దాడులు జరిగాయని పేర్కొంది. ఈ దాడుల్లో 12 మంది సైనికులు మృతిచెందగా.. మరో 60 మంది క్షతగాత్రులైనట్లు తెలిపింది. ఇదిలా ఉండగా, సోమవారం ఇస్తాంబుల్‌లో జరగనున్న శాంతి చర్చల కోసం తమ ప్రతినిధులు వెళ్తారని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు.

రష్యాలో కూలిన రెండు రైలు వంతెనలు

ఉక్రెయిన్ పనేనని అనుమానం

మాస్కో, జూన్ 1: రష్యాలో 24 గంటల వ్యవధిలో రెండు వంతెనలు కూలి రైలు ప్రమాదాలు జరగడం అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. ఆదివారం గూడ్సు రైలు ప్రయాణిస్తున్న సమయంలోనే ఓ వంతెన కూలింది. శనివారం కూడా ప్రయాణికుల రైలు వెళ్తున్న సమయంలోనే మరో వంతెన కుప్పకూలింది. ఇందుకు ఉక్రెయినే కారణమన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉక్రెయిన్‌కు సరిహద్దులో ఉన్న కుర్స్క్ ప్రాంతంలో గూడ్సు రైలు ప్రమాదం జరిగింది. రైలులోని కొంత భాగం కిందనున్న రోడ్డుపై పడింది. డ్రైవర్ గాయపడ్డట్టు సమాచారం అందింది. పేలుడు కారణంగానే ఈ బ్రిడ్జి కూలినట్టు రష్యాకు చెందిన ఇంటర్‌ఫ్యాక్స్ ఏజెన్సీ తెలిపింది. శనివారం రాత్రి బ్రైన్స్క్ ప్రాంతంలో కూడా వంతెన కుప్పకూలడంతో అదే సమయంలో దానిపై నుంచి వెళ్తున్న మాస్కో- క్లిమోవ్ రైలు ప్రమాదానికి గురయి పట్టాలు తప్పింది. ఈ దుర్ఘటనలో ఏడుగురు మరణించగా, 69 మంది గాయపడ్డారు. మరణించిన వారిలో రైలు డ్రైవరు కూడా ఉన్నారు. చీకట్లో ప్రయాణికులు ఒకరినొకరు సహాయం చేసుకుంటున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఉక్రెయిన్ ఉగ్రవాదులకు నిలయంగా మారిందని, అందుకే వంతెనలను పేల్చివేస్తోందని రష్యాకు చెందిన సీనియర్ సెనేటర్ ఒకరు ఆరోపించారు.

దాడులకు ఉక్రెయిన్ 18 నెలల కార్యాచరణ

ఉక్రెయిన్ వద్ద అధునాతన దీర్ఘశ్రేణి క్షిపణులున్నాయి. అయితే.. వాటిని రష్యా భూభాగంపై ప్రయోగించకూడదని పాశ్చాత్య దేశాలు ముందుగానే షరతు విధించాయి. దీంతో.. రష్యా గడ్డ మీది నుంచే ఆ దేశాన్ని దెబ్బతీయాలని ఎస్‌బీయూ నిర్ణయించింది. 18 నెలల క్రితమే 'ఆపరేషన్ వెబ్'కు శ్రీకారం చుట్టింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు/సుప్రీం కమాండర్-ఇన్-చీఫ్ జెలెన్‌స్కీ ఈ ఆపరేషన్‌ను స్వయంగా పర్యవేక్షిస్తూ వచ్చారు. వేర్వేరు దేశాల నుంచి రష్యాకు వెళ్లే ట్రక్కులనే డ్రోన్లను చేరవేయడానికి ఎస్‌బీయూ పథకం పన్నింది. రష్యాలో.. ఉక్రెయిన్‌కు సుదూరంగా ఉండే ఎయిర్‌బేస్‌ల వరకు వాటిని తరలించింది. రష్యా ఫెడరల్ భూభాగంలో ట్రక్కులపైన రిమోట్‌తో తెరుచుకునే చెక్క పెట్టెల్లో.. ఇళ్ల పైకప్పులపైన మోహరించింది. అందుకే గతంలో ఉక్రెయిన్ సైన్యం 'లాజిస్టిక్ కోణంలో అత్యంత క్లిష్టమైన ఆపరేషన్‌ను నిర్వహిస్తాం' అని ప్రకటించింది. ఎఫ్‌పీవీ డ్రోన్లు సైజులో చిన్నగా ఉన్నా.. దాడి జరిగే వరకు టార్గెట్ల వీడియోను స్పష్టంగా చిత్రీకరిస్తాయి. ఉక్రెయిన్ ఎస్‌బీయూ కమాండ్ కంట్రోల్‌కు సమాచారాన్ని చేరవేస్తాయి. కమాండ్ కంట్రోల్ నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా దాడులు జరపడమేకాకుండా.. టార్గెట్‌పై ఆత్మాహుతి దాడి చేస్తాయి. ఆదివారం రిమోట్ ద్వారా డ్రోన్ల పైకప్పులను తొలగించిన ఎస్‌బీయూ.. ఏకకాలంలో వాటిని ప్రయోగించి, రష్యాకు చెందిన నాలుగు వైమానిక స్థావరాలకు కోలుకోలేని దెబ్బ కొట్టింది.

పెళ్లాడి, గర్భవతిని చేసి
ముఖం చాటేసి

» వీసా ఇప్పిస్తానని హైదరాబాద్ యువతిని యూఏఈలో మోసం చేసిన పాక్ వ్యక్తి

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

విజిట్ వీసాపై యూఏఈ వెళ్లిన హైదరాబాద్ యువతిపై అక్కడ పాకిస్థాన్ యువకుడు కన్నేశాడు. ప్రేమ పేరుతో నమ్మించి, పెళ్లి చేసుకుని ఆమెను గర్భవతిని చేశాడు. వీసా గడువు ముగియడంతో ఆమెను హైదరాబాద్‌కు పంపి అతడు ముఖం చాటేశాడు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని దోమలగూడకు చెందిన 22 ఏళ్ల యువతి గత ఏడాది విజిట్ వీసాపై యూఏఈకి వచ్చింది. అబుధాబీలోని సూపర్ మార్కెట్‌లో పని చేసే ఆమెకు పాకిస్థాన్ యువకుడు(30) పరిచయమయ్యాడు. ఆ పరిచయం ప్రేమగా మారింది. తల్లిదండ్రులు లేని ఆమె పేదరికాన్ని ఆసరాగా చేసుకున్న యువకుడు రెగ్యులర్ వీసాను ఇప్పిస్తానని మాయ మాటలు చెప్పి ఆమెను అబుధాబీ న్యాయ స్థానంలో పెళ్లి చేసుకున్నాడు. కొన్ని నెలల కాపురం అనంతరం ఆమె గర్భం దాల్చింది. అయితే, ఆమె విజిట్ వీసాను రెన్యువల్ చేయకుండా యువకుడు తప్పుదారి పట్టించాడు. తాను శాశ్వత వీసా పంపిస్తానని మభ్యపెట్టి ఆమెను హైదరాబాద్‌కు పంపించాడు. నెలలు గడుస్తున్నా యువతికి వీసా రాలేదు. యువకుడిని గట్టిగా నిలదీయడంతో ఫోన్ స్విచాఫ్ చేశాడు. దీంతో ఆమె మోసపోయానని గ్రహించింది. అదే సమయంలో తాను గర్భవతినని తెలుసుకుని ఆందోళనకు గురైంది. శతవిధాలుగా ప్రయత్నాలు చేసిన అనంతరం యువకుడు అందుబాటులోకి వచ్చాడు. విజిట్ వీసా గడువు ముగిసిన తర్వాత వెళ్లినందున మళ్లీ యూఏఈకి రావడానికి నిబంధనలు ఒప్పుకోవని, పొరుగున ఉన్న ఖతార్‌కు వస్తే తాను కలుస్తానని చెప్పాడు. దీంతో ఆమె హైదరాబాద్ నుండి రెండు రోజుల వీసాపై ఖతార్ వచ్చింది. యువకుడికి ఫోన్ చేయగా స్విచాఫ్ రావడంతో మళ్లీ మోసపోయానని గ్రహించింది. సహాయం కోసం భారత ఎంబసీకి పరిగెత్తింది. అధికారుల సూచనతో ఆ యువతి శుక్రవారం హైదరాబాద్‌కు వెళ్లిపోయింది.

'సోషల్' ఇన్‌ఫ్లుయెన్సర్
శర్మిష్ఠ పనోలీ అరెస్టు



» 'ఆపరేషన్ సిందూర్'పై స్పందించని బాలీవుడ్ నటులపై అనుచిత పోస్టు

» తీవ్ర విమర్శలతో డిలీట్ చేసి క్షమాపణ

» అయినా ఆమెపై కోల్‌కతా పోలీసుల కేసు

» గురుగ్రామ్‌లో అదుపులోకి..

గురుగ్రామ్/కోల్‌కతా, జూన్ 1: సోషల్ మీడియా (ఇన్‌స్టాగ్రామ్) ఇన్‌ఫ్లుయెన్సర్ శర్మిష్ఠ పనోలీ(22)ని కోల్‌కతా పోలీసులు అరెస్టుచేశారు. పాకిస్థాన్, దాని ప్రేరిత ఉగ్రవాదులపై భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై నోరువిప్పని బాలీవుడ్ నటులపైన, మహమ్మద్ ప్రవక్తపైన ఆమె గత నెల 14న అనుచితంగా పోస్టు పెట్టారు. పాక్ పట్ల మెతక వైఖరి అవలంబిస్తున్నారని బాలీవుడ్ సెలబ్రిటీలు, యూట్యూబర్ రణవీర్ అల్లాబాదియాపై అందులో దూషించారు. దీనిపై తీవ్ర విమర్శలు రావడంతో ఆ పోస్టుతోపాటు తన ఇన్‌స్టా అకౌంట్‌లోని కంటెంట్ మొత్తాన్నీ మర్నాడే ఆమె డిలీట్ చేశారు. అయినా కోల్‌కతా పోలీసులు ఆమెపై కేసు నమోదుచేశారు. సమాజంలో వివిధ వర్గాల మధ్య శత్రుత్వాన్ని పెంచడం., మత భావనలను రెచ్చగొట్టడం.. ఉద్దేశపూర్వకంగా అవమానించడం.. శాంతికి భంగం కలిగించడం వంటి అభియోగాలు మోపారు. శుక్రవారం రాత్రి హరియాణాలోని గురుగ్రామ్‌లో అరెస్టు చేశారు. ట్రాన్సిట్ రిమాండ్‌పై ఆమెను శనివారం కోల్‌కతా కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం ఆమెకు రెండు వారాలు అంటే జూన్ 13 దాకా జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. పుణే న్యాయ విశ్వవిద్యాలయంలో నాలుగో సంవత్సరం 'లా' విద్యార్థిని అయిన శర్మిష్ఠకు 'ఎక్స్', ఇన్‌స్టాగ్రామ్‌లో 1,75,000 మంది ఫాలోవర్లు ఉన్నారు. ఆమె అరెస్టుపై పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మమతా బెనర్జీ ప్రభుత్వం, కోల్‌కతా పోలీసులపై ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ ఎంపీ, బాలీవుడ్ నటి కంగనా రనౌత్, బీజేపీ ఐటీ విభాగం ఇన్‌చార్జి అమిత్ మాలవీయ తదితరులు తీవ్ర విమర్శలు చేశారు. అయితే అరెస్టులో తాము చట్టప్రక్రియను పాటించామని కోల్‌కతా పోలీసులు ఆదివారం వివరణ ఇచ్చారు. శర్మిష్ఠకు నోటీసులివ్వడానికి పలు ప్రయత్నాలు చేశామని.. సంబంధిత కోర్టు అరెస్టు వారెంటు జారీచేయడంతో గురుగ్రామ్‌లో చట్టబద్ధంగానే ఆమెను అరెస్టుచేశామని.. అక్కడ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచామని.. న్యాయాధికారి ట్రాన్సిట్ రిమాండ్ మంజూరు చేశారని వివరించారు. శర్మిష్ఠ పనోలీ అరెస్టును పవన్ కల్యాణ్ ఆక్షేపించారు. 'శర్మిష్ఠ తన పోస్టును డిలీట్ చేసినా బెంగాల్ పోలీసులు వేగంగా స్పందించి చర్య తీసుకున్నారు. మరి సనాతన ధర్మాన్ని అవహేళన చేసి కోట్ల మంది మనసులను టీఎంసీ ఎంపీలు గాయపరచినప్పుడు వారు ఏం చేశారు? మన ధర్మాన్ని కలుషిత ధర్మమని (మమతా బెనర్జీ) వ్యాఖ్యానించినప్పుడు ఇంత గగ్గోలు పెట్టలేదేం? వాళ్ల క్షమాపణలేవీ? సత్వర అరెస్టులేవీ' అని నిలదీశారు.

సిందూర్‌పై స్వీయ పొగడ్తలు అక్కర్లేదు

ఆపరేషన్ సిందూర్‌పై స్వీయ పొగడ్తలు అక్కర్లేదని ప్రధాని మోదీని ఉద్దేశించి ఏఐసీసీ చీఫ్ ఖర్గే వ్యాఖ్యానించారు. దీన్ని రాజకీయాలకోసం వాడుకోవడం తగదని, దీనిపై ఎన్నికల ప్రసంగాలు ఆపాలన్నారు. దేశాన్ని పక్కదోవ పట్టించడం మాని తక్షణమే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. పాకిస్థాన్ కూడా పార్లమెంట్ సమావేశాలు నిర్వహించిందని ఖర్గే గుర్తు చేశారు. ఎప్పుడేం మాట్లాడాలో తమకు తెలుసని, జాతీయ భద్రతకు సంబంధించిన విషయాలు వచ్చినప్పుడు అంతా ఒకే తాటిపై నిలిచి ప్రత్యర్థులను ఓడించాలన్నారు. తాజా పరిస్థితులపై కార్గిల్ రివ్యూ కమిటీ తరహాలో రక్షణ సన్నద్ధతపై స్వతంత్ర నిపుణుల కమిటీతో సమీక్ష జరగాల్సిందే అన్నారు.

ఆపరేషన్ సిందూర్‌పై వ్యాసరచన పోటీలు

ఎంట్రీలను ఆహ్వానించిన రక్షణశాఖ.. ముగ్గురు విజేతలకు రూ.10 వేల నగదు బహుమతి

న్యూఢిల్లీ, జూన్ 1: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌పై రక్షణశాఖ వ్యాసరచన పోటీలు నిర్వహిస్తోంది. ఈ నెల ఒకటో తేదీ (ఆదివారం) నుంచి 30 వరకూ ఆసక్తి గల వారు ఈ వ్యాస రచన పోటీల్లో పాల్గొనవచ్చు. ఈ పోటీల్లో విజేతలైన ముగ్గురికి రూ.10 వేల చొప్పున నగదు బహుమతితోపాటు వారికి ఆగస్టు 15న ఎర్రకోట వద్ద జరిగే 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆహ్వానం ఉంటుంది. 'ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ విధానాన్ని పునర్నిర్వచించిన ఆపరేషన్ సిందూర్' అనే పేరుతో ప్రతి ఒక్కరూ ఒక్క ఎంట్రీ మాత్రమే పంపాల్సి ఉంటుందన్న రక్షణశాఖ.. హిందీ లేదా ఇంగ్లీష్‌లో మాత్రమే వ్యాసం రాయాల్సి ఉంటుందని ఎక్స్ వేదికగా పోస్ట్ చేసింది. పోటీదారులు తమ ఎంట్రీలను రక్షణ మంత్రిత్వశాఖ లేదా మైగవ్ ఇండియా వెబ్‌సైట్‌లకు పంపాల్సి ఉంటుంది.

ప్రతీ పదంపై నిఘా..
5 నిమిషాలకో స్క్రీన్‌షాట్



» ప్రజలు ఏ యాప్ చూస్తున్నదీ, ఏమేం చేస్తున్నదీ అధికారులకు తెలిసిపోయేలా రహస్య ఏర్పాట్లు

» ఉత్తర కొరియా నుంచి స్మగుల్ అయిన స్మార్ట్‌ఫోన్‌ను పరిశీలించి బీబీసీ కథనం

న్యూఢిల్లీ, జూన్ 1: మన ఫోన్‌లో ఏదైనా మన వ్యక్తిగతం.. సోషల్ మీడియా మొదలు అంతర్జాతీయ వెబ్‌సైట్ల దాకా అందులో ఏం చూసేదీ మనిష్టం. కానీ ఉత్తరకొరియాలో మాత్రం ఫోన్ అంటే ఓ నిఘా సాధనం. ఫోన్‌లో ఏం చూస్తున్నదీ, ఏం చేస్తున్నదీ క్షణక్షణం ప్రభుత్వానికి తెలిసిపోతుంది. చివరికి ఫోన్‌లో టైప్ చేసే పదాలపైనా నిఘా ఉంటుంది. ఆ పదాలు ఆటోమేటిగ్గా వేరే పదాల కింద మారిపోతాయి. ఉత్తరకొరియా నుంచి బయటికి స్మగ్లింగ్ చేసిన ఒక స్మార్ట్‌ఫోన్‌ను క్షుణ్నంగా పరిశీలించిన బీబీసీ ఆ వివరాలతో ఓ కథనం ప్రచురించింది. ఉత్తర కొరియాలో స్మార్ట్‌ఫోన్లన్నీ ప్రత్యేకంగా ప్రోగ్రామింగ్ చేసి ఉంటాయి. సమాచారం ఏదైనా ఆటోమేటిగ్గా సెన్సార్ అవుతుంది. ముఖ్యంగా దక్షిణ కొరియాకు చెందిన భాష, సంస్కృతి, ఇతర అంశాలపై నిషేధం ఉంటుంది. ఉదాహరణకు ఫోన్‌లో దక్షిణ కొరియా అని టైప్ చేస్తే.. దానంతట అదే 'పప్పెట్ స్టేట్ (తోలుబొమ్మ దేశం)' అని మారిపోతుంది. అమెరికా చెప్పినట్లల్లా ఆడే పప్పెట్ స్టేట్ దక్షిణ కొరియా అని ఉత్తరకొరియా నియంతృత్వ పాలకుడు కిమ్‌జోంగ్ ఉన్ తరచూ విమర్శిస్తుంటారు. ఇక దక్షిణ కొరియాలో మగ స్నేహితులను పిలిచే 'ఒప్పా' అనే పదం టైప్ చేస్తే.. 'కామ్రేడ్'గా మారిపోతుంది. 'తోటివారిని పిలిచేందుకు కేవలం ఈ పదం మాత్రమే వాడాలి' అనే హెచ్చరిక కూడా కనిపిస్తుంది. అంతేకాదు.. ప్రతి ఐదు నిమిషాలకోసారి ఫోన్ దానంతట అదే స్క్రీన్‌షాట్ తీసుకుని, రహస్య ఫోల్డర్‌లో సేవ్ చేస్తుంది. ఫోన్ వాడేవారు వాటిని చూడలేరు. కేవలం ప్రభుత్వ అధికారులకు మాత్రమే యాక్సెస్ ఉంటుంది.

ప్రభుత్వం అనుమతించిన సమాచారమే దిక్కు...

ఉత్తర కొరియాలో ఫోన్లతోపాటు రేడియోలు, టీవీలు కూడా కేవలం ప్రభుత్వం అనుమతించిన కంటెంట్ మాత్రమే అందేలా ప్రోగ్రామింగ్ చేసి ఉంటాయి. ఫోన్లలో పరికరాలను మార్చడానికి వీలు లేకుండా సీల్ చేస్తారు. దీనిని మార్చడానికిగానీ, విదేశాల కంటెంట్‌ను చూడటానికి గానీ ప్రయత్నిస్తే తీవ్రమైన నేరంగా పరిగణిస్తారు. దక్షిణ కొరియాకు చెందిన కె-పాప్ వీడియోలు, సినిమాలను చూసినందుకు, ఇతరులకు పంపినందుకు ఇటీవల ఓ 22 ఏళ్ల యువకుడిని అధికారులు బహిరంగంగా కాల్చిచంపారు. ఈ నియంత్రణలతో ఉత్తర కొరియా ప్రజలకు బయటి ప్రపంచంలో ఏం జరుగుతోందో, పరిస్థితులు ఎలా ఉన్నాయో తెలిసే అవకాశం ఉండదు.

రైతులకు నాణ్యమైన విత్తనాల పంపిణీ

» నేడు 40వేల మంది రైతులకు విత్తన కిట్లు: తుమ్మల



హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): విత్తన స్వయం సమృద్ధే లక్ష్యంగా రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా "గ్రామ గ్రామానికి వ్యవసాయ విశ్వవిద్యాలయ నాణ్యమైన విత్తన పంపిణీ" కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం రాష్ట్రంలోని 11వేల గ్రామాల్లో.. 40 వేల మంది రైతులకు విత్తన కిట్లు అందించనున్నట్లు వెల్లడించారు. జిల్లాల్లో జరిగే రాష్ట్ర అవతరణ వేడుకల్లో ఎంపిక చేసిన అభ్యుదయ రైతులకు ఐదు ప్రధాన పంటలకు సంబంధించిన (వరి, కంది, పెసర, మినుము, జొన్న) నాణ్యమైన విత్తనాల కిట్లను అందిస్తారని పేర్కొన్నారు. ఎంపిక చేసిన మిగతా అభ్యుదయ రైతులకు జూన్ 3న ఆయా గ్రామాల్లో స్థానిక వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో విత్తన కిట్లను పంపిణీ చేస్తారని ఆయన తెలిపారు.

ఆర్ అండ్ బీలో 72 మందికి పదోన్నతులు

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రోడ్లు భవనాల శాఖలో పదోన్నతుల పరంపర కొనసాగుతోంది. తాజాగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ)లకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)లుగా పదోన్నతి కల్పించింది. సంబంధిత ఫైలుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం తెలిపారు. ఈ మేరకు త్వరలో ఉత్తర్వులు జారీకానున్నాయి. డీఈఈల నుంచి ఈఈలుగా 72 మందికి పదోన్నతి కలగనుంది. ప్రస్తుతం శాఖలో దాదాపు 60 వరకు ఈ స్థాయి హోదా పోస్టులు ఖాళీగా ఉన్నాయని, మరో 4-5గురు త్వరలో పదవీ విరమణ చేయనున్నట్టు సమాచారం. ఇప్పటివరకు 219 మందికి పదోన్నతులు లభించగా.. వరుసగా శాఖలో పదోన్నతులు వస్తుండడంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణలో గణనీయంగా తగ్గిన సైబర్ నేరాలు

» సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ షిఖా గోయల్

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గత ఏడాది మొదటి నాలుగు నెలలతో పోలిస్తే ఈ ఏడాది సైబర్ నేరాలు గణనీయంగా తగ్గాయని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ షిఖా గోయల్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణలో జనవరి నుంచి ఏప్రిల్ వరకు 11% సైబర్ నేరాలను తగ్గించగలిగామని, అదే సమయంలో దేశవ్యాప్తంగా సైబర్ నేరాల్లో 28% పెరుగుదల నమోదయిందని ఆమె వివరించారు. దేశవ్యాప్తంగా సైబర్ నేరాల వల్ల ఆర్థిక నష్టాలు 12% పెరగగా, తెలంగాణలో 19% తగ్గాయని ఆమె తెలిపారు. 2024లో 13% ఉన్న రికవరీ రేటు ఈ ఏడాది 16 శాతానికి చేరిందని ఆమె వివరించారు.

గ్రామీణ యువతకు టీ ఫైబర్ వ్యాపార అవకాశం

» సర్వీస్ డెలివరీ పార్టనర్లుగా నియమితులయ్యే మార్గం

హైదరాబాద్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): టీ ఫైబర్ డెలివరీ పార్టనర్లుగా గ్రామీణ యువత నమోదు చేసుకోవడానికి ఈనెల 10వ తేదీ వరకు అవకాశముందని టీ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. టీ ఫైబర్ ద్వారా టెలికాం నెట్‌వర్క్, ఎక్విప్‌మెంట్ నిర్వహణ, భద్రత, రక్షణ, కేబుల్ సేవలు, ఐపీ టీవీ, బ్రాడ్ బ్యాండ్ ఆధారిత సేవలను రెవెన్యూ షేరింగ్ ప్రాతిపదికన ప్రతి ఇంటికి అందించడానికి సర్వీస్ డెలివరీ పార్టనర్లను నియమిస్తున్నట్లు పేర్కొంది. వీరికి అవసరమైన పరికరాల కొనుగోలు కోసం తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా రూ.4 లక్షల రుణం మంజూరు అవుతుందని వివరించింది. ఇతర వివరాలకు టీ ఫైబర్ కార్యాలయంలో సంప్రదించాలని ఒక ప్రకటనలో కోరింది.

ఫార్చ్యూనర్ కారులో వచ్చి.. ఏటీఎంలో చోరీ

» గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి రూ.19.66 లక్షల అపహరణ

» షార్ట్ సర్క్యూట్‌గా నమ్మించేందుకు ఏటీఎంకు నిప్పు

హుజూర్‌నగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని ఓ ఏటీఎం కేంద్రం నుంచి గుర్తుతెలియని వ్యక్తులు రూ.19.66 లక్షలు అపహరించిన ఘటన స్థానికంగా సంచలనంగా మారింది. లింగగిరి రోడ్డులోని ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రానికి ఆదివారం తెల్లవారుజామున ఫార్చ్యూనర్ కారులో వచ్చిన ఇద్దరు యువకులు గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను కట్ చేసి కేవలం 15 నిమిషాల వ్యవధిలోనే నగదు చోరీకి పాల్పడ్డారు. అనంతరం ఏటీఎంకు నిప్పు పెట్టి పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. షార్ట్ సర్క్యూట్ జరిగిందని నమ్మించడం కోసమే ఏటీఎంకు నిప్పు పెట్టినట్లు అనుమానిస్తున్నారు. ఘటనకు ముందురోజే ఏటీఎంలో రూ.20 లక్షల నగదును నింపినట్లు ఏటీఎం ఏజెన్సీ నిర్వాహకుడు గంగాధరమూర్తి పోలీసులకు తెలిపారు.

కోర్టులో ఉద్యోగాలిప్పిస్తానంటూ మోసం చేసిన మాయలేడి అరెస్టు

» న్యాయవాదిని, జడ్జినంటూ బురిడీ

» నిరుద్యోగుల నుంచి కోట్ల రూపాయల వసూలు

» నిందితురాలిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

యూసుఫ్‌గూడ/కరీంనగర్ క్రైం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తాను న్యాయవాదిని, జడ్జీనని చెప్పుకుంటూ.. కోర్టుల్లో ఉద్యోగాలిప్పిస్తానంటూ నిరుద్యోగులకు బురిడీ కొట్టించిన మాయలేడి బండారం బయటపడింది. సుమారు 100 మంది నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు తెలిసింది. బాధితుల ఫిర్యాదుతో ఆమెను హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని మధురానగర్ పోలీసులు శనివారం రాత్రి (మే 31న) కరీంగనగర్‌లో ఆమెను అరెస్టు చేశారు. సీఐ ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన బితుకు ప్రసన్న రెడ్డి న్యాయవాది. ఆమె ప్రస్తుతం అంబర్‌పేటలో ఉంటోంది. తాను న్యాయవాదిని, జడ్జీని అని చెప్పుకుంటూ తన భర్తతో కలిసి అక్రమ దందాకు తెరతీసింది. 2022లో హైకోర్టులో ఉద్యోగ నియమకాల కోసం విడుదలయిన కోటిఫికేషన్‌ను ప్రసన్న రెడ్డి ఆయుధంగా మలుచుకుంది. డబ్బులిస్తే హైకోర్టులో ఉద్యోగాలిప్పిస్తానంటూ పరిచయస్తుల దగ్గర నమ్మబలికింది. దాంతో వెంగళ్‌రావు నగర్‌కు చెందిన ఎస్. జీవన్.. ప్రసన్న రెడ్డిని కలిశాడు. రూ.15 లక్షలు ఇస్తే కోర్టులో రికార్డు అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పింది. ఈ క్రమంలో జీవన్ ఆమెకు రూ. 6.5 లక్షలు ఇచ్చాడు. అనుమానం రాకుండా కోర్టులో నల్లకోటుతో ఉన్న ఫొటోలను అతనికి పంపేది. మిగతా రూ.8.5 లక్షలు వసూలు చేసేందుకు శైలజారెడ్డి అనే మహిళను హైకోర్టు న్యాయమూర్తిగా పరిచయం చేసింది. ఆమె తన అసిస్టెంట్‌గా ఫిరోజ్ ఖాన్‌ను పరిచయం చేసి డబ్బులు వసూలు చేయించేది. కాలం గడుస్తున్నా ఉద్యోగం రాకపోవడంతో జీవన్‌లో అనుమానం మొదలైంది. ఈ క్రమంలో రవి అనే వ్యక్తి ప్రసన్న రెడ్డి చేతుల్లో మోసపోయడని, ఉద్యోగం కోసం ఆమెకు రూ.4.50 లక్షలు ఇచ్చాడని జీవన్‌కు తెలిసింది. మోసపోయామని తెలుసుకున్న ఇద్దరు బాధితులు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. కరీంనగర్‌లోని శ్రీ విల్లాస్‌లో ఉన్న ప్రసన్న రెడ్డిని శనివారం రాత్రి అరెస్టు చేయగా.. ఆమెను రిమాండ్‌కు తరలించారు. పోలీసులు ఆమె భర్తనూ అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. ప్రసన్న రెడ్డిపై గతంలో బంజారహిల్స్, మలక్‌పేట, చిక్కడపల్లి, జగిత్యాల, మల్యాల పోలీస్‌స్టేషన్లలోనూ కేసులు నమోదయినట్లు తెలిసింది.

జడ్జినంటూ వేములవాడ ఆలయంలో ప్రత్యేక దర్శనం

తాను హైకోర్టు జడ్జినంటూ వేములవాడ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌కు చెప్పి తనకు భద్రత కల్పించాలని ప్రసన్న రెడ్డి కోరింది. పోలీస్ ప్రొటెక్షన్, ప్రొటోకాల్‌తో దర్జాగా రాజన్న దేవాలయంలో ప్రత్యేక దర్శనం చేసుకుంది. ఓ మహిళ భర్తతో గొడవ పడి దేవాలయానికి వస్తే.. ఆ మహిళను ప్రసన్న రెడ్డి అక్కడే పరిచయం చేసుకుంది. విడాకులు ఇప్పిస్తానని, హైకోర్టులో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఆమె నుంచి రూ.3 లక్షలు కాజేసింది. అంతే కాక ఆమె ద్వారా ఆమె బంధువులు 10 మందినీ నమ్మించి ఒక్కొక్కరి వద్ద రూ.3 లక్షలు వసూలు చేసినట్లు తెలిసింది. ప్రసన్నరెడ్డి చేతిలో మోసపోయిన వారిలో నిజామాబాద్, కామారెడ్డి ప్రాంతాలకు చెందిన వారు ఎక్కువగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

ఉద్యోగులకు ఏం చేద్దాం!

(మొదటిపేజీ తరువాయి)

పంటల సాగు సన్నద్ధత, రాజీవ్ యువ వికాసం అంశాలపై మంత్రులు అందించిన నివేదికపై చర్చించారు. ఉద్యోగుల సమస్యలపై నియమించిన కమిటీకి సంబంధించి అధికారులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఇప్పటికే నివేదిక అందించారు. ఆ నివేదికలోని అంశాలతోపాటు ప్రభుత్వ ఉద్యోగుల సంఘాల ప్రతినిధులతో భేటీ సందర్భంగా వారు ప్రస్తావించిన డిమాండ్లనూ భట్టివిక్రమార్క.. సీఎంకు, మంత్రులకు వివరించారు. దీనిపై ఈ నెల 5న జరిగే క్యాబినెట్ భేటీలో చర్చించాలని, సమస్యల పరిష్కారంపై ఎలా ముందుకెళ్లాలో నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. కాగా, ప్రభుత్వ ఉద్యోగుల అన్ని డిమాండ్లపై ఒక రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేయాలని సర్కారు భావిస్తున్నట్టు తెలిసింది. ఈ విషయంలో ప్రభుత్వం రెండు రకాల ఆలోచనలతో ఉన్నట్టు సమాచారం.

మరింత ఆర్థిక భారం పడకుండా..

ఇప్పటికే సర్కారుపై ఆర్థికభారం ఉండడం, దీనికి తోడు ఈ ఒక్క ఏడాదే 8వేల మందికి పైగా ఉద్యోగులు రిటైర్ కానుండడంతో.. మరింత భారం పడకుండా ఉద్యోగుల పదవీ విరమణ వయసును ఏడాదిపాటు పెంచితే మంచిదని కొందరు మంత్రులు సూచించినట్లు తెలిసింది. దీంతో పాటు ఉద్యోగుల సాధారణ బదిలీలు చేపట్టడం ప్రభుత్వం మొదటి ఆలోచనగా ఉంది. ఇక రెండోది.. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల డీఏల్లో ఎన్నింటిని ప్రకటించాలనే దానిపై మంత్రివర్గ సమావేశంలో కచ్చితమైన నిర్ణయం తీసుకోనున్నారు. ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలపై క్యాబినెట్ భేటీలో నిర్ణయం తీసుకోవాలనే అంశంపై చర్చించారు. కాగా, సమావేశంలో అన్ని అంశాలపై మాట్లాడుతున్న సమయంలో ప్రభుత్వ పనితీరు, క్షేత్రస్థాయిలో ప్రభుత్వం పట్ల ఉన్న అభిప్రాయాలను కొందరు మంత్రులు ప్రస్తావించినట్లు తెలిసింది. రైతుభరోసా పథకం గ్రామాల్లో లక్షల మందికి అమలవుతోందని, అయితే దీనిని మరింత పకడ్బందీగా అమలు చేస్తే రైతుల్లో ప్రభుత్వం పట్ల మరింత సానుకూల స్పందన వస్తుందని వారు అభిప్రాయపడినట్లు సమాచారం. కాగా, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలన్నింటినీ క్షేత్రస్థాయికి చేరేలా చర్యలు తీసుకోవాలనే అంశంపైనా సమావేశంలో చర్చించారు. గ్రామ గ్రామానికి ఈ పథకాలను తెలిపేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.



నీలం సంజీవరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

5న మంత్రివర్గ సమావేశం..

5న మంత్రివర్గ సమావేశం నిర్వహించి కీలక అంశాలపై చర్చించాలని మంత్రుల భేటీలో నిర్ణయించారు. గత నెల జిల్లాల్లో పర్యటించిన మంత్రులు.. అధికారులతో నిర్వహించిన సమీక్షలకు సంబంధించి తయారుచేసిన నివేదికలపై ఈ సమావేశంలో చర్చించారు. రాజీవ్ యువ వికాసం పథకానికి ఊహించిన దానికంటే ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని, అనర్హులకు లబ్ధి చేకూరకుండా చూడాలంటూ ఫిర్యాదులూ వచ్చాయని మంత్రులు.. సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పెద్దసంఖ్యలో వచ్చిన దరఖాస్తుల స్క్రీనింగ్ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో పూర్తిస్థాయి పరిశీలన తరువాతే అర్హుల జాబితాలను ప్రకటించాలని నిర్ణయించారు. మరింత లోతుగా విశ్లేషించి లబ్ధిదారులను గుర్తించాలన్నారు. ఈ అంశంపై క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఇక యాసంగిలో పండిన ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను సమర్థంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఇతర మంత్రులు అభినందించారు. రాబోయే వానాకాలం నేపథ్యంలో వ్యవసాయం, నీటిపారుదల ప్రాజెక్టులు, తాగునీటి అవసరాలపైనా చర్చించారు. ప్రధానంగా హైదరాబాద్ నగర ట్రాఫిక్, వర్షాల సమయంలో ప్రబలే వ్యాధుల అంశాలనూ ప్రస్తావించారు. వీటన్నింటిపై రోడ్ మ్యాప్ రూపొందించాలని నిర్ణయించారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న 'తెలంగాణ రైజింగ్-2047'ను సాధించే దిశగా ముందుకెళ్లాలని, అందుకోసం దానిని ప్రజా ఉద్యమంగా మార్చాలని సమావేశంలో నిర్ణయించినట్టు సీఎం కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

ఎన్‌డీఎస్‌ఏ నివేదికకు ఆమోదం..

కాళేశ్వరం, దానిపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) ఇచ్చిన రిపోర్టుపై సీఎం, మంత్రుల సమావేశంలో చర్చించారు. ఈ నెల 5న జరగనున్న క్యాబినెట్ భేటీలో ఎన్‌డీఎస్‌ఏ నివేదికను ఆమోదించాలని నిర్ణయించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. నిర్మాణ సంస్థపై చర్యలకు సిఫారసు చేయాలనే అంశంపైనా చర్చ జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్‌ఎస్ పార్టీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని నిర్ణయించిన నేపథ్యంలో.. ఆ అంశంపైనా చర్చించారు. ఇక బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ తరఫున నిరసన గళం బలంగా వినిపించాలని కూడా నిర్ణయించినట్టు తెలిసింది. ఏపీ, తెలంగాణ నీటి కేటాయింపుల విషయంలో రాజీ పడాల్సిన అవసరం లేదని, రాష్ట్ర రాజకీయాల్లో ఇది చాలా సున్నితమైన అంశమని అభిప్రాయపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కూడా సమావేశంలో చర్చకు వచ్చింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావు ఈ నెల 5న విచారణకు హాజరు కానున్న నేపథ్యంలో.. ఆ తరువాత జరిగే పరిణామాలపైనా చర్చ జరిగినట్లు తెలిసింది. కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఇటీవల ఎమ్మెల్యేలు, మంత్రులతో పాటు ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాలు తీసుకుంటున్న క్రమంలో ఆ అంశంపైనా చర్చించారు. అనంతరం బీఆర్‌ఎస్‌లో పరిణామాలు, కవిత కొత్త కార్యాలయం ప్రారంభంపై మాట్లాడుకున్నట్టు సమాచారం. ఈ సందర్భంగా బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటేననే అభిప్రాయం ప్రజల్లోకి బలంగా వెళ్లిందని అభిప్రాయపడ్డట్టు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు వస్తాయని మరికొందరు మంత్రులు అన్నట్లు సమాచారం.

సీఎంను కలిసిన మందకృష్ణ

సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం జూబ్లీహిల్స్ నివాసంలో సీఎంను కలిసి ఆయనతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మందకృష్ణకు సీఎం శాలువా కప్పి సన్మానించారు. రాష్ట్రపతి నుంచి పద్మశ్రీ అవార్డును అందుకున్న ఆయన్ను సీఎం అభినందించారు. కాగా, ఉమ్మడి రాష్ట్ర తొలి సీఎం నీలం సంజీవరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీఎం నివాళులర్పించారు.

రాష్ట్ర ప్రజలకు ఆవిర్భావ శుభాకాంక్షలు: సీఎం రేవంత్

తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలు జరుపుకొంటున్న సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు కలిసికట్టుగా పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం పదకొండేళ్లు పూర్తి చేసుకుని పన్నెండో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా రాష్ట్ర సాధన పోరాటంలో ప్రాణాలర్పించిన అమరుల త్యాగాలను సీఎం స్మరించుకున్నారు. ఉద్యమంలో పాలుపంచుకున్న కవులు, కళాకారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, మేధావులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, కార్మికులు, కర్షకులు, మహిళలు, రాజకీయ నాయకులందరికీ అభినందనలు తెలిపారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ రైజింగ్ నినాదంతో రాష్ట్ర ఆర్థిక వృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందన్నారు. అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచేలా సరికొత్త విధానాలతో.. భవిష్యత్తు ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. మేరకు సీఎంవో ఒక ప్రకటన విడుదల చేసింది. ఇదిలా ఉండగా.. మంత్రివర్గ విస్తరణ, పీసీసీ కార్యవర్గాల ఖరారుపై ఏఐసీసీతో మాట్లాడేందుకు త్వరలో సీఎం రేవంత్ ఢిల్లీ వెళ్లనున్నారు.

రాజీవ్ యువ వికాసానికి తాత్కాలిక బ్రేక్

» నేటి రుణ మంజూరు పత్రాల అందజేత వాయిదా

» కొనసాగుతున్న దరఖాస్తుల పరిశీలన

» జూన్ 5న క్యాబినెట్ సమావేశంలో స్పష్టత!

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం కింద రుణ మంజూరు పత్రాల అందజేతకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. వాస్తవానికి సోమవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున ప్రారంభించి ఈ నెల 9వరకు లబ్ధిదారులకు ఈ పత్రాలు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే వీటి పంపిణీకి సంబంధించి ఆదివారం రాత్రి వరకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాకపోవడంతో ఏర్పాట్ల విషయంలో అధికార యంత్రాంగం అయోమయంలో పడిపోయింది. ఎట్టకేలకు సోమవారం జరగాల్సిన రుణ మంజూరు పత్రాల అందజేత విషయంపై ఆదివారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులతో నిర్వహించిన సమావేశంలో వాయిదా వేసినట్లు ప్రకటించారు. సమావేశంలో రాజీవ్ యువ వికాసంపై చర్చించారు. ఈ సందర్భంగా రాజీవ్ యువ వికాసానికి అంచనాలకు మించి దరఖాస్తులు వచ్చాయని, అనర్హులకు పథకం అందకుండా చూడాలన్న ఫిర్యాదులు పెద్దఎత్తున వచ్చాయని మంత్రులు సమావేశంలో సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దరఖాస్తుల స్క్రీనింగ్ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో పూర్తిస్థాయి పరిశీలన తర్వాతే అర్హుల జాబితాలను ప్రకటించాలని నిర్ణయం తీసుకున్నారు. మరింత లోతుగా విశ్లేషించి లబ్ధిదారులను గుర్తించాలని నిర్ణయించారు. ఒక్క అనర్హుడికీ రాజీవ్ యువ వికాసం ద్వారా లబ్ధి చేకూరవద్దని తెలిపారు. ఈ అంశంపై క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. కాగా ఈ నెల 5న క్యాబినెట్ సమావేశం నిర్వహించాలని నిర్ణయించగా.. ఈ సమావేశంలో యువ వికాసంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఈ కారణాలూ పరిగణనలోకి..

రాజీవ్ యువ వికాసం పథకానికి రాష్ట్రవ్యాప్తంగా 16.23 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. ఇందులోంచి 5 లక్షల మంది లబ్ధిదారులను ఎంపిక చేసి స్వయం ఉపాధి కల్పించాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఈ నేపథ్యంలో ఈ నెల 2 నుంచి 9 వరకు రుణ మంజూరు పత్రాలు పంపిణీ జరుగుతుందని అంతా ఎదురుచూశారు. మొదటి విడతలో రూ.50వేల నుంచి రూ.లక్షలోపు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మాత్రమే మంజూరు పత్రాలు అందజేస్తామని ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. కేటగిరీ-1లో రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు దరఖాస్తుదారుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. దాదాపు 2.8 లక్షల మందికి ఈ కేటగిరీ కింద యూనిట్లు మంజూరు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం కాగా 1,32,634 మందే దరఖాస్తు చేసుకున్నారు. రూ.50వేలలోపు యూనిట్‌కు పూర్తి రాయితీ ప్రకటించినా 39,401 మంది మాత్రమే దరఖాస్తు చేశారు. రూ.లక్షలోపు యూనిట్లకు 90% రాయితీని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఈ కేటగిరీల్లో 93,233 దరఖాస్తులు వచ్చాయి. గరిష్ఠ దర రూ.4 లక్షలు కలిగిన యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకే ఎక్కువ మంది ఆసక్తి చూపారు. అయితే దరఖాస్తుల్లో పేర్కొన్న యూనిట్లను ఆ తర్వాత కూడా అభ్యర్థి మార్చుకునే వెసులుబాటు ఉండడంతో కొన్ని మార్పులు జరిగే అవకాశం ఉంది.

తెలంగాణ, ఏపీతో విన్ గ్రూప్ చర్చలు!

» ఈవీ ప్లాంట్ నెలకొల్పే యోచనలో వియత్నాం సంస్థ

హయ్ ఫాంగ్ (వియత్నాం), జూన్ 1: వియత్నాంకు చెందిన ప్రముఖ ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ) తయారీ సంస్థ విన్‌ఫాస్ట్.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో సంప్రదింపులు జరుపుతోంది. విన్ గ్రూప్‌కు చెందిన విన్‌ఫాస్ట్ రూ.17 వేల కోట్లతో ఈవీల తయారీ యూనిట్‌ను ఇప్పటికే తమిళనాడులోని తూతుకుడిలో ఏర్పాటు చేస్తోంది. భారత మార్కెట్‌లో ఈ ఏడాది రాబోయే పండగల సీజన్‌కల్లా విన్‌ఫాస్ట్‌కు చెందిన వీఎఫ్6, వీఎఫ్7 ఈవీలను ప్రవేశపెట్టాలని సంస్థ యోచిస్తోంది. "మేం భారత్‌లో చాలా రాష్ట్రాల్లో పర్యటించాం. అనేక ప్రాంతాలను పరిశీలించాం. చివరికి తూతుకుడిలో ఈవీల ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నాం. ఎందుకంటే అక్కడ మౌలిక సదుపాయాలు బాగున్నాయి. సమీపంలోనే నౌకాశ్రయం, విమానాశ్రయం ఉన్నాయి" అని విన్‌ఫాస్ట్ ఆసియా సీఈవో ఫామ్ సాన్ చౌ చెప్పారు. ఈ ఏడాది పండగ సీజన్‌లోపే వీఎఫ్6, వీఎఫ్7 ఈవీలను భారత మార్కెట్లో ప్రవేశపెడతామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలతో కూడా చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. భారత మార్కెట్ చాలా కీలకమని, తాము మరింత విస్తరించాలని ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు చెప్పారు. 15 నెలలుగా తమిళనాడులో ప్లాంట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు.

వేలిముద్రల కోసం మూడుసార్లు బారులు

» ముందస్తు రేషన్ పంపిణీలో లబ్ధిదారుల ఇబ్బందులు

» ఆదివారం పూర్తిస్థాయిలో ప్రారంభం కాని పంపిణీ

హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): మూడు నెలల రేషన్‌ను లబ్ధిదారులకు ఒకేసారి పంపిణీ చేసే కార్యక్రమం ఆదివారం నుంచి ప్రారంభమయింది. అయితే జూన్, జూలై, ఆగస్టు నెలలకు వేలిముద్రల కోసం మూడుసార్లు రేషన్ దుకాణాల ముందు బారులు తీరాల్సిరావడం లబ్ధిదారులకు ఇబ్బందికరంగా మారింది. అటు డీలర్లకు రేషన్ బియ్యం పూర్తిస్థాయిలో అందకపోవడంతో చాలా జిల్లాల్లో ఆదివారం పంపిణీ జరగలేదు. సోమవారం నుంచి పూర్తిస్థాయిలో పంపిణీ ప్రారంభమవుతుందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో ఉన్న 92 లక్షల రేషన్ కార్డుల్లో, 55 లక్షలు కేంద్రం ఇచ్చిన ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ కార్డులు కాగా, 37 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన కార్డులు ఉన్నాయి. ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ కార్డుదారులకు కేంద్రం ఇచ్చే 5 కిలోల బియ్యానికి రాష్ట్రం అదనంగా 1 కిలో కలిపి ఇస్తోంది. దీంతో ప్రతి నెలా రెండుసార్లు వేలిముద్రలు వేయడం అవసరం అవుతుంది. మూడు నెలల ముందస్తు పంపిణీ కావడం వల్ల ఒక్కో కార్డుదారుడు ఆరుసార్లు వేలిముద్ర వేయించాల్సి ఉంటుంది.

నేటి నుంచి స్లాట్ బుకింగ్‌తోనే రిజిస్ట్రేషన్లు

రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు.. ఒక్కో చోట రోజుకి 48 స్లాట్లు

» అత్యవసర సందర్భాల్లో ఐదు వాకిన్ రిజిస్ట్రేషన్లకు అనుమతి

» రిజిస్ట్రేషన్ సేవల్లో వాట్సాప్ చాట్‌బాట్

» 82476 23578కు వాట్సాప్ చేస్తే సందేహాలకు సమాధానమివ్వనున్న ఏఐ

» అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష



హైదరాబాద్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోమవారం నుంచి రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్ విధానం అమలులోకి రానుంది. అలాగే, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రజలకు వచ్చే సందేహాల నివృత్తికి కృత్రిమ మేధ(ఏఐ)తో పనిచేసే వాట్సాప్ చాట్‌బాట్‌ను కూడా ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తుంది. 82476 23578 నెంబర్‌కు సందేహాలను వాట్సాప్ చేస్తే ఏఐ సమాధానం ఇస్తుంది. స్లాట్ బుకింగ్ విధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలులోకి తీసుకువస్తున్న నేపథ్యంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో ఆదివారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా ఇప్పటివరకు రెండు విడతల్లో 47 చోట్ల స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేశామన్న మంత్రి.. సోమవారం నుంచి మిగిలిన 97 కార్యాలయాల్లో కూడా అమలు చేస్తున్నామని తెలిపారు స్లాట్ బుకింగ్ విధానం అమలులో ఎలాంటి సాంకేతిక సమస్యలు ఎదురుకాకుండా చూడాలని స్పష్టం చేశారు. స్లాట్ బుకింగ్ విధానంపై 94 శాతం ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. తొలి దశలో 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏప్రిల్ 10 నుంచి ఇప్పటివరకు 30,592 డాక్యుమెంట్లు, రెండో దశలో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మే 12 నుంచి ఇప్పటివరకు 14,099 డాక్యుమెంట్లు మొత్తం 45,191 రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. స్లాట్ బుకింగ్ వల్ల సాధారణం కంటే మూడు వేల డాక్యుమెంట్లు ఎక్కువగా రిజిస్ట్రేషన్ జరిగాయని ఆయన తెలిపారు.

రోజుకి 48 స్లాట్లు, వాట్సాప్ చాట్‌బాట్


సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు(మధ్యాహ్న భోజన విరామ సమయం మినహాయించి) రిజిస్ట్రేషన్ కోసం ప్రజలు స్లాట్ బుక్ చేసుకోవచ్చని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. ప్రతి కార్యాలయంలో రోజుకు 48 స్లాట్‌లు అందుబాటులో ఉంటాయని చెప్పారు. స్లాట్ బుకింగ్ చేసుకోని వారి కోసం.. అత్యవసర సందర్భాల్లో సాయంత్రం 5 నుంచి 5.30 గంటల వరకు ఐదు వాకిన్ రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇచ్చామని తెలిపారు. ఇక, ఏఐ అనుసంధానంతో పని చేసే వాట్సాప్ చాట్‌బాట్‌ను అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందుబాటులోకి తెచ్చామని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ చేసుకునే వారు తమ సందేహాలు నివృత్తి చేసుకోవచ్చునని వివరించారు. రిజిస్ట్రార్ కార్యాలయం లొకేషన్, స్లాట్ బుకింగ్ ఖాళీలు, సమయం, గిఫ్ట్ డీడ్, సేల్ డీడ్‌పై వసూలు చేసే రుసుములు తదితర వివరాలపై ఏఐ చాట్‌బాట్ సమాచారం ఇస్తుందని తెలిపారు. అదే విధంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ఆధార్ ఈ-సంతకం విధానాన్ని ప్రవేశపెడుతున్నామని మంత్రి పొంగులేటి చెప్పారు. తొలుత ఈ విధానాన్ని నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, ఖమ్మం జిల్లా కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని క్రమంగా రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. ఇక, అక్రమాలకు చెక్ పెట్టేలా లేఅవుట్‌ల్లో డబుల్ రిజిస్ట్రేషన్‌లు జరగకుండా ఉండేందుకు రిజిస్ట్రేషన్ పూర్తయిన, పూర్తికాని ప్లాట్ల వివరాలు రిజిస్ట్రేషన్ కార్యాలయం, బిల్డర్, డెవలపర్ దగ్గర ఉండేలా త్వరలో రిజిస్ట్రేషన్ మాడ్యూల్‌ను తీసుకువస్తామని తెలిపారు. ఈ మాడ్యూల్‌లో రిజిస్ట్రేషన్ పూర్తయిన ప్లాట్ల వివరాలు ఎర్ర రంగులో కనిపిస్తాయని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. కాగా, స్లాట్ బుకింగ్ విధానం దృష్ట్యా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పని భారం అధికంగా ఉన్న పఠాన్‌చెరు, యాదగిరిగుట్ట, గండిపేట, ఇబ్రహీంపట్నం, సూర్యాపేట, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల్ సహా తొమ్మిది చోట్ల అదనపు సబ్ రిజిస్ట్రార్, సిబ్బందిని నియమించామని ఆయన వివరించారు.

కుటుంబ డ్రామాల్లో..

బీజేపీ పాత్రధారి, సూత్రధారి కాదు

(మొదటిపేజీ తరువాయి)

మండిపడ్డారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ తెలంగాణను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టాయని ఆరోపించారు. ఈ రెండు ప్రభుత్వాల వైఖరి వల్ల రూ.10లక్షల కోట్ల అప్పు అయిందని, ఒక్క సింగరేణికే సర్కారు రూ.42వేల కోట్లు బాకీ ఉందని పేర్కొన్నారు. పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు సీఎం రేవంత్ పాకిస్థాన్‌తో యుద్ధం గురించి మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన హామీల అమలు ఏమైందో రేవంత్ మాట్లాడరని మండిపడ్డారు. తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ వస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని స్పష్టం చేశారు. 11 ఏళ్ల మోదీ పాలనలో చేపట్టిన కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకువెళ్లాలని పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ అవినీతి, కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కిషన్‌రెడ్డి ఈ సందర్భంగా సూచించారు.



నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌కు హాజరైన బీజేపీ నేతలు

బీఆర్‌ఎస్‌విలీనంపై కేసీఆర్‌ను అడగాలి: లక్ష్మణ్

బీజేపీలో బీఆర్‌ఎస్ విలీన ప్రక్రియ ఎప్పుడూ చర్చకు రాలేదని, విలీనం సంగతిని కేసీఆర్‌నే అడగాలని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ కులగణనపై మాట్లాడలేదని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడే అది గుర్తుకు వస్తుందన్నారు. నిజామాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. కులగణనపై మోదీ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని చెప్పారు.

మహేశ్ గౌడ్ కేసీఆర్ కోవర్టు

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్.. కేసీఆర్ కోవర్టు అని బీజేపీ ఎమ్మెల్యేలు ఆరోపించారు. తమ పార్టీ ఎంపీ ఈటల రాజేందర్ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ఆయన కుట్రలు చేస్తున్నారని పైడి రాకేశ్‌రెడ్డి, పాల్వాయి హరీశ్, ధన్‌పాల్ సూర్యనారాయణ, రామారావు పటేల్ మండిపడ్డారు. కాగా, ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ భరోసా పేరిట కొత్త కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రతీరోజు ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు ఒక ముఖ్య నేత రాష్ట్ర పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. తొలిరోజు సోమవారం ఎంపీ ఈటల ఉంటారు.

మరో నాలుగు రాజన్న కోడెల మృతి

» ఇప్పటి వరకు 17 జీవాల మృత్యువాత

సిరిసిల్ల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం గోశాలలో కోడెల మృత్యుఘోష ఆగడం లేదు. ఆదివారం తిప్పాపూర్ గోశాలలో మరో నాలుగు కోడెలు అనారోగ్యంతో చనిపోయాయి. దీంతో చనిపోయిన జీవాల సంఖ్య 17కు చేరింది. అనారోగ్యం బారిన పడిన కోడెలకు చికిత్స అందించడానికి ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. గోశాలలో సామర్థ్యానికి మించి కోడెల సంఖ్య పెరిగిపోవడంతో ఆదివారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పర్యవేక్షణలో జిల్లాలోని రైతులకు 64 కోడెలను పంపిణీ చేశారు. కోడెల మృతి, అనారోగ్యం బారిన పడిన కోడెలకు అందిస్తున్న చికిత్సపై జిల్లా పశుసంవర్ధక శాఖ హెల్త్ బులెటిన్‌ను విడుదల చేసింది. వేములవాడ ఆలయానికి సంబంధించి తిప్పాపూర్ గోశాలలో ఉన్న కోడెల రక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టామని, కోడెలు పూర్తిగా ఆరోగ్యంగా అయ్యే వరకు వైద్య శిబిరం నిర్వహిస్తామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. కలెక్టర్ అధ్యక్షతన కోడెల ఆరోగ్యాన్ని పరిశీలించి 500 పశువులకు ఎల్ఎస్‌డీ వ్యాక్సిన్ వేశామని, అనారోగ్యంతో ఉన్న 20 పశువులకు ప్రత్యేక చికిత్స అందించామని తెలిపారు.గోశాలలో ఇప్పటి వరకు 17 కోడెలు అనారోగ్యంతో మరణించాయని మిగిలిన పశువులు ఆరోగ్యంగా ఉన్నాయని తెలిపారు.


యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ తూర్పు రాజగోపురం వద్ద భక్తుల రద్దీ

యాదగిరిగుట్టలో భక్తుల రద్దీ

» లక్ష్మీనృసింహుడిని దర్శించుకున్న 90వేల మంది భక్తులు

యాదగిరిగుట్ట, జూన్ 1(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వేసవి సెలవులు ముగుస్తుండటం, వారాంతపు సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రధానాలయం, శివాలయం, కల్యాణ మండపం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాలలు కిటకిటలాడాయి. సుమారు 90వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా, ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది.

నేడు పలు జిల్లాలకు వర్ష సూచన

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సోమ, మంగళవారాల్లో పలు జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వర్ష సూచన చేసింది. కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. సోమవారం నారాయణపేట, వనపర్తి, గద్వాల, నల్లగొండ, వికారాబాద్, మెదక్, సంగారెడ్డి, జనగాం, ఖమ్మం జిల్లాల్లో కొన్ని చోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. మంగళవారం ములుగు, కొత్తగూడెం, యాదాద్రి, వికారాబాద్, నారాయణపేట, వనపర్తి, గద్వాల జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

వెబ్‌సైట్‌లో పేరు లేకుంటే డాక్టర్ కాలేరు

» పేర్లను చెక్ చేసుకోండి

» 2024-25 వైద్య విద్యార్థులకు ఎన్ఎంసీ సూచన

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ 2024-25 విద్యాసంవత్సరానికి ప్రవేశాలు పొందిన విద్యార్థులు జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) విడుదల చేసిన జాబితాలో తమ పేర్లు ఉన్నాయో, లేదో వెంటనే తనిఖీ చేసుకోవాలని ఎన్ఎంసీ కోరింది. ఈ మేరకు ఆదివారం తన అధికారిక వెబ్‌సైట్‌లో కొన్ని సూచనలు, మార్గదర్శకాలు జారీ చేసింది. వెబ్‌సైట్‌లో పేర్లు ఉన్నవాళ్లు మాత్రమే కోర్సు ముగిసిన తర్వాత మెడికల్ ప్రాక్టీస్ చేసుకునేందుకు అర్హత ఉంటుందని ఎన్ఎంసీ స్పష్టం చేసింది. గతేడాది వివిధ సాంకేతిక కారణాల వల్ల విద్యార్థులు కళాశాలల్లో చేరే తుది గడువును ఎన్ఎంసీ మూడు సార్లు పెంచింది. దీంతో కొన్ని కాలేజీలు విద్యార్థుల అడ్మిషన్ల వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరచలేదని, మరికొన్ని కాలేజీలు అసంపూర్తిగా నమోదు చేశాయని ఎన్ఎంసీ తెలిపింది. వెబ్‌సైట్‌లో వివరాలు లేని వారు తక్షణమే తమ రాష్ట్ర వైద్య విద్య సంచాలకుడిని సంప్రదించాలని సూచించింది.

శ్రీవారి మెట్టు మార్గంలో చిరుత కలకలం

తిరుమల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు కాలినడకన వచ్చే శ్రీవారి మెట్టు మార్గంలో ఆదివారం చిరుత సంచారం కలకలం రేపింది. మార్గంలోని 500 మెట్టు వద్ద ఉన్న పొదల్లో ఓ చిరుత కనిపించినట్టు కొందరు భక్తులు సమీపంలోని భద్రతా సిబ్బందికి సమాచారమిచ్చారు. దీంతో ఫారెస్ట్ సిబ్బందితో కలిసి వారు ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. అయితే ఆ ప్రదేశంలో చిరుత జాడలేమి కనిపించలేదు. అయినప్పటికీ చిరుత ఉంటే అడవిలోకి వెళ్లిపోయేలా సైరన్లు వేశారు. శనివారం సాయంత్రం కూడా శిలాతోరణానికి సమీపంలోని మూర్తినాయన చెరువు సమీపంలో ఓ చిరుత సంచరించినట్టు ఫారెస్ట్ అధికారులు తెలిపారు. జనసంచారంలోకి రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు.

కామాఖ్య దేవిపై వివాదాస్పద వ్యాఖ్యలు

» ఎక్స్‌లో పోస్టు చేసిన కోల్‌కతా వ్యక్తిపై ఫిర్యాదు

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): అసోంలోని ప్రముఖ హిందూ దేవత అయిన కామాఖ్య దేవిపై ఎక్స్‌లో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కోల్‌కతాకు చెందిన రషీది వజహత్‌పై చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్‌కు ఫిర్యాదు అందింది. తెలంగాణ బీజేపీ లీగల్ సెల్ న్యాయవాది కె.కరుణా సాగర్ ఈ ఫిర్యాదు చేశారు. కామాఖ్య దేవి ఫొటో పెట్టి అభ్యంతరకర భాషలో రషీది వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. దీనిపై సోషల్ మీడియాలో విమర్శలు రావడంతో అతడు ఆ పోస్టును తర్వాత తొలగించాడు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి బాలీవుడ్ నటుల్లో కొందరు మౌనం వహించడంపై శర్మిష్ఠ పనోలీ చేసిన వ్యాఖ్యలపై ఫిర్యాదు చేసిన వారిలో ఈ రషీదీ కూడా ఉన్నాడని తెలిపారు. అతడిపై కేసు నమోదు చేయాలని కోరారు.

బీఎండబ్ల్యూ కారు కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య

జగదేవ్‌పూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తనకు బీఎండబ్ల్యూ కారు కొనివ్వడం లేదనే మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం చాట్లపల్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన బొమ్మ కనకయ్య, కనకమ్మల కుమారుడు జానీ (21) పదో తరగతి వరకు చదివాడు. చదువు మానేసి తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. తనకు బీఎండబ్ల్యూ కారు కొనివ్వాలని లేదంటే చనిపోతానని కొద్ది రోజులుగా వారిని బెదిరించేవాడు. అంత పెద్ద కారు కొనే స్తోమత తమకు లేదని తల్లిదండ్రులు చెప్పినా వినకుండా వారిని ఇబ్బందులకు గురి చేసేవాడు. అతడి బాధలను భరించలేని తల్లిదండ్రులు శుక్రవారం సిద్దిపేటలోని కారు షోరూంకు తీసుకెళ్లి మారుతి స్విఫ్ట్ డిజైర్ కారు కొనిస్తామని చెప్పగా తనకు నచ్చిన కారు కొనివ్వడం లేదని జానీ మనస్తాపం చెందాడు. తనకు మరో కారు వద్దంటూ వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం ఆర్వీఎం ఆసుపత్రిలో చేర్పించగా శనివారం మృతి చెందాడు.

భద్రాచలం దేవస్థానంలో అన్యమత ప్రచారం

» వస్త్రాల కౌంటర్‌లో సంచిపై అన్యమత వాక్యాలు

భద్రాచలం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలోని శేష వస్త్రాల విక్రయ కౌంటర్‌లో అన్యమత ప్రచారం జరగడం కలకలం రేపుతోంది. వస్త్రాలు కొనుగోలు చేసే భక్తులకు ఇచ్చిన సంచిపై అన్యమతానికి చెందిన వాక్యాలు ఉండటం వివాదానికి కారణమైంది. గుంటూరుకు చెందిన మేళ్లచెరువు జనార్దనరావు అనే భక్తుడు ఆదివారం తమ కుటుంబ సభ్యులతో సీతారామచంద్రుల దర్శనం చేసుకున్నారు. శేష వస్త్రాల విక్రయ కౌంటర్‌లో రెండు చీరలతో పాటు ఇతర వస్త్రాలను కొనుగోలు చేశారు. కౌంటర్ నిర్వాహకులు వస్త్రాలను పెట్టి ఇచ్చిన సంచులపై అన్యమతానికి సంబంధించిన వాక్యాలు ముద్రించి ఉండటంతో జనార్ధనరావు కుటుంబసభ్యులు అవాక్కయ్యారు. ఈ ఘటనపై భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవికి లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. ఘటన దురదృష్టకరమని, దేవస్థానంలో అన్యమత ప్రచారం జరకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. దీంతో ఈవో తమ సిబ్బందితో వెళ్లి తనిఖీలు నిర్వహించారు. కౌంటర్‌లో మరికొన్ని అన్యమత ప్రచార సంచులు కూడా లభ్యమైనట్లు సమాచారం. దీంతో కాంట్రాక్టరు ఎస్‌వీసీహెచ్ సుబ్బారావుకు నోటీసు జారీ చేసి 24 గంటలలో వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిసింది.



అన్యమతానికి సంబంధించిన వాక్యాలు ముద్రించిన సంచి ఇదే

ఆవిర్భావ దినోత్సవానికి
ఘనంగా ఏర్పాట్లు

» నేడు పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు

» ఉదయం 9.40గంటలకు ప్రారంభం

» జాతీయ జెండా ఎగురవేయనున్న సీఎం

» ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన 9 మందికి రూ.కోటి చొప్పున చెక్కులు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం 12వ పడిలోకి అడుగుపెడుతున్న వేళ.. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్స్‌లో సోమవారం ఉదయం 9.40 గంటలకు వేడుకలు ప్రారంభం కానున్నాయి. కార్యక్రమంలో సీఎం రేవంత్ జాతీయ జెండాను ఎగురవేస్తారు. తర్వాత జాతీయ గీతాన్ని, తెలంగాణ రాష్ట్ర గీతాలాపన, పోలీసుల గౌరవ వందనం, పరేడ్ ఉంటాయి. అనంతరం సీఎం ప్రసంగిస్తారు. పలు రంగాల్లో విశేష సేవలు అందించినవారికి పతకాలను అందిస్తారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కవులు, కళాకారులు, ఇతర ప్రముఖులను సత్కరిస్తారు. డిసెంబర్ 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సందర్భంగా సీఎం చేసిన ప్రకటన మేరకు గూడ అంజయ్య, గద్దర్, బండి యాదగిరి, అందెశ్రీ, గోరటి వెంకన్న, సుద్దాల అశోక్ తేజ, గోడిశాల జయరాజ్, పాశం యాదగిరి, ఎక్కా యాదగిరిలకు రూ.కోటి చెక్కు, ఫ్యూచర్‌సిటీలో 300 గజాల చొప్పున ఇంటి స్థలం పత్రాలను అందించనున్నారు. మరణించినవారికి సంబంధించి వారి కుటుంబ సభ్యులకు అందజేస్తారు.

వేడుకలకు జపాన్ అతిథి..

రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో జపాన్‌లోని కితాక్యూష నగర మేయర్ కజుహిసా టకేచీ అతిథిగా పాల్గొననున్నారు. ఆయన తన ప్రతినిధి బృందంతో కలిసి ఆదివారమే హైదరాబాద్ చేరుకున్నారు. వేడుకల అనంతరం ఐటీసీ కాకతీయ హోటల్‌లో తెలంగాణ ప్రభుత్వం- కితాక్యూష నగర ప్రతినిధులు పలు అంశాలపై ఒప్పందాలు చేసుకోనున్నారు. ఇటీవల జపాన్ పర్యటనకు వెళ్లిన సందర్భంగా కితాక్యూష నగరాన్ని సీఎం రేవంత్ సందర్శించారు. హైదరాబాద్‌కు రావాలని మేయర్ టకేచీని ఆహ్వానించారు.

ముస్తాబైన మహానగరం

ఆవిర్భావ వేడుకల కోసం మహానగరం సుందరంగా ముస్తాబైంది. ప్రధాన కూడళ్లను, ప్రభుత్వ కార్యాలయాలు, చారిత్రక కట్టడాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. గన్‌పార్కు వద్ద అమరులకు నివాళులు అర్పించనున్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ప్రజలకు ప్రపంచ సుందరి శుభాకాంక్షలు

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ప్రపంచ సుందరి ఓపల్ సుచాత శుభాకాంక్షలు తెలిపారు. ఆమెతో పోటీల్లో పాల్గొన్న మరికొందరు అందాల భామలు కూడా శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఒక వీడియోను విడుదల చేశారు.




విద్యుత్ వెలుగులలో సచివాలయం

625 మంది పోలీసులకు పతకాలు

రాష్ట్ర అవతరణ దినోత్సవాల సందర్భంగా 625 మంది ప్రతిభావంతులైన పోలీసులకు సేవా పతకాలను ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో 461 సేవా పతకాలు, 92 ఉత్తమ సేవా పతకాలు, 16 మహోన్నత సేవా పతకాలు, 47 కఠిన సేవా పతకాలు, 9 శౌర్య పతకాలు ఉన్నాయి. గ్రేహౌండ్స్ విభాగానికి చెందిన 9మందికి శౌర్య పతకాలు లభించాయి. 22 మంది అవినీతి నిరోధక శాఖ అధికారులకు, ఆరుగురు విజిలెన్స్ సిబ్బందికి పతకాలు ప్రకటించారు.

కోయభాషలో ఆహ్వాన పత్రికలు

భద్రాచలం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ప్రముఖులు, వివిధ శాఖల అధికారులను ఆహ్వానించేందుకు కోయభాషలో ఆహ్వాన పత్రాలను ముద్రించారు. గిరిజన సంస్కృతి సంప్రదాయాలు, భాష అంతరించి పోకుండా, నేటి తరానికి అవగాహన కల్పించే లక్ష్యంతో కోయభాషను తెలుగులిపిలో ముద్రించామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ చెప్పారు.

హామీలను అమలు చేస్తూ ప్రజల్లో విశ్వాసం నింపాలి: కేసీఆర్

» ప్రజలకు ఆవిర్భావ శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ అధినేత

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం దినోత్సవం జూన్ 2 సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పార్లమెంటరీ పంథాలో కొట్లాడి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నామని, ఉమ్మడి పాలనలో ఆగమైన తెలంగాణను స్వయం పాలనలో అభివృద్ధి చేసుకున్నామని తెలిపారు. సమస్త రంగాల్లో ప్రగతిని సాధిస్తూ, పదేండ్ల అనతికాలంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుకొన్నామని పేర్కొన్నారు. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ, అన్ని వర్గాల ప్రజల జీవన విధానం మరింత గుణాత్మకంగా సాగే దిశగా పాలనా ప్రాధాన్యతలను ఎంచుకొని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేసీఆర్ సూచించారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజల్లో విశ్వాసం నింపాలన్నారు.

మావోయిస్టులపై మారణ హోమం ఆపాలి

మానవత్వం లేని మోదీ, అమిత్‌షా.. కార్పొరేట్లకు ఖనిజ సంపద అప్పగించేందుకే ఆపరేషన్ కగార్

» టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్ గౌడ్

» ఆపరేషన్ కగార్ నిలిపివేతకు 14న లెఫ్ట్ పార్టీల మహాధర్నా

» కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతు

హైదరాబాద్ సిటీ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులపై మారణ హోమం నిలిపివేయాలని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఆదివారం శాంతి చర్చల కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, పౌర హక్కుల నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు కనీస మానవత్వం కూడా లేదని విమర్శించారు. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల్లోని అత్యంత విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ఆదివాసీలు, వారికి అండగా నిలిచిన మావోయిస్టుల నిర్మూలనకు కేంద్రం పూనుకున్నదని ఆరోపించారు. మావోయిస్టు సిద్ధాంతాలను తాను అంగీకరించకపోయినా, సమ సమాజ స్థాపన కోసం సర్వం త్యాగం చేసిన నంబాల కేశవరావు మరణం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. వ్యక్తులను చంపగలరే గానీ, సిద్ధాంతాలను నిర్మూలించలేరని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పారని గుర్తు చేశారు. శాంతి చర్చల కమిటీ చేపట్టే కార్యాచరణకు కాంగ్రెస్ పార్టీ మద్దతు ఉంటుందని మహేశ్ చెప్పారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌ను ట్రంప్ జోక్యంతో నిలిపిన వారు దేశ పౌరులపై మారణ హోమం సాగిస్తున్నారని దుయ్యబట్టారు. ఎమ్మెల్సీ కోదండరామ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ మార్గంలోనే ఈ సమస్యలకూ పరిష్కారం దొరుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్‌కు తమ పార్టీ వ్యతిరేకమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తెలిపారు. మానవ హక్కుల వేదిక కన్వీనర్ జీవన్‌కుమార్ మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ నిలిపివేత కోరుతూ దేశంలోని ఆదివాసీ, దళిత, ప్రతిపక్ష ఎంపీలకు లేఖలు రాద్దామని ప్రతిపాదించగా, సభికులంతా అంగీకారం తెలిపారు. ఆపరేషన్ కగార్ నిలిపేయడంతోపాటు శాంతి చర్చలు జరుపాలని కోరుతూ 14న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద మహా ధర్నా చేపట్టాలని వామపక్ష పార్టీల తీర్మానానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలు మద్దతు ప్రకటించారు. ఈ సమావేశానికి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అధ్యక్షత వహించారు.


సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్ గౌడ్

చితాభస్మాన్నీ ఇవ్వలేదు

నంబాల కేశవరావు మృతదేహం ఇవ్వడానికి నిరాకరించిన కేంద్రం.. చివరకు ఆయన చితాభస్మాన్ని కూడా కుటుంబ సభ్యులు తీసుకోవడాన్ని నిరాకరించడం అమానుషమని పూర్వ విప్లవ విద్యార్థుల వేదిక సదస్సులో పాల్గొన్న వక్తలు పేర్కొన్నారు. 'సాయుధ విప్లవ పోరాటం- శాంతి చర్చలు' అనే అంశంపై జరిగిన సదస్సును సామాజికవేత్త ఆచార్య హరగోపాల్ ప్రారంభిస్తూ రాజ్యం హద్దులు దాటినప్పుడు పౌర సమాజం గళం విప్పాలని హితవు చెప్పారు.

సత్వరమే 'స్థానిక' ఎన్నికలు జరపాలి

» అప్పుడే క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం

» మీనాక్షికి స్పష్టం చేసిన కాంగ్రెస్ నేతలు

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలోపేతం కావాలంటే త్వరితగతిన స్థానిక సంస్థల ఎన్నికలు జరపాల్సిందేనంటూ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కు ఆ పార్టీ ఎంపీలు, కంటెస్టెడ్ ఎంపీలు, వివిధ కార్పొరేషన్లు, సంస్థల ఛైర్మన్లు స్పష్టం చేశారు. అలాగే నామినేటెడ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, గ్రామ స్థాయి నుంచి డీసీసీ స్థాయి వరకూ కమిటీల ఏర్పాటునూ పూర్తి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలతో లక్షన్నర మంది వరకు పార్టీ నేతలు, కార్యకర్తలకు పదవులు లభిస్తాయని.. కమిటీలు, నామినేటెడ్ పోస్టుల భర్తీతో లక్షలాది మంది నేతలు, కార్యకర్తలు కొత్త బాధ్యతలు చేపడతారని వివరించారు. దీంతో క్షేత్ర స్థాయిలో పార్టీ పుంజుకుంటుందని, ప్రభుత్వ పథకాలను, పార్టీ కార్యక్రమాలను చురుకుగా ప్రజల్లోకి తీసుకెళ్తారని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ బలోపేతంపై వరుస సమీక్షలు జరుపుతున్న మీనాక్షి.. ఆదివారం హైదరాబాద్‌లోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో పార్టీ ఎంపీలు, కంటెస్టెడ్ ఎంపీలు, వివిధ కార్పొరేషన్లు, సంస్థల ఛైర్మన్లతో ముఖాముఖి సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అయితే సైద్ధాంతిక పునాదులపై పార్టీ నిర్మాణం జరగాలని ఈ సందర్భంగా పలువురు చెప్పారు. ప్రభుత్వ పథకాల పట్ల ప్రజల్లో స్పందన ఎలా ఉందని.. అవి వారికి చేరుతున్నాయా అని మీనాక్షి నేతలతో ఆరా తీయగా.. పూర్తిస్థాయిలో పథకాలు అందకపోవడంతో ప్రజల్లో కొంతమేర అసంతృప్తి నెలకొందని పలువురు చెప్పినట్లు తెలిసింది. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రభుత్వం ప్రజలకు తెలియజేయడంతో ఆ అసంతృప్తి తీవ్ర స్థాయికి చేరలేదని చెప్పినట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికల్లో ఓడిన పార్టీ అభ్యర్థులను.. ఓటమికి గల కారణాలను మీనాక్షి అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ ఓటు బ్యాంకు బీజేపీకి భారీ ఎత్తున బదిలీ కావడం వల్లే తాము ఓడామని వారు చెప్పినట్లు సమాచారం. ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణలో కాంగ్రెస్ ప్రధాన ప్రత్యర్థి ఎవరంటూ పార్టీ ఎంపీలు, కంటెస్టెడ్ ఎంపీలు, కార్పొరేషన్ ఛైర్మన్లను మీనాక్షి ఆరా తీశారు. కాంగ్రెస్‌కు బీఆర్ఎస్, బీజేపీలు ఎక్కడెక్కడ ప్రత్యామ్నాయంగా ఉన్నాయని అడిగారు. ఉత్తర తెలంగాణలో బీజేపీ, దక్షిణ తెలంగాణలో బీఆర్ఎస్ కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఉన్నాయని సదరు నేతలు చెప్పినట్లు తెలిసింది.

జీహెచ్ఎంసీ అత్యవసర బృందాల..
టెండర్ నోటిఫికేషన్ రద్దు చేయాలి

» స్థానిక కాంట్రాక్టర్లకు అన్యాయం జరిగేలా, ప్రజాధనం వృథా అయ్యేలా నిబంధనలు

» రెండు సంస్థలకు లబ్ధి చేకూర్చేలా అధికారుల యత్నం

» వారిపై చర్యలు తీసుకోవాలి

» డివిజన్ల వారీగా టెండర్లు : కవిత

» సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో వర్షాకాల అత్యవసర, తక్షణ మరమ్మతు బృందాలకు సంబంధించిన టెండర్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత.. ప్రభుత్వాన్ని కోరారు. డివిజన్ల వారీగా తిరిగి టెండర్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆదివారం ఆమె బహిరంగ లేఖ రాశారు. స్థానిక కాంట్రాక్టర్లకు అన్యాయం జరిగేలా, ప్రజాధనం వృథా అయ్యేలా టెండర్ నిబంధనలున్నాయని, తమకు నచ్చిన సంస్థలకు పనులు కట్టబెట్టేలా అధికారులు వ్యవహరిస్తున్నారని లేఖలో కవిత ఆరోపించారు. డివిజన్ల వారీగా టెండర్లు పిలిస్తే.. 150 మంది కాంట్రాక్టర్లకు ఉపాధి కలుగుతుందన్నారు. కానీ, జోన్ల వారీగా టెండర్లు పిలవడంతో తొవిృది టెండర్లు మాత్రమే దాఖలు చేసే అవకాశం లభించిందని, వాటిని కూడా రెండు సంస్థలకే కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందని పేర్కొన్నారు. పైగా, ఈ పనులు చేపట్టేందుకు వినియోగించే వాహనాల్లో కొన్ని ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలన్న నిబంధన ఉందని, కానీ.. అలాంటి వాహనాలు విక్రయించే డీలర్లు హైదరాబాద్‌లో ఇద్దరే ఉన్నారని తెలిపారు. స్థానిక కాంట్రాక్టర్లకు వాహనాలు సరఫరా చేసేందుకు ఆయా డీలర్లు సమ్మతి తెలపకపోవడంతో.. వారు కర్ణాటక డీలర్ల నుంచి ఎంవోయూ తీసుకొని టెండర్లలో పాల్గొన్నారని చెప్పారు. అయితే ఆ కాంట్రాక్టర్లు ఎంవోయూ ఫిజికల్ కాపీలు సమర్పించేందుకు జీహెచ్ఎంసీ అధికారులు సమయం ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ఫిజికల్ కాపీలు సమర్పించలేదనే సాకు చూపించి స్థానిక కాంట్రాక్టర్లను టెండర్లలో అనర్హులుగా నిర్ణయించి.. ముందే ఒప్పందం కుదుర్చుకున్న రెండు సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకు కొందరు అధికారులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోందన్నారు. వర్షాకాల అత్యవసర, తక్షణ మరమ్మతు పనుల కోసం గతంలో వినియోగించిన వాహనాల ద్వారా రెండు, మూడు క్యూబిక్ మీటర్ల మెటీరియల్‌ను తరలించే అవకాశం ఉండేదని కవిత గుర్తు చేశారు. కానీ, ఇప్పుడు జీహెచ్ఎంసీ జారీ చేసిన టెండర్ నోటిఫికేషన్‌లో పేర్కొన్న ఏర్పాట్లు ఒక విదేశీ కంపెనీకి చెందిన వాహనాలకు మాత్రమే ఉందన్నారు. ఆ వాహనాల్లో ఒక క్యూబిక్ మీటర్ మెటీరియల్‌ను తరలించడం కూడా సాధ్యం కాదని మీడియా కథనాల ద్వారా తెలుస్తోందన్నారు. పైగా, ఇందుకోసం గతంలో వ్యయమైన రూ.5.40 కోట్లు రెట్టింపయి రూ.11.25 కోట్లకు చేరిందని తెలిపారు. దీంతో ఏటా రూ.5.85 కోట్ల ప్రజాధనం అదనంగా ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. మునిసిపల్ శాఖను ముఖ్యమంత్రే చూస్తున్నందున.. ఆ శాఖ పరిధిలోని జీహెచ్ఎంసీ టెండర్లలో తెలంగాణ బీసీ కాంట్రాక్టర్లకు అన్యాయం జరగకుండా చర్యలు చేపట్టాలని లేఖలో కవిత కోరారు. టెండర్ల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం చేసేందుకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.